


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఆదిలాబాద్ 17-08-2026 సోమవారం సంపుటి : 13 | సంచిక : 287
SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal
Follow us on

# ఇక పరుగులు పెడుతుంది

## రూ. 424 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం | విడతల వారీగా ఉద్యోగాల భర్తీకి సీఎం హామీ

**పరకాల /వరంగల్, ఆగస్టు 16 (వుదయం) :**



రాష్ట్రంలో నిరుద్యోగ యువతను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం రైతు, మహిళ, యువత సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. పరకాల నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా దాదాపు రూ. 424 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

**విడతల వారీగా ఖాళీల భర్తీ**

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిరుద్యోగ యువకుల కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవలే పోలీసు నియామకాల నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు వయోపరిమితిని కూడా సడలించామని వివరించారు. రాబోయే కాలంలో మిగిలిన అన్ని ఖాళీలను విడతల వారీగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

**యువత సమయాన్ని వృథా చేసుకోవద్దు**

వరంగల్ జిల్లాకు గొప్ప చైతన్యం, ఉద్యమ చరిత్ర, పోరాట స్ఫూర్తి ఉన్నాయని సీఎం కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం కూడా ఈ ప్రాంతం నుంచి ప్రజా జీవితంలో సర్వస్వం అర్పించిన మహనీయులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగ యువకుల సంక్షేమం కోసం పనిచేస్తున్న తరుణంలో, యువకులు ఎవరి మాటలు నమ్మి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు.

**అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకావాలి**

రాబోయే సెప్టెంబర్ నెలలో శాసనసభ సమావేశాలను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అనుభవజ్ఞుడైన ప్రతిపక్ష నాయకుడు కె. చంద్రశేఖర్ రావు సభకు హాజరై, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై చర్చించి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

**పట్టాలెక్కిన పాలనా రథం**

రాష్ట్రంపై ఉన్న అప్పుల భారాన్ని మోస్తూనే ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. గతంలో బోల్తా కొట్టిన బండిని తిరిగి పట్టాలెక్కించామని, ఇక నుంచి దానిని పరుగెత్తించడమే మిగిలి ఉందని వ్యాఖ్యానించారు.

**పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్సీ మరియు పిసిసి అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా 2,145 గ్రామీణ

# రహదారుల పునర్నిర్మాణం

### ములుగు కేంద్రంగా పనుల ప్రారంభం

- గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రహదారుల అనుసంధానం
- గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయం



**ములుగు, ఆగస్టు 16 (వుదయం) :**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రహదారుల అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 2,145 గ్రామీణ రహదారుల అభివృద్ధికి శుభారంభం పలికారు. పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ములుగు జిల్లా గట్టమ్మ ఆలయం ఎదురుగా నూతనంగా నిర్మించిన హ్యామ్ (HAM) రోడ్ల పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయం

గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలు, అలాగే రాష్ట్రంలోని ప్రధాన రహదారులకు రోడ్లను అభివృద్ధి చేసి అనుసంధానం చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ రవాణా రంగంలో సరికొత్త అధ్యాయానికి ములుగు కేంద్రంగా తొలి అడుగు పడిందని వివరించారు. రోడ్డు నెట్‌వర్క్ విస్తరణ ద్వారా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక ప్రగతి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వందేమాతరాన్ని అడ్డుకోవడం సిగ్గుచేటు



**చిత్తోర్‌గఢ్ ఆగస్టు 16 (ఎఎంస్):**

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శనివారం నాటి స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా సోనియా గాంధీ అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాట్లాడిన ఆయన, ఈ ఘటనను దేశ ప్రజలందరూ ప్రత్యక్షంగా చూశారని వ్యాఖ్యానించారు.

ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే: అమిత్ షా

కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ పార్టీ జాతీయ గేయాన్ని అవమానించిందని అమిత్ షా మండిపడ్డారు. ఇటువంటి చర్యలు తీవ్ర సిగ్గుచేటని, దేశ ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నటికీ క్షమించరని అన్నారు. జాతీయ గేయాన్ని అవమానించినందుకు గాను సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అమిత్ షా పర్యటన వేళ తీవ్ర ఉద్రిక్తత, అరెస్టులు

మరోవైపు అమిత్ షా ర్యాలీ నేపథ్యంలో చిత్తోర్‌గఢ్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేంద్రమంత్రి పర్యటనకు ముందే కాంగ్రెస్ నాయకులు, పలువురు విద్యార్థి సంఘాల నాయకులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల చోటుచేసుకున్న పేపర్ లీకేజీలు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడుల ఘటనలపై కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుమారు 24 మంది కాంగ్రెస్ నేతలు, విద్యార్థులు నిరసనకు యత్నించారు.

పోలీసులు వారిని బలవంతంగా వాహనాల్లో అక్కడి నుంచి తరలించారు. కాంగ్రెస్ నేతలు, విద్యార్థుల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ వందలాది మంది పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.

# సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో ముఖ్యమంత్రి

**ములుగు, ఆగస్టు 16 (వుదయం) :**



మేడారం (ములుగు): వనదేవతలు సమ్మక్క సారలమ్మల దివ్య సన్నిధిలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పణ**

మొక్కుల చెల్లింపులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఒక మొక్కను నాటారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా గిరిజన పూజారులు డోలు వాయిద్యాలు, సాంప్రదాయ గిరిజన నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.

**చేయూత పింఛన్లు, తాగునీటి ప్లాంట్ ప్రారంభం**

పూజా కార్యక్రమాల అనంతరం స్థానికంగా ఉన్న అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత పింఛన్లను పంపిణీ చేసి, రాష్ట్రవ్యాప్త పంపిణీ కార్యక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టారు. అలాగే, మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శుద్ధి చేసిన తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. మేడారం వచ్చే భక్తులకు నిరంతరం పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**మహిళా సంఘాలతో సీఎం ముచ్చట**

ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల (ఐకేపీ) సభ్యులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వారు చేపడుతున్న వివిధ ఉపాధి కార్యక్రమాలు, వారి ఆర్థికాభివృద్ధికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల సశక్తికరణకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, పోరిక బలరాం నాయక్, కడియం కావ్యలతో పాటు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, నాయని రాజేందర్ రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 800 డ్రోన్లను కూల్చివేశామన్న రష్యా

# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల సమరం

- ఆరుగురు మృతి, విమానాశ్రయాలు మూసివేత

**మాస్కో:**



రష్యా రాజధాని మాస్కో లక్ష్యంగా ఉక్రెయిన్ దళాలు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు విరుచుకుపడ్డాయి. ఏకంగా వెయ్యికిపైగా డ్రోన్లతో కీవ్ దాడికి తెగబడగా, వాటిలో ఎనిమిది వందల డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత ఐదేళ్ల కాలంలో మాస్కోపై ఉక్రెయిన్ జరిపిన అత్యంత భారీ దాడుల్లో ఇది ఒకటని రష్యా వార్తా సంస్థలు వెల్లడించాయి.

**ఆయిల్ రిఫైనరీపై దాడి, ఆరుగురు మృతి**

ఉక్రెయిన్ జరిపిన ఈ దాడుల్లో మాస్కోలోని ఆయిల్ రిఫైనరీ సమీప ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాడి ధాటికి రిఫైనరీ ప్రాంతంలో భారీగా మంటలు చెలరేగి, నగరమంతటా దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో పౌరులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమాన సర్వీసులు రద్దవ్వడమే కాకుండా మరికొన్ని తీవ్రంగా ఆలస్యమయ్యాయి.

**క్రిమియా, కీవ్‌లలో పరస్పర దాడులు**

మరోవైపు క్రిమియా ద్వీపకల్పంపై కూడా ఉక్రెయిన్ తన దాడులను తీవ్రతరం చేసింది. రష్యా సైనిక సరఫరాలు, విద్యుత్ వ్యవస్థలను దెబ్బతీసే లక్ష్యంతో అక్కడ ఉన్న క్షిపణి వ్యవస్థలపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ మిలిటరీ వెల్లడించింది. దీనికి ప్రతిచర్యగా రష్యా దళాలు ఆదివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ పరస్పర దాడుల కారణంగా అనేక నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు అగ్నికీలల్లో చిక్కుకున్నాయి.

# బంగ్లా ప్రధాని ఢిల్లీ పర్యటనపై అనిశ్చితి

**ఢాకా:** తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌ను మరోసారి కోరింది. బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహమాన్ రాబోయే ఢిల్లీ పర్యటనపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఢాకా ఈ అంశాన్ని తిరిగి తెరపైకి తెచ్చింది. ప్రధాని పర్యటనకు ముందు ఇరు దేశాల మధ్య అనుకూల వాతావరణం ఏర్పడాలని ఆకాంక్షిస్తూ, హసీనా అప్పగింత అంశాన్ని పరోక్షంగా దానికి ముడిపెట్టింది.


బ్రిక్స్ సమావేశం, ఢిల్లీ పర్యటనపై చర్చలు


న్యూఢిల్లీ వేదికగా జరగనున్న బ్రిక్స్ (BRICS) సమావేశానికి బంగ్లా ప్రధాని తారిఖ్ రెహమాన్ హాజరయ్యే అంశంపై రెండు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి షాహిదుల్ కరీమ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని రెహమాన్ భారత్ పర్యటనపై గత కొన్ని వారాలుగా చర్చలు జరుగుతున్నాయని, అయితే షేక్ హసీనా బహిరంగంగా చేస్తున్న వ్యాఖ్యలు, సమావేశాల వల్ల కొంత అడ్డంకి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.

సానుకూల స్పందన కోసం నిరీక్షణ

షేక్ హసీనాతో పాటు ఇతర నేరస్థులను ఢాకాకు అప్పగించాలని భారత్‌ను కోరుతున్నట్లు షాహిదుల్ కరీమ్ స్పష్టం చేశారు.

## ఇంతే కదా...!






# అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

- "అధికారులకు ముడుపులు ముడుతున్నట్లు,పలువురి అనుమానం"
- " మట్టి తవ్వకాల.వార్త కథనాలు వచ్చిన బేతకారు చేస్తున్న మైనింగ్ అధికారులు "



**కోహీర్ ఆగస్టు 16**
**(వుదయం ప్రతినిధి )**

కోహీర్ మండల పరిధిలోని చింతల్ ఘట్ గ్రామం లో అక్రమ మట్టి రవాణా దందా యథేచ్ఛగా సాగుతోంది. నియంత్రించే నాథుడే లేడు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. అధికార యంత్రాంగం అండదండలతోనే ఈ అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
జెసిబిలు, భారీ టిప్పర్లు పెట్టి పగలు, రాత్రి తేడా లేకుండా కొండలను, ప్రభుత్వ భూములను తవ్వేస్తున్నారు. వందలాది ట్రిప్పుల మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలు ప్రతిరోజు వందలాది లారీలు రోడ్లపై వెళ్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు ముట్టినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
రాత్రింబవళ్లు మితిమీరిన లోడుతో వెళ్లే భారీ వాహనాల వల్ల పంచాయతీ, విలేజ్ రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతల మయంగా మారుతున్నాయి.
మట్టి లారీల వల్ల విపరీతమైన దుమ్ము లేచి దారినపోయే వాహనదారులు, చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విచక్షణారహితంగా తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.
గత కొన్ని రోజుల క్రితం కొత్తూర్ (డి ) గ్రామం లో మట్టి తవ్వకాల వార్త కథనాలు పలు పత్రికలో వచ్చిన. అధికారులు స్పందించకపోవడంతో "మామూళ్ల మత్తు"లో తూగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వం ఖజానా కు గండి కొడుతున్న మట్టి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రైవేట్ భూమి వద్దుప్రభుత్వ భూమి ముద్దు






- రాజకీయ నాయకుల ఒత్తిడా !
- అధికారుల అసమర్థతనా!
- చండూరు ప్రభుత్వ భూమి ఎమ్మార్వో కార్యాలయానికి అనుకూలం
- భూమి కొనుగోలు చేయడం అధిక భారం
- ప్రభుత్వ భూములలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం
- పది సంవత్సరాలు గడిచిన అభివృద్ధి శూన్యం
- మండల అభివృద్ధి కంటే సొంత ప్రయోజనాలు ముఖ్యమా

**చిలిపిచేడ్ ఆగస్టు 16**
**(వుదయం న్యూస్)**

చిలిపిచేడ్ మండలం ఏర్పాటు 10 సంవత్సరాలు గడుస్తున్నా ఎక్కడి వేసిన గొంగడి అక్కడే ఉన్నట్టు ఉంది ఇప్పటి వరకు కూడా ఒక్కటి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనం లేకపోవడం మండల పరిస్థితి అర్థం అవుతుంది మండలంలో ప్రభుత్వ స్థలాలు లేక కార్యాలయాలు నిర్మాణాలు జరగడం లేదని కొందరు నాయకులు చెబుతున్నారు మండల ఏర్పాటు సమయంలో చండూరు గ్రామ శివారులో ప్రభుత్వ భూమి ఉందని కార్యాలయాలకు మండల ఏర్పాటు అనువైన స్థలంగా అధికారులు భావించారు కానీ కొందరు నాయకులు మా గ్రామ సమీపంలో మండలం ఏర్పాటు చేస్తే భూములు ఇస్తామని అన్నారు ఇప్పటివరకు ఒక సెంటు భూమి కూడా ఇవ్వలేరు అప్పటి ఎమ్మెల్యే మదన్ రెడ్డి చొరవతో చిలిపిచేడ్ లో మండల ఏర్పాటు జరిగింది
జోగిపేట్ నర్సాపూర్ రహదారి పక్కనే చండూరు గ్రామ శివారులో సర్వే నెంబర్ 2లో ప్రభుత్వ భూమిలో ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయాలకు కళాశాలకు దవఖానకు పోలీస్ స్టేషన్ ఇతర కార్యాలయం నిర్మాణంకు అనువైన స్థలంగా భావించారు ఈ భూమి రహదారి పక్కనే ఉండడం విశేషం ఇక్కడ నిర్మాణాలు జరిగితే ప్రజలకు రాకపోకలు సులువుగా ఉంటుందని అన్ని గ్రామాల ప్రజలకు అనువైన స్థలంగా ఉంటుందని భావించారు

**భూమి కొనుగోలుతో ప్రభుత్వానికి అధిక వ్యయం**

ఎమ్మార్వో కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం 2.25 కోట్ల రూపాయలు నిధులు మంజూరు అయినవి ఇప్పటి వరకు స్థల సేకరణ జరగకపోవడం విడ్డూరం అధికారులకు నాయకులకు మండల అభివృద్ధి చేయడంలో చిత్తశుద్ధి ఎంత ఉందో దీనితో అర్థం అవుతుంది ప్రవేట్ భూమి కొనుగోలు చేసి కార్యాలయం నిర్మాణం చేయడం ప్రభుత్వానికి వ్యయం ఎక్కువ అవుతుంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం చేపట్టాలని ఉన్న నిధులతో కార్యాలయం ఆధునిక అంగులతో నిర్మాణం చేపట్టవచ్చని జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని ప్రజలు అంటున్నారు మా గ్రామ సమీపంలో నిర్మాణం చేపట్టాలి ఎమ్మార్వో కార్యాలయానికి స్థలం సేకరణ చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించిన ఇప్పటివరకు కూడా ఏలాంటి నిర్ణయం తీసుకోలేరుకొన్నిగ్రామాల సర్పంచులు సొంత గ్రామ సమీపంలో మండలం నిర్మాణం జరగాలని పోటా పోటీగా కలెక్టర్ కు వినతి పత్రాలు ఇచ్చారు మా గ్రామ సమీపంలో కార్యాలయం నిర్మాణం జరగాలని బడా రాజకీయ నాయకులతో అధికారుల పై ఒత్తిడి తెస్తున్నారు అనే వాదన వినిపిస్తుంది ఏది ఏమైనప్పటికీ మండల అభివృద్ధికి అన్నిగ్రామాల ప్రజలు సహకరించి భవిష్యత్తులో చిలిపిచెడ్ మండలం అభివృద్ధి చేయుటకు అందరూ సహకరించాలని ప్రజలు కోరుచున్నారు

**దశరథ్ (మాజీ బిజెపి మండల అధ్యక్షుడు)**

ఇళ్ల మధ్య కార్యాలయంలో ఉండడం స్థానికులకు ఇబ్బందిగా ఉండడంతో పాటు శాంతిభద్రతల దృష్టి కూడా ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది విధి నిర్వహణలో అధికారులకు ఇబ్బందిగా ఉంటుంది చండూరు శివారులో సర్వే నంబర్ 2 లో ప్రభుత్వ భూమిలో కార్యాలయాలకు అనువైన స్థలం ఎటువంటి ఇబ్బందులు ఉండవు కార్యాలయాలకు స్థలం కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టడం ప్రభుత్వానికి అధిక భారం అవుతుంది రెండు కోట్ల 20 లక్షల నిధులతో స్థలం కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టాలంటే ఉన్న నిధులు సరిపోకపోవచ్చు ఉన్న నిధులతో ప్రభుత్వ భూములలో నిర్మాణం చేపడితే ఆధునిక హంగులతో కార్యాలయంలో నిర్మాణం చేపట్టవచ్చు.



దశరథ్ (మాజీ బిజెపి మండల అధ్యక్షుడు)




# రైతు బీమా ప్రీమియం వెంటనే చెల్లించాలి

- గజ్వేల్ సీపీఐ నాయకుల డిమాండ్

**గజ్వేల్, ఆగస్టు 16**
**(వుదయం ప్రతినిధి)**



రైతు బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించి రైతుల కుటుంబాలను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గజ్వేల్ నాయకులు తీవ్రంగా డిమాండ్ చేశారు. ఈ నెల 13 నాటికే రైతు బీమా పాలసీ గడువు ముగిసినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల ప్రతిరోజూ చనిపోయే అనేక మంది రైతుల కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వారు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్కీమ్ ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడి, ముఖ్యమంత్రి మరియు వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
అలాగే, నిన్నటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ప్రసంగంలో ప్రధాని మోదీ ప్రదర్శించిన భావజాలాన్ని సీపీఐ తీవ్రంగా ఖండించింది. దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని, అభ్యుదయ వామపక్ష భావజాలం ఉన్న వారిని "మేధో నక్సల్స్" అని సంబోధించడం అత్యంత అభ్యంతరకరమని నాయకులు విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేసేందుకే కేంద్రం ఇలాంటి ముద్రలు వేస్తోందని, ఈ వ్యాఖ్యలను ప్రధాని బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించేవారు లేకపోతే సమాజం గుడ్డిదవుతుందని పేర్కొంటూ, ప్రజాస్వామ్యవాదులంతా ఈ ధోరణిపై భవిష్యత్తులో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివలింగ కృష్ణ, గజ్వేల్ పట్టణ కార్యదర్శి మరియు చేనేత సహకార కార్మిక సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ 'ఆర్డర్'.. కిందిస్థాయిలో 'డిజార్డర్'!

- గట్టులో అడ్డగోలు డబ్బాల దందాకు అధికారులే కాపలా?
- 35 ఆక్రమణలు.. తొలగించింది మాత్రం ఐదే!
- పవర్ కట్ చేసినా తగ్గేదేలే అంటున్న అక్రమార్కులు

**గట్టు ఆగస్టు 16 (వుదయం బ్యూరో)**



జిల్లా అత్యున్నత అధికార హోదాలో ఉన్న కలెక్టర్ ఆదేశిస్తేనే పనులు జరగనప్పుడు.. ఇక సామాన్య ప్రజల సమస్యలకు విలువెక్కడిది? జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో జరుగుతున్న తీరు తెన్నులు చూస్తుంటే అధికారుల అలసత్వం ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోంది. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం, దానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ డబ్బాలను తక్షణమే తొలగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెగేసి చెప్పినా.. క్షేత్రస్థాయి యంత్రాంగం మాత్రం 'కేవలం నటన'కే పరిమితమైంది. అధికారుల డ్రామా.. తొలగించింది ఐదే! తహసీల్దార్ కార్యాలయం చుట్టూ మీసేవ, సీఎస్సీ, ఆన్‌లైన్ సెంటర్ల ముసుగులో సుమారు 35 తాత్కాలిక డబ్బాలను అడ్డగోలుగా పాతిపెట్టారు. దారి పొడవునా రోడ్డును ఆక్రమించడంతో నిత్యం వాహనదారులు, పాదచారులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ దందాపై కలెక్టర్ ఆదేశాలతో హడావుడి చేసిన స్థానిక అధికారులు నోటీసుల పర్వంతో సరిపెట్టారు. మొత్తం 35 డబ్బాల్లో కేవలం 4, 5 డబ్బాలను మాత్రమే నామమాత్రంగా తొలగించి, మిగిలిన 30 డబ్బాలను యథాతథంగా వదిలేశారు. కలెక్టర్ ఆర్డర్‌కే గండికొట్టిన ఈ 'కంటితుడుపు చర్యల' వెనుక ఉన్న అసలు రహస్యమేమిటో క్షేత్రస్థాయి అధికారులే చెప్పాలి. కరెంట్ తీసినా తగ్గేదేలే.. వెనుకున్న ఆ 'పెద్దలు' ఎవరు? అధికారులు విద్యుత్ కనెక్షన్లు కట్ చేసినప్పటికీ ఆక్రమణదారులు మాత్రం డబ్బాలను కదిలించేందుకు ఉలకలేదు.. పలకలేదు! కరెంట్ కోసేసినా, నోటీసులు ఇచ్చినా అక్రమార్కులు ఏమాత్రం బెదరకపోవడం వెనుక స్థానిక నాయకుల, అధికారుల అభయహస్తం ఉందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. విద్యుత్ లేకపోయినా దర్జాగా వ్యాపారాలు సాగిస్తూ చట్టాన్ని, అధికారుల ఆదేశాలను సవాల్ చేస్తుంటే యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక 'మామూళ్ల' లాలూచీ ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా నిరసన.. కలెక్టర్ స్పందించాల్సిందే! రోడ్డుపై వాహనం వెళ్లాలన్నా, పాదచారులు నడవాలన్నా గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా బాస్ ఇచ్చిన ఆదేశాలనే బుట్టదాఖలు చేసిన కిందిస్థాయి అధికారుల తీరుపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని, గట్టు తహసీల్దార్ కార్యాలయ పరిసరాల్లోని అక్రమ డబ్బాలన్నింటినీ పూర్తిగా ఊడ్చిపారేసి, రోడ్డుకు విముక్తి కల్పించాలని ప్రజలు భీష్మించుక కూర్చున్నారు. కలెక్టర్ స్పందిస్తారా.. లేక ఆక్రమణదారుల అడ్డగోలు దందాకే తలొగ్గుతారా అన్నది తేలాల్సి ఉంది.

# దుద్దెడ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్ట్ నూతన కార్యవర్గ ఎన్నిక

**వుదయం న్యూస్ కొండపాక**
**ప్రతినిధి ఆగస్టు 16**



మండల పరిధిలోని దుద్దెడ గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం 'శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర సేవా సమితి ట్రస్ట్' నూతన పాలక మండలి ఎన్నికలు ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియకు అధికారులుగా గొల్లపల్లి రఘురామ శర్మ, పెద్ది నర్సయ్య లు వ్యవహరించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడుగా మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గోనె శ్రీనివాస్, నర్ర దేశాయి రెడ్డి,ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ ,కోశాధికారిగా పెద్ది కుమారస్వామి ,సహాయ కార్యదర్శులుగా మంచాల చిన్న శ్రీనివాస్, బూర్గుల వెంకటరమణ ,సలహాదారులుగా మంచాల కృష్ణమూర్తి, అమీరిశెట్టి వెంకటేశం తదితరులు ఎన్నికయ్యారు .ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మంచాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయ సమగ్ర అభివృద్ధికి పాలక మండలి సభ్యులందరి సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆలయ ప్రాంగణంలోని పవిత్ర కోనేరు పునరుద్ధరణ పనులలో మిగిలి ఉన్న అసంపూర్తి పనులను హనుమదీక్ష సేవా సమితి సభ్యులతో సమన్వయ పరచుకొని త్వరితగతిన పూర్తి చేయడమే తమ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతులు కల్పించి, నిత్య పూజా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని సంకల్పం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వడ్లకొండ శ్రీనివాస్, ఆరేపల్లి మహదేవ్,కోట శ్రీనివాస శర్మ, పబ్బోజు శ్రీనివాస్,పబ్బోజు రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ 245 గజాలు.. నిర్మాణం 320 గజాలు!

- మల్కాపూర్‌లో అనుమతులకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం?
- పంచాయతీ అధికారుల మౌనం.. ఆర్టీఐకి నాలుగు నెలలుగా సమాధానం కరువు
- ఎంపీడీవో స్పందన కరువు

**కొండాపూర్ , ఆగస్టు 16:వుదయం.**





కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి నిర్మాణంపై వివాదం నెలకొంది. 245 గజాల విస్తీర్ణానికి అనుమతి తీసుకుని సుమారు 320 గజాల్లో నిర్మాణం చేపట్టినట్లు ఫిర్యాదుదారు ఆరోపిస్తున్నారు. అనుమతికి మించి నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

**అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటి?**

245 గజాలకు మాత్రమే నిర్మాణ అనుమతి ఉంటే 320 గజాల్లో నిర్మాణం ఎలా చేపట్టారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పంచాయతీ అధికారులు నిర్మాణానికి అనుమతి ఇచ్చే సమయంలో పరిశీలన చేశారా? నిర్మాణం పూర్తయ్యే దశలో నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో తనిఖీ చేశారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫిర్యాదు చేసినా చర్యలు లేవా?**

ఈ నిర్మాణంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుదారు ఆరోపిస్తున్నారు. దీంతో పంచాయతీ అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆర్టీఐకి నాలుగు నెలలుగా సమాధానం కరువు**

ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, పంచాయతీ రికార్డులు, అనుమతించిన విస్తీర్ణం, నిర్మాణ వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరినా నాలుగు నెలలు గడిచినా సమాచారం అందలేదని ఫిర్యాదుదారు చెబుతున్నారు.
జిల్లా స్థాయిలో ఆర్టీఐ దరఖాస్తు చేసుకున్నప్పటికీ సంబంధిత సమాచారాన్ని మండల ఎంపీడీవోకు పంపించి అధికారులు బాధ్యత నుంచి తప్పుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
రికార్డులు ఉంటే సమాచారం ఇవ్వడంలో ఇంత జాప్యం ఎందుకు? రికార్డులు లేకపోతే నిర్మాణానికి అనుమతి ఎలా వచ్చింది? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

**అధికారుల మౌనం వెనుక కారణమేంటి?**

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెల్లడించాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వస్తున్నాయి.
కొండాపూర్ మండలంలోని పలు గ్రామపంచాయతీల పరిధిలోనూ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**విచారణకు డిమాండ్**

245 గజాలకు అనుమతి తీసుకుని 320 గజాల్లో నిర్మాణం జరిగిందన్న ఆరోపణలపై సమగ్ర క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
నిర్మాణ అనుమతి పత్రాలు, పంచాయతీ రికార్డులు, స్థల విస్తీర్ణం, వాస్తవ నిర్మాణ విస్తీర్ణాన్ని అధికారులు పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.
ఆర్టీఐ సమాచారాన్ని నాలుగు నెలలుగా ఎందుకు ఇవ్వలేదు? ఫిర్యాదు చేసినా చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనుమతులకు మించి నిర్మాణం జరిగితే బాధ్యులపై చర్యలు ఉంటాయా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

# ఉత్సవాలు విజయవంతం చేద్దాం



**నారాయణపేట టౌన్ ఆగస్టు 16**
**(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట పట్టణంలో ని శ్రీ భక్త మార్కండేయ స్వామి వారి ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వ ర్యంలో ఈనెల 27 28న రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజల తో పాటు యజ్ఞం, యజ్ఞోపవిత్ర ధారణ, స్వామి వారి పల్లకి సేవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు క్యాతన్ రఘునాథ్ కోరారు. ఆది వారం పట్టణంలోని పద్మశాలీల కుటుంబాల ఇంటింటికి తిరుగుతూఆలయ అభివృద్ధి కోసం విరాళాలు సేకరించారు..సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి వేడుకలను ఘనంగా చేపట్టేందుకు ప్రతి ఒక్కరు విరాళాలు అందించి సహకరించాలని అన్నారు. ఈ నెల 27 28 తేదీల్లో జరిగే రాఖి పౌర్ణమి వేడుకల్లో ప్రతి ఒక్కరు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పట్టణ కార్యదర్శి తిలక్ బాబు, ఉపాధ్యక్షులు తాటి కృష్ణ ,కర్లి శేఖర్ తదిత రులు పాల్గొన్నారు.

# జూరాల జలాలపై కరువు ఛాయలు.. వరికి 'నో'!



- ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కష్టాలు తప్పవు
- నీటిని పొదుపుగా వాడండి.. ప్రత్యామ్నాయ పంటలే మేలు
- ప్రవాహం తగ్గితే కాలువలు మూసివేత.. తాగునీటికే తొలి ప్రాధాన్యం

**గద్వాల ఆగస్టు 16**
**(వుదయం బ్యూరో)**

జూరాల ప్రాజెక్టుపై కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు వస్తున్న నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో సాగునీటి విషయంలో అధికారులు అప్రమత్త మయ్యారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో సాగునీటి కొరత తప్పకపోవచ్చని నీటి పారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని సూచించారు.నీటి లభ్యతపై సమీక్ష జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలపై కేశవరావు ఆధ్వర్యంలో ఆదివారం నీటిపారుదల శాఖ అధికారులు, కార్యనిర్వాహక ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వినియోగంలో అప్రమత్తత తప్పనిసరని అధికారులు అభిప్రాయపడ్డారు. వరికంటే ప్రత్యామ్నాయ పంటలే మేలు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గితే జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉందని కేశవరావు తెలిపారు. అధిక నీటిని వినియోగించే వరి సాగు వల్ల అందుబాటులో ఉన్న నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రవాహం తగ్గితే కాలువలు బంద్ ప్రాజెక్టుకు నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిన వెంటనే ముందస్తు చర్యల్లో భాగంగా కాలువలను మూసివేస్తామని కేశవరావు స్పష్టం చేశారు. అనంతరం ప్రాజెక్టుకు వస్తున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, తాగునీటికే తొలి ప్రాధాన్యం ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని ఆయకట్టు పరిధిలోని గ్రామాలు, మండలాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమివ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. తాగునీటి అవసరాలను విస్మరించి సాగునీటి విడుదలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. రైతులు కూడా నీటి ప్రాధాన్యతను గుర్తించి అవసరానికి మించి సాగునీటిని వినియోగించకుండా సహకరించాలని కోరారు. నీరు వస్తేనే తదుపరి నిర్ణయం రానున్న రోజుల్లో జూరాలకు సరిపడా నీటి ప్రవాహం వస్తే పరిస్థితిని సమీక్షించి కాలువలకు సాగునీటి విడుదలపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని కేశవరావు తెలిపారు. నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు సూచించారు. సమీక్ష సమావేశంలో నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

# గణేశుడికి దూర్వా గడ్డిని ఎందుకు సమర్పిస్తారు

- శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్.....

**వుదయం న్యూస్ శివ్వంపేట**
**ఆగస్ట్ 16....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ దివ్య ఆశీస్సులతో గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ వ్యవస్థాపకులు పెద్దగోని జిన్నారం రమాదేవి శివకుమార్ గౌడ్ దంపతులు నిర్మించి ప్రతిష్టించిన దేవతామూర్తులు శ్రీ దత్తాత్రేయ మహాస్వామి. శిరిడి సాయి బాబా దేవత మూర్తులకు నేడు శ్రావణమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . శ్రీ గురు పీఠంలో కొలువుదీరిన గణేశుడికి దుర్వా గడ్డిని ఎందుకు సమర్పిస్తారూ అనే అంశం మీద వారు ఇలా వివరించారు.ఈ కథను చెప్పాలంటే, ఇప్పటికీ నిలిచి ఉన్న చాలా దేవాలయాల కన్నా పురాతనమైన ఒక కథలోకి మనం చాలా వెనక్కి వెళ్లాలి. అగ్ని నుండి పుట్టిన అనలాసుర అనే రాక్షసుడు మూడు లోకాలను నాశనం చేస్తున్నాడు. అతను వెళ్ళిన ప్రతిచోటా అంతా కాలిపోతోంది. దేవతలు అతన్ని ఆపడానికి ప్రయత్నించి విఫలమయ్యారు, కాబట్టి చివరికి వారు విఘ్న నివారిణి అయిన గణేశుని వద్దకు వెళ్లి, ఈ సమస్యను పరిష్కరించమని ఆయనను వేడుకున్నారు.

**అతను అనలసురను కేవలం ఓడించడమే కాదు. అతన్ని పూర్తిగా మింగేశాడు.**

అది ఒక సమస్యను పరిష్కరించి, దాదాపు వెంటనే మరొక సమస్యను సృష్టించింది. అగ్ని రాక్షసుడు ఇప్పుడు తనలో ఉండటంతో, గణేశుడు తీవ్రంగా వేడెక్కడం ప్రారంభించాడు. చందనం పేస్టు పనిచేయలేదు. చల్లదనాన్నిచ్చే మూలికలు పనిచేయలేదు. ఋషులు ప్రయత్నించిన ఏదీ ఏమాత్రం ప్రభావం చూపలేదు, మరియు చాలామంది చెప్పినదాని ప్రకారం, వారి ఆలోచనలు వేగంగా అయిపోతున్నాయి. అప్పుడు ఎవరో దుర్వుడిని తలుచుకున్నారు. ఇరవై ఒక్క గడ్డి పూసలను పోగు చేసి ఆయన పాదాల చెంత సమర్పించారు. అది ఆయనను తాగిన దాదాపు క్షణంలోని ఆ వేడి మాయమైంది. దివ్య ఔషధంలోని ఏ మందు కూడా సాధించలేని ఆ పనిని. నాది తీరంలో వాటంతట అదే నాశనమయ్యేలా చేసింది.
నిజానికి కథ మొత్తం ఇదే. అందుకే అప్పటి నుండి దుర్వా గణేశ పూజకు దగ్గరగా ఉంది. అది ఖరీదైనది లేదా దొరకడం కష్టం అయినందువల్ల కాదు. కచ్చితంగా అది అలా లేనందు వల్లనే అని దుర్వ అనగా గరిక ఇది చాలా మటుకు అంతటా దొరుకుతుంది కనుక భక్తులు గణేశుడికి ఈ గరిక సమర్పించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ట్రస్టు సభ్యులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# 25సంత్సరాల ప్రైమరి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కోహీర్ ఆగస్టు 16**
**(వుదయం ప్రతినిధి )**

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం లోని పైడిగుమ్మల్ గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు ఘనంగా జరిగాయి.
1995 నుండి 2002 బ్యాచ్‌కు చెందిన 1వ తరగతి నుండి 7వ తరగతి పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపైకి వచ్చి తమ అనుభవలను పంచుకొన్నారు
దాదాపు 25ఏళ్ళ తరువాత కలుసుకున్న విద్యార్థులు తమ అనుభవలను పంచుకొన్నారు .ఆదివారం 1608 2026 రోజున నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో కోలాహలంగా సాగింది. పాఠశాల రోజుల్లోని తీపి గుర్తును, చిన్ననాటి ముచ్చట్లను విద్యార్థులు ఒకరితో ఒకరు పంచుకున్నారు.విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.తమ ఎదుగుదలకు కారణమైన ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఏళ్లు గడిచినా తమ అనుబంధం చెక్కుచెదరలేదని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.
వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులందరూ ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.
పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రతి ఒక్కరిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని విద్యార్థులు తెలిపారు.సరదా ఆటపాటలు, ముచ్చట్లతో రోజంతా పండుగ వాతావరణం నెలకొంది.చదువుకున్న జ్ఞాపకాలు, నేర్చుకున్న పాఠాలు తమ జీవితంలో నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.
పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ తీసిన గ్రూప్ ఫోటోలు అందరినీ ఆకట్టుకున్నాయి.అనంతరం అందరూ కలిసి విందు భోజనం చేసి, మధురానుభూతులతో వీడ్కోలు తీసుకున్నారు.ఈ ఆత్మీయ కలయిక గ్రామ ప్రజల్లోనూ, పూర్వ విద్యార్థుల కుటుంబాల్లోనూ ఎనలేని ఆనందాన్ని నింపింది.

# న్మకొండకు తరలిన న్యాయవాదులు


**నారాయణపేట టౌన్ ఆగస్టు 16**
**(వుదయం ప్రతినిధి)**

హన్మకొండలో ఆది వారం జరిగిన న్యాయవాద తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి నారాయణ పేట న్యాయవాదులు తరలివెళ్లి పాల్గొన్నారు.నారాయణపేట నుంచి పాల్గొన్న వారిలో కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నందు నామాజీ ,కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయ వాది కుర్మన్న గౌడ్,న్యాయ వాదులు నర్సింలు యాదవ్,భరత్,క్రాంతి కుమార్ ఉన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## చేవెళ్ల తాసిల్దార్ కార్యాలయంను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**చేవెళ్ల,ఆగస్ట్16(వుదయం)**

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని తాసిల్దార్ ఆఫీస్ లో వివాదాలు లేని భూములను 22 ఏ నుంచి తొలగిస్తామని రైతులు ఆందోళన చెందవద్దని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి స్పష్టం చేశారు.ఆదివారం చేవెళ్ల తాసిల్దార్ కార్యాలయంలో 22ఏ పరిధిలో ఉన్న భూ రికార్డులను స్వయంగా పరిశీలించారు. అలాగే అధికారులను వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు చేశారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు 22ఏ పరిధిలో ఉన్న వివాదాస్పద భూములను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.22ఏలో వివాదాస్పదంగా ఉన్న రెవెన్యూ భూముల క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎవరు కూడా ఎ లాంటి ఆందోళన చెందవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి,చేవెళ్ల తాసిల్దార్ బి



కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు సిబ్బంది ఉన్నారు.

## తిరుపతిరెడ్డికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ నాయకులు

**చేవెళ్ల,ఆగస్ట్16(వుదయం)**

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఓ వివాహ వేడుకకు హాజరైన ఎనుముల తిరుపతిరెడ్డికి చేవెళ్ల PACS చైర్మన్ దేవర వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగి రెడ్డి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా తిరుపతిరెడ్డిని శాలువాతో సత్కరించి ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రగతి రిసార్ట్ లో జరిగిన వివాహ వేడుకలో ఎనుముల తిరుపతిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నాయకులు పడాల ప్రభాకర్,టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్,మద్దెల చింటూ,మల్లారి మల్లారెడ్డి, అత్తెల్లి రవీందర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఫరీన్ ఖదీర్ పాషా,మాజీ డైరెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఏవీ వినూత్న హోమ్స్‌లో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

**మేడిపల్లి ఆగస్టు 16.(వుదయం)**

పోచారంలోని ఏవీ వినూత్న హోమ్స్‌లో ఆదివారం బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగగా నిర్వహించబడ్డాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఏవీ వినూత్న హోమ్స్ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీ వినూత్న హోమ్స్ కుటుంబ సభ్యులు, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బోనాల వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోచారం శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయానికి చేరుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.... "ఏవీ వినూత్న హోమ్స్‌లో తొలిసారిగా బోనాల పండుగను ఇంత గొప్పగా, ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం" అని అన్నారు. బోనాల వేడుకల్లో ఏవీ వినూత్న హోమ్స్ కుటుంబ సభ్యులు, మహిళలు, చిన్నారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. డప్పుల మోతలు, భక్తుల సందడి, మహిళల ఉత్సాహంతో ఏవీ వినూత్న హోమ్స్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తి, సంప్రదాయం, కుటుంబ ఆత్మీయతల సమ్మేళనంగా బోనాల వేడుకలు విజయవంతంగా ముగిశాయి.





## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రాపురం: ఆగస్టు 16 (వుదయం)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల ఉత్సవాలు ప్రతీకలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమల, తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నిర్వహించిన గ్రామ దేవతల బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు రాములు గౌడ్, రవీందర్ రెడ్డి, కొమరయ్య, రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాకతీయ నగర్ థీమ్ పార్క్ లో ఆర్వీ7 క్రికెట్ క్లబ్ ప్రారంభం



**రామచంద్రాపురం: ఆగస్టు 16 (వుదయం)**

రామచంద్రాపురం డివిజన్‌లోని కాకతీయ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన థీమ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆర్వీ7 క్రికెట్ క్లబ్ నెట్ క్రికెట్ను తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పుష్పనగేష్ నెట్ క్రికెట్‌లో కాసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం కాలనీ వాసులతో ముచ్చటించి, క్రికెట్ క్లబ్ ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, క్రికెట్ క్రీడాకారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.60 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్, ఆగష్టు 16,(వుదయం ప్రతినిధి )**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని 279వ డివిజన్ శ్రీరామ్ నగర్-బి రోడ్డు, మేస్త్రీ నగర్ ప్రాంతాల్లో 8, 9, 10, 11, 12వ వీధుల్లో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సిఎంసీ నిధుల ద్వారా రూ.60 లక్షల వ్యయంతో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, అజయ్, జమీర్ రహీమ్, కలీమ్, గఫార్, ఖాజా రెహ్మాన్ ఖహీల్, ఎం.డి. ఖలీల్ ఉర్ రెహ్మాన్, హనీఫ్, నవీన్ గౌడ్, యాదగిరి, బుచ్చి రెడ్డి, అంజనేయులు, నరసింహాచారి, విశ్వనాథ్, ప్రభాకర్, అజాజ్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలు

**దుండిగల్, ఆగష్టు 16, (వుదయం ప్రతినిధి ),**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ లో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ( బౌరమ్మగుడి ) ఆలయ వార్షికోత్సవం, శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రెండు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి వెల్లివిరియాలని స్వామివారిని, అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు జిన్నారం వెంకటేష్ గౌడ్, మేడ్చల్ జిల్లా గ్రంధాలయం సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలీస్ గోవింద్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నాచారం మురళీ యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎం.యాదిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రయాణికులకు సురక్షిత మంచినీరు




**సికింద్రాబాద్,ఆగస్ట్16(వుదయం)** రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికులకు అందించే మంచినీటి నాణ్యతపై కాగ్ అందజేసిన నివేదికపై కేంద్ర రైల్వే శాఖ తక్షణమే స్పందించింది. తాగునీటి శుద్ధత, భద్రతపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డు ఛైర్మన్ అండ్ సీఈఓతో పాటు ఇతర ఉన్నతాధికారులు రోజంతా సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రయాణికులకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి వెంటనే పలు సవరణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

**20 వేల ప్రాంతాల్లో నూతన ఫిల్ట్రేషన్ వ్యవస్థలు**

రైల్వే నెట్‌వర్క్ వ్యాప్తంగా నీటి కూలర్లతో సహా సుమారు 20,000 ప్రాంతాల్లో 'ట్యాంక్ టు ట్యాప్' పేరుతో నూతన వాటర్ ఫిల్ట్రేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించేలా సమగ్ర వాటర్ ఫిల్ట్రేషన్ మరియు మానిటరింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే పాత నీటి ట్యాంకుల స్థానంలో నూతన ట్యాంకులను అమర్చనున్నారు.

**కఠిన నిబంధనలు, కచ్చితమైన నిర్వహణ**

నీటి నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు పలు కఠిన నిబంధనలు అమలు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

మంచినీటి ఉద్భవ స్థానాలు (సోర్స్) మరియు వినియోగ స్థానాల (అవుట్‌లెట్) వద్ద క్రమం తప్పకుండా నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించడం.

పర్యవేక్షణను కేంద్రీకృతం చేస్తూ అధికారుల బాధ్యతను నిర్దేశించడం.

మంచినీటి నిల్వ ట్యాంకులను నిర్ణీత సమయానుకూలంగా శుభ్రపరచడం మరియు నిర్వహణ పనులు చేపట్టడం.

**రైల్వే బోర్డు ప్రత్యక్ష పర్యవేక్షణ**

ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించనున్నారు. పారదర్శకతను కాపాడేందుకు గాను నీటి నాణ్యత, పనుల పురోగతి నివేదికలను ఎప్పటికప్పుడు బహిరంగంగా ప్రచురించనున్నట్లు తెలిపారు. కాగ్ నివేదికలోని అన్ని అంశాలను పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు చేపట్టిన విస్తృత చర్యల్లో భాగమే ఈ నిర్ణయమని రైల్వే శాఖ స్పష్టం చేసింది.

## 9,600 మందికి పైగా గ్రామీణ క్రీడాకారులతో ఘనంగా ఈశా గ్రామోత్సవం

**హైదరాబాద్ ఆగస్ట్16(వుదయం)** భారతదేశంలోనే అతిపెద్ద గ్రామీణ క్రీడోత్సవమైన 'ఈశా గ్రామోత్సవం 2026' తెలంగాణ ఎడిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 9,630 మంది గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 15 జిల్లాల పరిధిలోని 25 ప్రాంతాల్లో ఈశా గ్రామోత్సవాన్ని నిర్వహించగా, మొత్తం 843 జట్లు పోటీపడ్డాయి. ఇందులో 7,200 మంది ఆటగాళ్లతో కూడిన 600 పురుషుల వాలీబాల్ జట్లు, 2,430 మంది ఆటగాళ్లతో కూడిన 243 మహిళల థ్రోబాల్ జట్లు పాల్గొన్నాయి.

**ఎల్బీ స్టేడియంలో హోరాహోరీగా స్టేట్ ఫైనల్స్**

ఈ టోర్నమెంట్ డివిజనల్ రౌండ్ (స్టేట్ ఫైనల్) హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగింది. పురుషుల వాలీబాల్, మహిళల థ్రోబాల్ విభాగాల్లో క్లస్టర్ స్థాయిలో విజయం సాధించిన 28 జట్లు ఇందులో పోటీపడ్డాయి. ఈ జట్లు స్టేట్ ఛాంపియన్‌షిప్‌తో పాటు కోయంబత్తూరులో జరగనున్న గ్రాండ్ ఫినాలేలో పోటీపడే అవకాశం కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రామోత్సవం నిర్వహణ, క్రీడాకారుల ప్రదర్శనపై విలేకరుల సమావేశం కూడా నిర్వహించారు.

**గ్రామీణ క్రీడలతో ఐక్యతా స్ఫూర్తి: ఈశా బ్రహ్మచారి స్వామి అంబర**

విలేకరుల సమావేశంలో ఈశా బ్రహ్మచారి స్వామి అంబర మాట్లాడుతూ, "ఈ సంవత్సరం తెలంగాణ నలుమూలల నుండి 9,600 మందికి పైగా గ్రామీణ క్రీడాకారులు ఈశా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. వీరిలో దాదాపు 2,500 మంది మహిళలు ఉండటం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు చూపిస్తున్న ఉత్సాహానికి ఈ సంఖ్యే నిదర్శనం" అని తెలిపారు. అలాగే, "ఒక గ్రామం కలిసి ఆడినప్పుడు గెలుపోటముల అనుభూతిని గ్రామం మొత్తం పంచుకుంటుంది. ఇది వారిలో ఆత్మగౌరవం, ఐక్యత, సమిష్టి భావనను పెంపొందిస్తుంది. గ్రామీణ భారతదేశం శారీరకంగా చురుగ్గా, సామాజికంగా అనుసంధానమై ఉన్నప్పుడు దాని ప్రభావం క్రీడా మైదానానికే పరిమితం కాకుండా ఎంతో దూరం వెళ్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

**స్టేట్ విజేతలుగా 'కోయచలక వారియర్స్', 'దేవుని పడకల్'**



విలేకరుల సమావేశం అనంతరం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో మహిళల థ్రోబాల్ విభాగంలో గేయచల్క గ్రామానికి చెందిన 'కోయచలక వారియర్స్' జట్టు, పాపడ్‌పల్లికి చెందిన 'పాపడ్‌పల్లి ఫైటర్స్' జట్టుపై విజయం సాధించి రాష్ట్ర థ్రోబాల్ ఛాంపియన్‌గా నిలిచింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన 'రాణి రుద్రమదేవి' జట్టు మూడో స్థానంలో, సంగారెడ్డి జిల్లాకు చెందిన 'చింతల్ చెరువు' జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి.

పురుషుల వాలీబాల్ పోటీలో రంగారెడ్డి జిల్లాకు చెందిన 'దేవుని పడకల్' జట్టు, మహబూబ్‌నగర్ జిల్లా 'మరికల్' జట్టును ఓడించి రాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మెదక్ జిల్లాకు చెందిన 'గాడిపెద్దాపూర్' జట్టు మూడో స్థానంలో, నల్గొండ జిల్లాకు చెందిన 'యేలుమినేడు బ్రదర్స్' జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి.


Classified Ads English / Telugu

వుదయం తెలుగు దిన పత్రిక ద్వారా

@ Rs. 300/-

• బహిరంగ ప్రకటనలు
• లీగల్ నోటీసులు
• ఉద్యోగ
• వ్యాపార

Pay for 3 Get Free 2 Classifieds

5 3 ప్రకటనలకు చెల్లించండి
2 ప్రకటనలు ఉచితంగా పొందండి

ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి 9553256199 7013538549

Change of Name | Lost of Documents | Legal Notices
Wanted Employees | Real Estate | Public Notices
Advertise Classifieds Rs. 300/-


IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM IV ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS: MEDCHAL-MALKAJGIRI DISTRICT AT MEDIPALLY

O.S.NO. 494 OF 2026

Between:
Mr. Devaraj Suryaprakash Rao ... Plaintiff

AND

The Tahsildar (MRO) Mandal Revenue Office, Medipally Mandal, Medchal-Malkajgiri District and another ...Defendants

To,
All concerned (Defendant No.2)

WHEREAS, The plaintiff have instituted a suit for declaration of legal heirs against defendant No.1 & 2 for the death of Late Devaraju Rajeswari Devi died on 26.06.2023 and the plaintiff made all concerned parties as Defendants No.2 and if any interested parties are hereby summoned for appearance in this court by in a person or by a pleader duly instructed and able to answer all the material questions or objections from the general public concerned if any relating to the suit for the declaration of legal heirs, who shall be accompanied by some person able to answer all such questions on the date of the suit and same is posted on 02.09.2026 for all of your appearance at 10-30 A.M in the above court. Take notice that in default of your appearance on the said day the matter will be determined in your absence.

(BY THE ORDER OF THE HON'BLE COURT)


M/S. G.N. SATYANARAYANA
B. Haribabu
K. Varun Yadav
Koppu Madhukar Yadav
B. Venkata Ravindra
Advocates
Flat # 101, First Floor, Chayamina Enclave, AS Raju Nagar, Kukatpally, Hyderabad - 500072
Cell No.9246100703 / 9618117703
gnsatyanarayana@gmail.com

## ఉష
వుదయం సాహిత్యం

# పల్లె మనుషుల జీవిత గాథ

ఇటీవల సినీనటి రాధిక నటించిన తమిళ సినిమా "తాయి కిజావి" వుమన్ ఎంపవర్మెంట్ గురించిన చర్చను తాజాపరిచింది. రాజకీయ, ఆర్థిక, విముక్తి పోరాటాలు, ఉద్యమాలకు ముందు ఉండి నడిపిన మహిళల జాబితా చాలా పెద్దదే. వారి జీవితాలను నామమాత్రం రాసుకుంటూ పోతే కొన్ని వందల పేజీలు కావచ్చు. చరిత్రకెక్కని, రవి కూడా కాంచని ఓ బంజారా మహిళా యోధురాలి చరిత్రను కవి, రచయిత నవలాకారుడు ఆజ్మీరా వెంకట్ పవర్ "పోర్యతార" (తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవల) నవలలో రాశారు. 2025 సంవత్సరానికి గాను తెలంగాణ సాహిత్య పరిషత్తు వారిచే ఉత్తమ నవలా పురస్కారాన్ని అందుకున్న ఈ తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవలపై చర్చించుకోవాల్సిన సందర్భం కూడా ఉన్నది. ప్రతి జాతికి తమ తమ ఆచార వ్యవహారాలకు సంబంధించి, జీవనానికి సంబంధించిన ధర్మం ఉంటుంది. బంజారాలకు కూడా ఓ ధర్మం ఉన్నది. ఆకలి కలిగిన వాళ్ల దగ్గరి కూడు లాక్కోకూడదని ధర్మాన్ని పాటిస్తూ విస్తారమైన పశుపోషణ నే వృత్తిగా సంచార జీవితాన్ని గడుపుతున్నారు. బంజారాలు ఎక్కడనుండి వచ్చారు అనే దానికన్నా ఎక్కడికి వచ్చారు... ఎలాంటి జీవనం కొనసాగిస్తున్నారనేది ముఖ్యం. బంజారాల ప్రధాన ఆస్తి పశువులు. మేలు జాతి పశువుల ఉత్పత్తి చేయటం, అమ్మటం, సుదూర ప్రాంతాల ప్రజలకు, ప్రభువులకు, భూస్వాములకు అమ్ముతూ ఉండేవారు. బలమైన పశుసంపద ఉండటం వలన కాలానుగుణంగా సంచార వ్యాపారం కూడా విస్తారంగా సాగించారు. ప్రపంచంలోని ఎడారి జాతుల ప్రధాన వృత్తి వ్యాపారమే. ఇక్కడి బంజారాలు కూడా ఉప్పు, పప్పులు మొదలగు వాటిని బెంగళూరు, మైసూరు, హైదరాబాద్ పట్టణాలకు తరలించి అమ్మేవారు. ఆయా పట్టణాలలో దొరికే వస్తువులను ధాన్యాలను మరోచోట ఎడ్లబండ్ల ద్వారా తీసుకెళ్లి వ్యాపారం నిర్వహించేవారు. ఈ నిర్వహణలో దోపిడిదొంగలు, భూస్వాములు, జాగీరు దారులు తమ పరిధిలో

విధించిన పన్నులు, నిజాం పాలనలో వేసే పన్నులు చాలా భారంగా ఉండేవి. హైదరాబాద్ నగర నిర్మాణం, వ్యాపార సంబంధాలలో బంజారాలది ముఖ్యమైన పాత్ర. నేటి బంజారాహిల్స్ నాటి బంజారాల నివాస ప్రాంతం. గోలకొండ చుట్టూ వారి నివాసం. సంచార వ్యాపారం తో పాటు స్థిర వాసాలు ఏర్పరచుకుని జీవించే వారు. లదణి (వలస) జీవితాలతో కొనసాగించే ఈ బంజారాలు బంజారాహిల్స్ ను, షాద్ నగర్ ను, శంషాబాద్ ను ఇలా ఎక్కడ పశుపోషణకు అవకాశం దొరుకుతుందో అక్కడికి వెళ్లేవారు.





ప్రముఖులు హైదరాబాద్ జీవిత చరిత్ర రాస్తూ బంజారా జీవితాన్ని హైదరాబాద్ నగరం చుట్టూ లదణి లదణి లుగా మారుతున్న వైనాన్ని వివరంగా రాశారు . ఇట్లా అడవులు, పీఠ భూములు, గుట్టలు, కొండల ప్రాంతాల్లో తాండాలుగా స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అట్లా వ్యవసాయం మీద ఆధారపడుతూ ప్రారంభమైన వీరి జీవనం ముఖ్యముగా వ్యవసాయాధార వలసదారులు వెళ్లినట్లుగా మైదానము, నల్లరేగడి భూములకు వెళ్ళలేదు. మెట్ట, వర్షాధార వ్యవసాయానికి పనికి వచ్చే భూములను మాత్రమే ఆశ్రయించారు. ఈ పరిణామ క్రమంలో ఎదుర్కొన్న కష్టాలను, నష్టాలను నైజాం, భూస్వాముల ఆగడాలను ఎదుర్కొంటూ జీవిస్తున్న సందర్భంలో ఓ బంజారా మహిళ జడ్చర్ల, తిమ్మాజీపేట, నాగర్ కర్నూల్, బిజినేపల్లి, కొత్తకోట, వనపర్తి గోపాల్ పేట్ చుట్టూ ఉన్నటువంటి తండాలకు నాయకత్వం వహించి విముక్తి పోరాటాలను చేసింది. ఆమె హీరిబాయి. హీరిబాయి జీవిత చరిత్రను చదవాలంటే బంజారా జీవితాలను వంద ఏండ్ల వెనక్కి వెళ్లి చదవాలి. అది జరగక పోతే తెలియని భాషను,అర్థం కాని భాషను విన్నట్లే. తాండా రాజకీయ జీవనం ఆ తండా పంచుల నిర్ణయాల పై ఆధారపడుతుంది. తెగల ప్రజాస్వామ్య విలువలకు ఇది చక్కటి ఉదాహరణ. పెండ్లిలు, ఇతర తాండవాసులతో సంబంధాలు, వ్యాపార వ్యవహారాలు, నిర్వహణ అన్ని ఆ పంచులే చూసుకునేవారు. వీరి నాయకుడే "నాయక్". విలక్షణమైన నటువంటి వివాహ ఆచారం, సంప్రదాయం, సంస్కృతి వాడ్ బూడ్ (అనుభవ వృద్ధులు) సిక్వాడి (హితోపదేశం) ద్వారా తర్వాతి తరాలకి అందించే వారు

లంబాడీ మనవు అనేది ఒక ప్రధాన అంశం ఒక తాండా మహిళా మరో తాండాయువకుడితో పెళ్లి అయిన తర్వాత తను పుట్టిన తండాకి తిరిగి వచ్చే దాఖలా ఉండదు. హీరి బాయి పెరిగిన తీరు, ఆమె ధీరత్వం చూసిన తల్లిదండ్రులు, తాండా వాసులు ఆమె భర్త గత్తరకు గుర్రై చనిపోతే తిరిగి తండాకు పిలుచుకొని ఆదరిస్తారు. 1899 1900 సంవత్సరం ఆ మరుసటి సంవత్సరాలు వరుసగా ఏడు సంవత్సరాల వరకు విపరీతమైన కరువు సంభవించడంతో పశువులకి, మనుషలకి తిండి దొరకక చౌడు, బంక మట్టి తింటున్న సందర్భాల్లో తమ ప్రాణాన్ని నిలుపుకోవడం కోసం హీరిబాయి గత్యంతరం లేక కొత్త అవతారం ఎత్తింది.

**నాటకరంగమే జాన్సన్ ప్రతిభకు తొలి ప్రధాన వేదిక. నాటకరచనతోపాటు నటనలోనూ రాణించారు. 'నటనాలయం', 'దేవాలయం', 'హృదయాలయ', 'సిలువభారం' వంటి నాటకాలు రాసి ప్రదర్శించారు. ఢిల్లీలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవాల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. 1965లో ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రదర్శించిన 'నటనాలయం' ఉత్తమ రచనగా ఎంపికైంది. నాటక సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇందులో ప్రస్తావించారు.**

'సింహమైనా పులైన ఆకలి అయినప్పుడు వేటాడుతాయి ఆకలి వేసినప్పుడు ఇంత దూరమైన ప్రయాణిస్తాయి ఎంత బలంతో అయినా వేటాడుతాయి వాటి ఆకలికి రాత్రి పగలు అని తేడాలు ఉండవు ఈ ప్రక్రియను ధర్మాన్ని అనుసరిస్తూ వేటాడుతాయి తప్ప తిండి నిధుల కోసం వేటాడవు మనం కూడా మన ధర్మం ప్రకారం ఆకలిని జయించే యుద్ధం మొదలు పెట్టబోతున్నాం'

భూకేన్ బాటి ఖొరాణు
తరసేన్ పాణి పరాణు
ఘలాడి పద్మేజేన్ వాట్ వతాణు
ఆస్రో మాంగజేన్ సహోర్ దేణు

(ఆకలితో ఉన్న వాళ్లకు రొట్టెలు పెట్టాలి దూపగొన్న వారికి నీళ్లు ఇవ్వాలి. దారితప్పిన వారికి దారి చూపాలి. ఆశ్రయం కోరి వచ్చిన వారికి సహకారం అందించాలి) 'ఆకలి చావుల నుండి బయటపడటానికి మన గోర్ ధరమ్ ను అనుసరించే ఆకలి దాడులు చేయబోతున్నాం. తిండి గింజల కోసం ఎంత దూరమైనా నడవ పోతున్నాం.

ఎంత బలమైన వాడినైనా డీ కొట్టబోతున్నాం. పేదోడు కడుపు కొట్టి నిలువ చేయబడిన గడీలను, వ్యాపారస్తుల ఇండ్లు ఏవైనా సరే మన దెబ్బకు ఖాళీ కావాల్సిందే. మనోళ్ల కడుపు నిండాల్సిందే. పేదలను దోచుకుని గడీల నింపుకుంటున్న దొరల లారీలు మన కోడిపర్తి మిట్టనుండే బాదేపల్లి మార్కెట్ కు పోతున్నాయి ఇక్కడి నుండే మనం లూటీ మొదలు పెడుతున్నాం.' అంటూ తూర్పు దిక్కు వేలు చూపిస్తూ హీరీబాయి అన్నది. నిజాం పాలనలో వీరిపై విధించిన పన్నులను తగ్గించుట నుండి బంజారాలను దొంగలుగా చిత్రిస్తూ మోపిన క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ 1871 ఎత్తేసే దగ్గర నుండి తాండాల్లో నీటి కోసం రెండు సార్లు నాటి ప్రధాని ఇందిరాగాంధీని కలిసి చేదుడు బావులను ఏర్పాటు చేసుకునే అంతవరకు హీరి బాయి చరిత్ర ను చారిత్రక నవల రూపంలో వెంకట్ పవార్ రాసేదాక ఈమె చరిత్ర సమాజానికి తెలియదు. 80 ఏండ్ల వయసులో ఒంటరిగా సెక్యూర్టీని ఛేదించుకొని ఢిల్లీలో ఇందిరా గాంధీని కలవడం ఒక పోరాటం. ఆమె నాయకత్వం వహించే తండాలను దోపిడీదారులుగా చిత్రించిన ఆధిపత్య చరిత్ర కారులను ఏకపక్షం చేస్తూ హీరిబాయి చరిత్రను 'పోర్యతార' నవలగా వెలుగులోకి తెచ్చిన ఆంగోత్ వెంకట్ పవార్కి అభినందనలు. ప్రచురించిన తెలంగాణ సాహిత్య అకాడమికి ప్రత్యేక సాహిత్యాభినందనలు. నిజాం పాలనలో వీరిపై విధించిన పన్నులను తగ్గించుట నుండి బంజారాలను దొంగలుగా చిత్రిస్తూ మోపిన క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ 1871 ఎత్తేసే దగ్గర నుండి తాండాల్లో నీటి కోసం రెండు సార్లు నాటి ప్రధాని ఇందిరాగాంధీని కలిసి చేదుడు బావులను ఏర్పాటు చేసుకునే అంతవరకు హీరి బాయి చరిత్ర ను చారిత్రక నవల రూపంలో వెంకట్ పవార్ రాసేదాక ఈమె చరిత్ర సమాజానికి తెలియదు. 80 ఏండ్ల వయసులో ఒంటరిగా సెక్యూర్టీని ఛేదించుకొని ఢిల్లీలో ఇందిరా గాంధీని కలవడం ఒక పోరాటం.

## భారతీయ కవిత

# విమానం ఎగిరిపోయింది...



విశాఖ మహానగరానికి
విశాల సాగరాన్ని
విడిచిపెట్టి
వీడిపోయింది
విమానాశ్రయం
వాలింది భోగాపురాన
వైభోగంగా!

ఉక్కు కండలే
కరగిపోతున్నాయి
రాజభవనాలే
పెరిగిపోతున్నాయి

ఫార్మా సిటీల
విషవాయువులు
ఊపిరితిత్తులను
ఉడికిస్తుంటే
ఐటీ కొలువుల ఆశల

వాల్తేరు రైలు కూత
దువ్వాడకు చేరుతోంది
రాజకీయ రణతంత్రంలో
ఉక్కు నగరానికి దిక్కు
తోచకుండా పోతోంది
విభజిత ఆంధ్రాకు
పెట్టుబడుల రాబడులకు,
విశ్వ విపణిలో అంగడి
సరుకై మిగిలింది!

రాజధాని మాట
అటుంచుగాని
రాతి కొండలే
తరగిపోతున్నాయి

దీపాలు
నిరుద్యోగ నిశ్శబ్దంలో
ఆరిపోతుంటే
మెట్రో కలలు కాగితాలకే
పరిమితమై
రోడ్లపై ట్రాఫిక్ నరకం
చూపుతుంటే...

నిలువెత్తు కొండలకు
ధీటైన ఆత్మస్థైర్యంతో,
అంతులేని ఆవేదనను
సాగర గర్భంలో
దాచుకుంటోంది
విశాఖ నగరం!

---

## తప్పిపోయిన మనిషి
# తప్పు తెలుసుకో'

నిస్వార్థం-
నిద్రపోయింది.
స్వార్థం-స్వైర
విహారం చేస్తుంది
ఆత్మీయత
-ఆదమరిచింది
ఆక్రోషం-ఆనంద
తాండవం చేస్తుంది
మానవ
సంబంధాలు-
మంట
కలుస్తున్నాయి
నవ సంబంధాలు-
అంట
కాగుతున్నాయి
అనురాగం-ఆశని
పాతమైంది
అనాగరికం-
అక్కసు
కక్కుతోంది
సోదర భావం-
సోయి తప్పింది.
సోలో జీవితం-
సొగసు
లద్దుకుంటుంది.
పరహితం-
పరాభవం
చెందింది.
తన హితమే-
పరమార్థమైంది
నిజాయితీ-నిలువు
దోపిడికి గురైంది
అవినీతి- ఆత్మీయ
బంధువైంది
చేయూత-



చేజారిపోయింది
విముఖతే-
విశాలత్వం
పరచుకుంది.
బంధాలన్నీ-
బందీలుగా
మారుతున్నాయి
ఆశలన్నీ-అడుగంటి
పోతున్నాయి
గతి తప్పిన
మానవత్వం
శృతి తప్పిన
మానవతత్వం
ఐకమత్యం
అవుతున్నాయి.
తప్పి పోయిన
మనిషీ... తప్పు
తెలుసుకొని..
మళ్ళీ నువ్వు తప్పక
వస్తావని
తథేకంగా
ఎదురుచూస్తూ...



రామిశెట్టి రామనర్సయ్య
9948162433

# మారుతున్న భాష.. పుస్తకం.. పాఠకుడు...

కాలం ఎంత వేగంగా పరిగెత్తినా.. మనిషి ఆలోచనకు అక్షరమే ఆధారం తెలుగు భాష, పుస్తకం, పాఠకుడి మధ్య బంధం కొత్త రూపంలో కొనసాగాల్సిన సమయం ఇదేభాష అనేది కేవలం మాట్లాడుకోవడానికి ఉపయోగించే సాధనం కాదు. అది ఒక జాతి జ్ఞాపకం. ఒక సమాజపు సంస్కృతి. ఒక తరం అనుభవం. ఒక మనిషి ఆలోచనకు అద్దం. పుస్తకం ఆ భాషకు శాశ్వత చిరునామా. పాఠకుడు ఆ పుస్తకానికి ప్రాణం. ఈ మూడింటి మధ్య ఉన్న బంధమే సాహిత్యాన్ని బతికిస్తుంది. తెలుగు భాషకు శతాబ్దాల సాహిత్య సంపద ఉంది. నన్నయ నుంచి తిక్కన వరకు, పోతన నుంచి శ్రీనాథుడి వరకు, వేమన నుంచి ఆధునిక కవుల వరకు తెలుగు అక్షరం ఎన్నో తరాల ఆలోచనలను మోసుకొచ్చింది. నేటి విద్యా ప్రణాళికల్లోనూ తెలుగు సాహిత్య చరిత్ర, కవిత్వం, భాషా అధ్యయనానికి స్థానం కొనసాగుతోంది.అయితే కాలం మారింది.

ఒకప్పుడు కోసం పాఠకుడు గ్రంథాలయానికి వెళ్లేవాడు. ఇప్పుడు పుస్తకం పాఠకుడి చేతిలోకి మొబైల్ ద్వారా వస్తోంది. ఒకప్పుడు వందల పేజీల నవలను రోజులు కూర్చొని చదివేవారు. ఇప్పుడు కొన్ని నిమిషాల్లోనే ఒక కథ చదివి, వెంటనే మరో విషయానికి వెళ్లే అలవాటు పెరిగింది. ఒకప్పుడు పుస్తకం కొనడం ఒక అనుభవం. ఇప్పుడు డిజిటల్ తెరపై చదవడం మరో అనుభవం.


అందుకే ప్రశ్న—పాఠకుడు తగ్గిపోయాడా? లేక పాఠకుడి రూపమే మారిపోయిందా?

**నిజానికి రెండూ కొంతవరకు నిజమే.**

పుస్తక పఠనానికి సమయం కేటాయించే అలవాటు తగ్గుతున్నదనే ఆందోళన ఉంది. మరోవైపు తెలుగు సాహిత్యాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచే ప్రయత్నాలు కూడా వేగం పుంజుకుంటున్నాయి. అరుదైన తెలుగు పుస్తకాలను డిజిటైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచే సంస్థలు కూడా పనిచేస్తున్నాయి.అంటే పుస్తకం చనిపోలేదు. పుస్తకం ప్రయాణించే మార్గం మారింది.

**భాషకు ఎదురవుతున్న కొత్త సవాలు**

తెలుగు మాట్లాడే మనిషి సంఖ్య పెద్దదే అయినా, రోజువారీ జీవితంలో తెలుగు వినియోగం, ముఖ్యంగా చదవడం-రాయడంలో, కొత్త ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. విద్య, ఉద్యోగం, సాంకేతిక రంగం, సామాజిక మాధ్యమాలు—



అన్నింటిలోనూ ఇంగ్లిష్ ప్రభావం పెరిగింది. ఇది ఇతర భాషలపై వ్యతిరేకతగా చూడాల్సిన అవసరం లేదు. ప్రపంచంతో మాట్లాడటానికి అనేక భాషలు అవసరం. కానీ ఇతర భాషలు నేర్చుకోవడం ఒక గొప్ప విషయం; మన భాషను మరచిపోవడం మాత్రం నష్టం.భాష బతకడానికి కేవలం పండుగలు, సభలు, ప్రసంగాలు సరిపోవు. ఇంట్లో మాట్లాడాలి. పిల్లలతో మాట్లాడాలి. పుస్తకాలు చదవాలి. కొత్త కథలు రాయాలి. కొత్త కవిత్వం రావాలి. కొత్త తరానికి అర్థమయ్యే భాషలో సాహిత్యం అందాలి.తెలుగు పుస్తకాలను ఆధునిక పాఠకుడికి దగ్గర చేయాల్సిన అవసరాన్ని ప్రచురణ రంగంలోని కొందరూ కూడా గుర్తిస్తున్నారు. సులభంగా చదవగలిగే, సహజమైన తెలుగుతో పాటు మంచి విషయాన్ని ముందుకు తెచ్చే రచనలకు అవకాశాలు పెంచాల్సిన అవసరం ఉందని సాహిత్య ప్రచురణ సంస్థలు చెబుతున్నాయి.

పుస్తకం మారాలి... కానీ విలువ తగ్గకూడదు పుస్తకం అంటే కేవలం కాగితం కాదు. పుస్తకం అంటే ఒక ఆలోచన.అందుకే పుస్తకం ముద్రిత రూపంలో ఉన్నా, ఈబుక్‌గా ఉన్నా, ఆడియో రూపంలో ఉన్నా దాని అసలు విలువ మారదు. ప్రశ్న ఒక్కటే—అది పాఠకుడిని ఆలోచింప జేస్తుందా?ఒక మంచి నవల మనిషి జీవితాన్ని మరో కోణంలో చూపిస్తుంది. ఒక మంచి కథ మన చుట్టూ ఉన్న మనుషులను కొత్తగా అర్థం చేసుకునేలా చేస్తుంది. ఒక కవిత మనలో మనకే తెలియని భావాన్ని మేల్కొలుపుతుంది. ఒక మంచి వ్యాసం మన ఆలోచనకు ప్రశ్న వేస్తుంది.అందుకే పుస్తకాన్ని కేవలం పరీక్షల కోసం చదివే అలవాటు నుంచి బయటకు తీసుకురావాలి.చదువు ఉద్యోగం కోసం మాత్రమే కాదు. చదువు మనిషిని మనిషిగా తీర్చిదిద్దడానికి కూడా.పాఠకుడిని తిరిగి పుస్తకం దగ్గరకు తీసుకురావాలినేటి యువతకు పుస్తకం చదవమని చెప్పడం మాత్రమే సరిపోదు. వాళ్లకు చదవాలనిపించే పుస్తకం ఇవ్వాలి.వారి జీవితాన్ని ప్రతిబింబించే కథలు రావాలి. వారి సందేహాలను మాట్లాడే వ్యాసాలు రావాలి. వారి భాషలో కవిత్వం రావాలి. గ్రామీణ జీవితం, పట్టణ జీవితం, వలస జీవితం, రైతు జీవితం, కార్మికుల అనుభవాలు, మహిళల ప్రపంచం, యువత కలలు——సమాజంలోని ప్రతి కోణం సాహిత్యంలోకి రావాలి. అప్పుడు పుస్తకం అలమారలో ఉండదు. పాఠకుడి జీవితంలోకి వస్తుంది.ఇప్పటికే తెలుగు సాహిత్య రంగంలో కొత్త రచనలు, ఆన్‌లైన్ పత్రికలు, పరిశోధనా వేదికలు, డిజిటల్ ప్రచురణలు పెరుగుతున్నాయి. 2026లోనూ తెలుగు సాహిత్యంపై పరిశోధన, సదస్సులు, కొత్త ప్రచురణలు కొనసాగుతున్నాయి.

**డిజిటల్ ప్రపంచం శత్రువు కాదు**

మొబైల్ ఫోన్‌ను పుస్తకానికి శత్రువుగా చూడటం సులభం. కానీ అదే మొబైల్‌ను పుస్తకానికి వాహనంగా మార్చుకోవచ్చు.ఒక మంచి కథను ఆడియోగా వినవచ్చు. ఒక కవితను వీడియో రూపంలో పరిచయం చేయవచ్చు. అరుదైన పుస్తకాన్ని డిజిటల్‌గా భద్రపరచవచ్చు. యువత కోసం చిన్న పుస్తక పరిచయాలు చేయవచ్చు. పాత సాహిత్యాన్ని కొత్త తరానికి అర్థమయ్యే వ్యాఖ్యానాలతో అందించవచ్చు.ఇంకా ముందుకు వెళితే సాంకేతికత సాహిత్య పరిరక్షణకు కొత్త అవకాశాలు తెరుస్తోంది. తెలుగు ఛందస్సు వంటి సంప్రదాయ జ్ఞానాన్ని డిజిటల్ పద్ధతుల్లో విశ్లేషించి భద్రపరచే పరిశోధనలు కూడా జరుగుతున్నాయి.అంటే సాంకేతికతతో పోరాడాల్సిన అవసరం లేదు.సాంకేతికతను సాహిత్యానికి మిత్రుడిగా మార్చుకోవాలి. పాఠకుడు మారాడు... రచయిత కూడా మారాలి నేటి పాఠకుడికి సమయం తక్కువ. కానీ ఆలోచనల కొరత లేదు. అతనికి ప్రపంచం మొత్తం తన చేతిలో ఉంది. అందుకే రచయిత కూడా కొత్త ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి.భాషను కాపాడాలనే పేరుతో భాషను భారంగా మార్చకూడదు. సాహిత్యాన్ని గొప్పదిగా నిలబెట్టాలనే పేరుతో పాఠకుడికి దూరం చేయకూడదు.

సరళమైన భాషలో లోతైన ఆలోచన చెప్పగలిగితేనే సాహిత్యం ఎక్కువ మందికి చేరుతుంది.

ఇది భాషను సరళీకరించడం కాదు. భాషలోని అందాన్ని పాఠకుడికి అందుబాటులోకి తీసుకురావడం.

**సాహిత్యం ఎవరి కోసం?**

ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభం——మనిషి కోసం.


పేదవాడి కన్నీరు కూడా సాహిత్యమే. రైతు చెమట కూడా సాహిత్యమే. కూలీ జీవిత పోరాటం కూడా సాహిత్యమే. తల్లి మమత కూడా సాహిత్యమే. యువకుడి కల కూడా సాహిత్యమే. వృద్ధుడి ఒంటరితనం కూడా సాహిత్యమే.



ఎం రవీందర్
7901503777

# దళిత సమాజపు ఆణిముత్యం జాన్సన్

సినిమా రచయిత, నటుడు, నాటక రచయిత, గాయకుడు, సంగీత దర్శకుడు, గీత రచయితగా అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన సంపూర్ణ కళాకారుడు మోదుకూరి జాన్సన్. గుంటూరు జిల్లా కొలకలూరులో రత్తమ్మ, గురవయ్య దంపతులకు 1936 ఆగస్టు 8న జన్మించారు. 1988 డిసెంబరు 24న కన్నుమూశారు. దుగ్గిరాల, గుంటూరులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తిచేశారు. అనంతరం తెనాలిలో కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. అప్పటికే తెనాలి సాహిత్య, నాటక, కళా కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. అక్కడి సాహితీవేత్తలు, కళాకారులతో ఏర్పడిన పరిచయాలు ఆయన కళాభిరుచిని మరింత పెంచాయి. జాషువా సాహిత్య ప్రభావంతోపాటు నూతక్కి అబ్రహాము, పొన్నెకంటి పోతురాజు వంటి వారి సాహచర్యం ఆయన సృజనాత్మక వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది. గంభీరమైన స్వరంతో గాయకుడిగా, వేదికపై మంచి వక్తగా కూడా గుర్తింపు పొందారు. నాటకరంగమే జాన్సన్ ప్రతిభకు తొలి ప్రధాన వేదిక. నాటకరచనతోపాటు నటనలోనూ రాణించారు.



'నటనాలయం', 'దేవాలయం', 'హృదయాలయ', 'సిలువభారం' వంటి నాటకాలు రాసి ప్రదర్శించారు. ఢిల్లీలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ యువజనోత్సవాల్లో పాల్గొని బహుమతులు అందుకున్నారు. 1965లో ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రదర్శించిన 'నటనాలయం' ఉత్తమ రచనగా ఎంపికైంది. నాటక సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇందులో ప్రస్తావించారు. కళాకారుల జీవితాన్ని కూడా ఆవిష్కరించారు. కళకు ఉన్న సామాజిక బాధ్యతను చాటిచెప్పారు. ', 'విచిత్ర దాంపత్యం', 'డబ్బుకు లోకం దాసోహం', 'కరుణామయుడు', 'ఇంద్రధనుస్సు', 'ఆంధ్ర కేసరి', 'దేశోద్ధారకులు', 'సోగ్గాడు', 'సాహసగాళ్ళు' తదితర చిత్రాలకు సంభాషణలు రాశారు. దాదాపు 50 చిత్రాలకు ఆయన మాటలు అందించినట్టు ఆయన సినీ ప్రస్థానానికి సంబంధించిన వివరాలు చెబుతున్నాయి. జనరంజకమైన భాషలో సంభాషణలు రాయడం ఆయన ప్రత్యేకత. కథకు తగిన నాటకీయతను జోడించడంలోనూ ఆయనకు మంచి పట్టు ఉంది. నటుడిగానూ తన ప్రతిభను ప్రదర్శించారు. సినిమా సంభాషణలతోపాటు గీత రచయితగా కూడా జాన్సన్ ప్రతిభ చాటుకున్నారు. 'కరుణామయుడు' చిత్రంలోని 'కదిలింది కరుణరథం... సాగింది క్షమా యుగం' పాట ఆయనకు మంచి పేరు తెచ్చింది. 'పాడిపంటలు'లోని 'మన జన్మభూమి... బంగారు భూమి' పాటలో గ్రామీణ జీవితం, నేలతో మనిషికి ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించారు. 'దేశోద్ధారకులు'లోని 'స్వాగతం దొరా' పాట కూడా గుర్తింపు తెచ్చింది. దాశరథి రాసిన పాటకు అప్పటికప్పుడే స్వరపరిచి పాడారు. ఈ సందర్భంగా సినారె ప్రశంసలు అందుకున్నారు. ఇది ఆయన సంగీత ప్రతిభకు మరో నిదర్శనం. 'రాగ హృదయం'కు నేపథ్యగానం అందించారు. 'చండాలిక', 'పైరుపాట' వంటి సంగీత రూపకాలకు సంగీత దర్శకత్వం వహించారు. అన్ని కళారూపాల్లో విస్తరించినప్పటికీ జాన్సన్ అంతరంగంలో కవి ఎప్పుడూ చైతన్యంగా ఉన్నారు. జాషువా సాహిత్యంలోని సామాజిక చైతన్యం ఆయనను బలంగా ప్రభావితం చేసింది. కులవివక్షపై నిరసన ఆయన రచనల్లో కనిపిస్తుంది. మానవ గౌరవం కోసం పోరాటం కూడా కనిపిస్తుంది. అణగారిన వర్గాల పట్ల సానుభూతి ఆయన రచనల్లో వ్యక్తమవుతుంది. 'నిచ్చెనమెట్లు'లో కులవ్యవస్థను ప్రశ్నించారు. 'మాతంగ సామ్రాట్ వీరబాహు'లో సామాజిక నిర్మాణాన్ని పరిశీలించారు. సున్నితమైన భావాలను పదునైన మాటలుగా మలచగలిగిన ఆయన కవితా స్వరాన్ని వాచస్పతి జగ్గయ్య గుర్తించారు. ఆయనకు 'అగ్నికవి' అనే బిరుదును ఇచ్చారు. గాయకుడిగా ప్రారంభమైన జాన్సన్ ప్రయాణం నాటక రంగానికి విస్తరించింది. అక్కడి నుంచి నటన, సంగీతం, గీత రచన, సినిమా సంభాషణల వరకు సాగింది. ఒకే రంగానికి పరిమితం కాకుండా కళలోని వివిధ ప్రక్రియలను తన సృజనకు వేదికలుగా మలుచుకున్నారు. కళను వినోదంగా మాత్రమే కాకుండా సామాజిక చైతన్యానికి సాధనగా భావించారు. మాటల్లో, పాటల్లో, నాటకాల్లో అణగారిన మనిషి పట్ల ఆవేదనను వ్యక్తం చేశారు. సమానత్వం పట్ల ఆకాంక్షను చాటిచెప్పారు. మోదుకూరి జాన్సన్ తెలుగు కళా సాహిత్య రంగాల్లో తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారు. దళిత సమాజం కోల్పోయిన ఆణిముత్యంగా ఆయన గుర్తుండిపోతారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ముందుతరాలకు స్ఫూర్తినిచ్చిన కళాకారుడిగా ఆయన జ్ఞాపకం చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## శూన్యంలో జీవితం

ఈ దినము
నిర్విరామంగా
గడిచిపోయింది
ఇసుక తుపాను
ఈదుతూ
శూన్యంలో జీవించటం
అతి పెద్ద కష్టం
అలల తాకిడికి
వొరుసుకు
పోయిన ఒడ్డు
హృదయం
క్షణం బతకటం మరో
క్షణం
ముక్కలైన వెయ్యో భాగం
వెలుగునీడలు
వెంటాడుతున్న
ఒంటరితనం
ఒకింత వాడి కాసింత
పచ్చబడిన జీవితం
తన తడి నీడల జ్ఞాపకాలు
మంచు పూల
లసుగందాలు మరో
మార్మీకం
ఇష్టా సరాగాలు,
ఇంద్రధనస్సులోని
వర్ణాలు
కాసేపూ నిలబడవు
ఇరు సంధ్యల పొదరిల్లు
విద్యుల్లతల మెరుపు
కాంతులు
ఎటు మాయమయ్యెనో
మరి!
ఎరిగిన కలల్ని కళ్లల్లోకి
వంపుకోవటం ఎలాగో
తెలిస్తే బాగుండేది
పగలు సరే
రేపటి రాత్రి ఎలా
నిద్రపుచ్చాలి
చకోరమై గగనమంతా
ఎలా చుట్టి రావాలి
ఇక సంధ్య
ముంచుకొస్తుంది
మబ్బుల తేరు మీద
చీకటి ద్వారాలు
దించుతూ
స్వప్నానికి స్వప్నానికి
మధ్య ఒక మెలకువ
కాలానికి కన్నీటికి మధ్య
చిన్న విరామ చిహ్నం!



# జాతీయం-అంతర్జాతీయం



# జవాబుదారీ తనమేది?



- కేంద్రంపై సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ ఫైర్
- పార్లమెంట్ గొంతుకను అణచివేయలేరంటూ ఆగ్రహం
- మోడీ సర్కారు సమర్థించుకోవటంపై విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఐ.ఎం.ఎస్) :**
మీరు పార్లమెంటు గొంతుకను అణచివేయలేరని ఆదివారం సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ కేంద్రప్రభుత్వాన్ని నిలదీశారు. నీట్ యుజి ప్రశ్నాపత్రాల లీకేజీ, యువత ఆందోళనలపై పార్లమెంటు జవాబుదారీగా వ్యవహరించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థుల నిరసనలు, నీట్‌యుజి 2026 పరీక్షకు సంబంధించిన మూడు సెట్ల ప్రశ్నలను లోక్‌సభ సమావేశాల్లో అనుమతించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలనలో 'ప్రశ్నోత్తరాల సమయం' ఒక కీలకమైన స్తంభం అని సౌరవ్‌దాస్ పునరుద్ఘాటించారు. నిరసనలు జరిగిన వారాల్లో పోలీసుల చర్యల గురించి హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో నేరుగా ఎందుకు వివరణ ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. ఈ పరిస్థితి "ఆందోళనకరమని అన్నారు. ఇటీవల ముగిసిన లోక్‌సభ సమావేశాల్లో, సిజెపి నేతృత్వంలోని యువత నిరసనలకు సంబంధించిన మూడు సెట్ల ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అనుమతించలేదని అన్నారు. లోక్‌సభ ఎంపీ మథేశ్వరన్ వి.ఎస్. మూడు సెట్ల ప్రశ్నల ద్వారా (నోటీసు రిఫరెన్స్ నంబర్లు 101799 మరియు 101801) కేంద్ర హోం శాఖ, కేంద్ర విద్యా శాఖల నుండి సమాధానాలను కోరారని అన్నారు. ఈ ప్రశ్నలను పార్లమెంటులో అడగలేకపోతే, ప్రభుత్వాన్ని ఎలా జవాబుదారీగా చేయాలి, నిరసనల ద్వారానా అని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాల్లో హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు ముందుకు వచ్చి, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు.

తిరస్కరించబడిన ప్రశ్నలు నీట్‌యూజీ 2026 అభ్యర్థులకు రీఫండ్‌లు, పేపర్ లీక్ ఆందోళనలు, ఢిల్లీలో నిరసనకారులకు నీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను నిరాకరించడం, శాంతియుత ఆందోళన పట్ల ప్రభుత్వ వైఖరి వంటి కీలక సమస్యలను పరిష్కరించే ప్రశ్నలను లోక్‌సభ తిరస్కరించిందని అన్నారు. ఈ ప్రశ్నలను తిరస్కరించేందుకు పార్లమెంటరీ అధికారులు రూల్ 41(2) కింద అనేక నిబంధనలను ఉటంకించారని అన్నారు. ఈ చర్య కార్యనిర్వాహక వర్గాన్ని ప్రజా పరిశీలన నుండి రక్షించడానికి ఎంచుకున్న 'వింత సమర్థనలు'గా ఆయన అభివర్ణించారు. 1. నీట్‌యూజీ 2026 దరఖాస్తు ఫీజుల రీఫండ్ 2. ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అపనమ్మకం 3. ఢిల్లీలో సిజెపి నిరసనకారులకు తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలను నిరాకరించడం 4. నిరసన చేస్తున్న విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వ వైఖరి 5. విద్యార్థుల సంక్షేమం, పేపర్ లీక్‌లు, విద్యా సంస్కరణలు 6. శాంతియుత నిరసన తెలిపే తమ ప్రాథమిక హక్కును వినియోగించుకుంటున్న పౌరుల పట్ల కేంద్రం వైఖరి గురించి ప్రశ్నలను సంధించారని అన్నారు. అయితే పార్లమెంట్ అధికారులు ఈ ప్రశ్నలను రూల్ 41(2) ను ఉటంకిస్తూ, (i), (iv), (v), (xviii), (xxii) క్లాజుల కింద అనుమతించేందుకు నిరాకరించిందని అన్నారు. ఈచర్య న్యాయబద్ధమైన ప్రశ్నలకు సమాధానమివ్వకుండా తప్పించుకునేందుకు తీసుకున్న వింత సమర్థనగా ఆయన పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య సంస్థలు సభలో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరాకరించినప్పుడు, పౌరులకు తమ నిరసనలను వీధుల్లోకి తీసుకువెళ్లడం తప్ప మరో మార్గం ఉండదని దాస్ పునరుద్ఘాటించారు. ఎంపిలను ప్రశ్నలు అడగకుండా అడ్డుకోవడం, కేంద్ర ప్రభుత్వం, ప్రజల మధ్య మధ్యవర్తిగా పార్లమెంట్ పోషిస్తున్న పాత్రను బలహీనపరుస్తుందని, దానిని కార్యనిర్వాహక నిర్ణయాలకు ఒక నిష్క్రియాత్మక 'రబ్బర్ స్టాంప్'గా మారుస్తుందని అన్నారు. మీరు యువతను విస్మరించలేరని, ఇది తమ దృష్టిలో ప్రజాస్వామ్యయుత దేశం కాదని అన్నారు. పోటీ పరీక్షలలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకులు మరియు విస్తృత విద్యా సంబంధిత ఆందోళనలపై సీజేపీ నేతృత్వంలో నెలల తరబడి జరుగుతున్న నిరసనల నేపథ్యంలో ఈ ఆరోపణలు వచ్చాయి. ఆ సంస్థ జూన్‌లో దేశవ్యాప్త ఆందోళనను ప్రారంభించింది. ఈ నిరసనలు మొదట ఢిల్లీలో ప్రారంభమై, ఆ తర్వాత దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాయి.

# కైరో చేరుకున్న హమాస్ రాజకీయ ప్రతినిధి



జెరూసలెం, ఆగస్టు 16 : ఈజిప్ట్ అధికారులతో చర్చల కోసం హమాస్ రాజకీయ విభాగం అధ్యక్షుడు ఖలీల్ అల్ హయ్యా శనివారం కైరోకు వెళ్లినట్లు హమాస్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఆదివారం ఉదయం ఈజిప్ట్ ఇంటెలిజెన్స్ చీఫ్ హసన్ రషద్‌తో సమావేశమవుతారని పేర్కొన్నాయి. ఖలీల్ అల్ హయ్యా జులై నెల చివరలో హమాస్ నాయకత్వాన్ని చేపట్టారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతినిధి జారెడ్ కుష్నర్ వచ్చేవారం ఇజ్రాయిల్

, ఈజిప్టుల్లో పర్యటించనున్న సంగతి తెలిసిందే.గాజా వ్యవహారాల్లో 'బోర్డ్ ఆఫ్ పీస్' ఉన్నత ప్రతినిధి నికోలే మ్లాడెనోవ్ కుష్నర్‌తో కలిసి రానున్నారు. హమాస్ తన ఆయుధాలను కొత్త పాలస్తీనా పాలక కమిటీకి అప్పగించడానికి అంగీకరించిన 15 అంశాల ప్రణాళికను నెతన్యాహూ ఇటీవల తిరస్కరించిన నేపథ్యంలో ఈ పర్యటన జరుగుతోంది. ఆ ప్రణాళికకు కట్టుబడి ఉండేలా నెతన్యాహు, ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విషయంలో మధ్యవర్తులు, అమెరికా వైపు నుండి చర్యల కోసం తాము ఎదురుచూస్తున్నామని హమాస్ రాజకీయ విభాగం సభ్యుడు బాసెమ్ నైమ్ శుక్రవారం మీడియాతో వెల్లడించారు. మరోవైపు గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నాయి. శనివారం

గాజాలోని వివిధ ప్రాంతాలలో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన వైమానిక దాడులు, ఫిరంగి దాడులు, కూల్చివేతల కారణంగా ఇద్దరు పాలస్తీనియన్లు మరణించగా, మరో 14 మంది గాయపడినట్లు ఆ ప్రాంత ఆరోగ్య శాఖ వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుండి గాజాలో ఇజ్రాయెల్ దాడుల వల్ల 1,250 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినట్లు పాలస్తీనా అధికారిక వర్గాలు తెలిపాయి. 2023 అక్టోబర్ నుండి ఇప్పటివరకు నమోదైన మొత్తం మరణాల సంఖ్య 73,300 దాటింది.



## షారూఖ్, అజయ్, టైగర్ ష్రాఫ్‌లకు
# నోటీసులు

- విమల్ పాన్ మసాలాపై ప్రచారం చేసినందుకే

**ముంబయి, ఆగస్టు 16 (ఐ.ఎం.ఎస్) :**
నిషేధిత పాన్ మసాలాను(విమల్ ఇలాచీ యాడ్) పరోక్షంగా ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలపై బాలీవుడ్ నటులు షారూఖ్ ఖాన్, అజయ్ దేవగణ్, టైగర్ ష్రాఫ్‌లకు మహారాష్ట్ర ఆహార, ఔషధ పరిపాలన శాఖ (ఎఫ్‌డీఏ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 'విమల్ ఇలైచి' ప్రకటన ద్వారా రాష్ట్రంలో నిషేధిత 'విమల్ పాన్ మసాలా'ను ప్రచారం చేస్తున్నట్లు ఎఫ్‌డీఏ ఆరోపించింది. ప్రచారం నుంచి వైదొలగడంతోపాటు సోషల్ మీడియా నుంచి ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను తొలగించాలని, బ్రాండ్‌తో చేసుకున్న ఒప్పందాల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఆరోపణలు రుజువైతే వినియోగదారుల పరిరక్షణ చట్టం కింద రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానాతో పాటు ఏడాది నుంచి మూడేళ్ల వరకు బ్రాండ్ ప్రచారాలపై నిషేధం విధించే అవకాశం ఉంది. ఇదే ప్రకటనలో గతంలో నటించిన అక్షయ్ కుమార్.
. 2022లో విమర్శల నేపథ్యంలో క్షమాపణలు చెప్పి ప్రచారం నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.

# దేశానికి ప్రధాని ఇలాగేనా మాట్లాడేది...?

- 'దిమాగీ నక్సల్స్' అంటూ వ్యాఖ్యలు
- ఎర్రకోట సాక్షిగా మోడీ నోట కొత్త మాట!
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావన
- దేశానికి కొత్త శత్రువులంటూ అభివర్ణన
- సర్వత్రా విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఐ.ఎం.ఎస్) :**
ప్రజా ఉద్యమకారులను, ప్రశ్నించే గొంతులను, రాజకీయ ప్రత్యర్థులను 'అర్బన్ నక్సలైట్లు' అంటూ ఇప్పటి వరకు అనేక రకాలుగా వేధించిన కేంద్ర ప్రభుత్వం మరింత విస్తృతంగా అణచివేత చర్యలకు సిద్ధమవుతోందా? ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఆ దిశలో అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో 'దిమాగీ నక్సల్స్' (నక్సలైట్ల మనస్తత్వం ఉన్న వ్యక్తులు) అంటూ కొత్త మాటను ప్రస్తావించారు. అంతటితో ఊరుకోని ఆయన వారిని 'దేశానికి కొత్త శత్రువులు' అని అభివర్ణించారు. వారిని ఒంటరిపాటు చేయాలని చెప్పారు. 'అడవుల్లోని సాయుధ నక్సలైట్లను నిర్మూలించాం. ఆ సంక్షోభం నుండి దేశాన్ని విముక్తి చేయడంలో విజయం సాధించాం. సాయుధ నక్సలైట్లు కనుమరుగైనా దిమాగీ నక్సల్స్ మిగిలే ఉన్నారు. మావోయిస్టు భావజాలం ఉన్న ఆ వ్యక్తులు సమాజంలో బలంగా పాతుకుపోయారు. అధికార పీఠాల్లో కూడా వారికి స్థానం ఉండేది. ప్రభుత్వ కమిటీలలో సలహాదారులుగా ఉండేవారు. మావోయిస్టు ఆలోచనా విధానం విధానాలను ప్రభావితం చేసింది. వివిధ రంగాల్లోకి చొరబడిన వారు ఒక అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. హింస, అశాంతి



సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ దిమాగీ నక్సల్స్‌ను గుర్తించాలి. ఒంటరి పాటు చేయాలి. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలి' అని ప్రధాని అన్నారు. జెన్ జెడ్ ఉద్యమంతోపాటు దేశ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ఎర్రకోట సాక్షిగా ప్రధాని నోట వెలువడిన ఈ మాటలు చర్చనీయాంశంగా మారాయి. ప్రశ్నించే వారిపై మరింతగా అణచివేత చర్యలు తప్పవన్న సంకేతాలు ఇస్తూనే యువతను ఆకట్టుకోవడానికి పలు అంశాలను కూడా ప్రధాని ప్రకటించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని అన్నారు. వికసిత్ భారత్ కోసం సప్తధార ప్రణాళికను ప్రకటించారు. తయారీ శక్తి, ఫుడ్ ప్రొడక్షన్, టెక్నాలజీ, గతిశక్తి, రక్షణ రంగం, గ్రీన్ ఎకానమీ, బ్లూ ఎకానమీ, యువశక్తి అని అన్నారు. 'భారత్‌లో ప్రస్తుతం సుమారు రెండున్నర లక్షల స్టార్టప్‌లు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం ఎఐ ఇంపాక్ట్ సదస్సును నిర్వహించింది. రాబోయే సంవత్సర కాలంలో దేశంలోని కోటి మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నైపుణ్యాన్ని నేర్పించనున్నాం' అని చెప్పారు. దేశవ్యాప్తంగా 'వందే మాతరం' నినాదం మార్మోగుతోందని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీలిమిటేషన్‌తో లింకున్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికి మద్దతు ఇవ్వాలని, ఆ తరువాత ఆ అంశంలో క్రెడిట్ తీసుకోవాలని ప్రతిపక్షాలను ప్రధాని మోడీ కోరారు. గత 40 ఏళ్ల నుంచి మహిళా రిజర్వేషన్ అంశం రాజకీయ అకాడాలో ఉండిపోయిందన్నారు. మహిళలను గౌరవించాల్సిన సమయం వచ్చిందని, అసెంబ్లీలు.. లోక్‌సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసి మహిళలను గౌరవించాలన్నారు. 2036 ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు దేశం పోటీపడుతోందని చెప్పారు. ఆ ఒలింపిక్స్‌లో కనీసం ముప్పావు వంతు అంశాలలో క్రీడాకారులు పాల్గొనాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతిభావంతులను గుర్తించడానికి, 5 నుంచి 15 ఏళ్ల పిల్లల కోసం దేశవ్యాప్త ప్రతిభాన్వేషణను ప్రారంభిస్తున్నాం. ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం" అని అన్నారు.

ప్రధాన మంత్రి హోదాలో నరేంద్రమోడీ వరుసగా 13వ సారి ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఆయన జాతీయ పతాకం ఆవిష్కరించిన అనంతరం ఆర్మీ బ్యాండ్‌తో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. తొలుత 21 గన్ సెల్యూట్ చేశారు. 1721 ఫీల్డ్ బ్యాటరీ సెర్మోనియల్ గ్రూపు ఈ సెల్యూట్ నిర్వహించారు. 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్ వాడారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గీతం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరువాత మొదటిసారి పూర్తిగా వందేమాతరం గీతాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. ప్రధాని ఎరుపు రంగుతో కూడిన సాంప్రదాయ రాజస్థానీ బాంధనీ తలపాగాను, తెల్లటి కుర్తా, గోధుమ రంగు కలిగిన కోట్‌ను ధరించారు. జేబులో జాతీయ జెండా రంగులతో కూడిన 'పాకెట్ స్క్వేర్'ను ప్రత్యేకంగా అలంకరించుకున్నారు.

### ప్రశ్నించే వారిపై దాడికి మోడీ ప్రభుత్వ ప్రణాళిక
సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "దిమాగీ నక్సల్" అంటూ చేసిన వ్యాఖ్య వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులపై, ప్రశ్నలు లేవనెత్తే వారందరిపై ఆయన ప్రభుత్వం దాడి చేయడానికి ప్రణాళిక రచిస్తోందని స్పష్టం చేస్తోంది. ఇది ప్రజాస్వామ్య హక్కులకు, పౌర స్వేచ్ఛలకు పెద్ద ముప్పు. ప్రతిపక్షంలోని వారిని దేశద్రోహులుగా నిందించాలని వారు ఎప్పుడూ చూస్తుంటారు. వారి మనసులో మావోయిస్టులు అనే ఆరోపణ వారికి చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ఇది ఒక దారుణమైన ఆరోపణ. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనకు ముడిపెట్టకుండా, ఉన్న సీట్లలోనే కోటాను అమలు చేయాలని అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

# పేలిన విమాన ప్రయాణీకుడి తుపాకీ

- ఇద్దరికి గాయాలు

**లక్నో, ఆగస్టు 16 (ఐ.ఎం.ఎస్) :**
వారణాసిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక ప్రయాణికుడి వద్ద ఉన్న తుపాకీ పేలింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు జరిగిన ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు అధికారులు తెలిపారు.వివరాల ప్రకారం .. అజంగఢ్‌కు చెందిన ఆ ప్రయాణికుడు తన



భార్యతో IX1810 ఎయిరిండియా విమానంలో ముంబయి వెళుతున్నాడు. అతను తన వద్ద తుపాకీ ఉందని అధికారులకు తెలిపాడు. ఆయుధాల తనిఖీ సమయంలో ఒక రౌండ్ కాల్పులు జరపడంతో, పిస్టల్ నుండి దూసుకువచ్చిన తూటా నేలను తాకి, బ్యాగేజ్ స్క్రీనింగ్ కోసం లైన్‌లో నుంచున్న ఒక యువకుడికి, మహిళకు తగిలింది. మహిళ తొడకు, యువకుడి చేతికి బుల్లెట్ గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చినట్లు వారణాసి విమానాశ్రయ అథారిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

## నేవీ అధికారి కుటుంబ అనుమానాస్పద మృతి



ముంబయి, ఆగస్టు 16 (ఐ.ఎం.ఎస్) : భారత నౌకాదళ నావికుడు, ఆయన కుటుంబం అనుమానాస్పద స్థితిలో మరణించారు. నావికుడు, ఆయన భార్య, ఇద్దరు మైనర్ పిల్లల మృతదేహాలను దక్షిణ ముంబయిలోని నేవీ నగర్ ప్రాంతంలో ఉన్న నివాసంలో గుర్తించినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. నావికుడి మృతదేహం ఒక గదిలో గుర్తించగా, అతని భార్య, రెండు నెలలు, మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లల మృతదేహాలు కూడా అక్కడే లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో, ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లుగానూ, భార్య మరియు పిల్లలకు విషప్రయోగం జరిగినట్లుగానూ ప్రాథమిక విచారణలో గుర్తించామని అన్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించామని, పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారని భారత నావికాదళం తెలిపింది.

# ఆ యువకుడికి జాక్‌పాట్

- డ్రైనేజీ పనుల్లో బంగారు బిస్కెట్లు, నాణేలు దొరికిన వైనం
- వాటి విలువ రూ.98 కోట్లు

బ్రెస్సెల్స్, ఆగస్టు 16: భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్వకాలు జరుపుతుండగా.. ఊహించని విధంగా భారీ మొత్తంలో బంగారు బిస్కెట్లు, అరుదైన నాణేలు బయటపడ్డాయి. వీటి విలువ దాదాపు 9 మిలియన్ యూరోలు (భారత కరెన్సీల్లో రూ.98 కోట్లు) ఉంటాయని అంచనా. ఈ ఘటన బెల్జియం రాజధాని బ్రెస్సెల్స్‌కు సమీపంలోని సింటిగిల్లిస్‌డెండర్‌మొండె ప్రాంతంలో వెలుగుచూసినట్టు ది గార్డియన్ పత్రిక నివేదించింది. సమ్మర్ జాబ్ చేస్తోన్న కోబే అనే 18 ఏళ్ల యువకుడు ఈ నిధిని గత మంగళవారం మొదటిసారి గుర్తించాడు.అతడు స్థానిక నెట్‌వర్క్ వీటీఎంతో మాట్లాడుతూ.. "మాకు ఒక్కసారిగా కింద ఏదో మెరుస్తున్నట్టు కనిపించింది..దానిని మేము యూరో నాణేలు అనుకున్నాం.. కానీ, తవ్వుతుంటే బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి.. మేము అనుకున్న దానికంటే అక్కడ పెద్ద నిధి ఉందని తర్వాత అర్థమైంది" అని తెలిపాడు.



తన సహచర కార్మికులతో కలిసి పనులు చేస్తున్న సమయంలో నిధి బయటపడింది.19వ శతాబ్దం చివరలో మద్యం తయారీ కేంద్రం యజమాని థియోఫిలస్ వాన్ అస్చే కోసం నిర్మించిన విల్లా కింద ఇటుకలతో కట్టిన గోడ లోపల భద్రపరిచిన ఒక బ్యాగులో ఈ నిధిని దాచారు. ఈ నిధిలో బంగారు నాణేలు, బంగారు ముక్కలు, నెంబర్లు వేసిన కడ్డీలు ఉన్నాయి. "సాధారణ మంగళవారం ఉదయం ఇలాంటిది జరుగుతుందని ఎవరూ ఊహించరు" అని కోబ్ అన్నాడు. ఈ నిధిని కావాలనే ఎవరైనా దాచిపెట్టినట్లు కనిపిస్తోందని అతడు అభిప్రాయపడ్డాడు.నిధి బయటపడిన ప్రదేశంలో 1899లో ప్రారంభమైన బీరు తయారీ కేంద్రం 1970 వరకు నడించింది.
ఇప్పటికీ భవనం ఇనుప గేట్లపై 'VA' అనే అక్షరాలు కనిపిస్తాయి.

# అమెరికాను వణికిస్తోన్న ఇరాన్

- అగ్రరాజ్య రక్షణ వ్యవస్థను ఛేదించిన క్షిపణి
- రష్యా వ్యూహాలు .. భూగర్భ స్థావరాలు
- అత్యంత వేగంగా పావులు కదుపుతున్న టెహ్రాన్

**వాషింగ్టన్, ఆగస్టు 16:**
అమెరికా, ఇరాన్ మధ్య సంఘర్షణతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై గత నెల ఇరాన్ జరిపిన దాడుల్లో ముగ్గురు అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణి నిరోధక వ్యవస్థలు ఉన్నప్పటికీ, ఇరాన్ ఎంత వేగంగా తన వ్యూహాలను మార్చుకుందో ఈ దాడి స్పష్టం చేస్తోంది. ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థను ఏమార్చేందుకు రష్యా తరచుగా డ్రోన్లు, బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను ఒకేసారి ప్రయోగించేది. ఇరాన్ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది. కేవలం ఒకే రకమైన ఆయుధంపై ఆధారపడకుండా, డ్రోన్లు, వివిధ రకాల క్షిపణులను కలిపి ఒకేసారి మోహరిస్తోంది.జోర్డాన్‌లోని మూడు అమెరికా సైనిక స్థావరాలపై ఐదు రోజుల పాటు ఇరాన్ వరుసగా డ్రోన్లు, క్షిపణులతో దాడిచేసి తుఫాను సృష్టించింది. అగ్రరాజ్యం వైమానిక రక్షణ వ్యవస్థలను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టి, వారు ఉపయోగిస్తున్న 'పేట్రియాట్' ఇంటర్సెప్టర్ క్షిపణులను ఖాళీ చేయించడమే ఇరాన్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.హఠాత్తుగా దిశలను మార్చుకుంటూ, అమెరికా గగనతల రక్షణ వ్యవస్థలకు దొరక్కుండా తప్పించుకునే సామర్థ్యం ఉన్న క్షిపణులను కూడా ఇరాన్ ప్రయోగించింది. మొదటి నాలుగు రోజుల పాటు అమెరికా వైమానిక రక్షణ వ్యవస్థలు మెజారిటీ దాడులను అడ్డుకోగలిగాయి. అయితే, జులై 17న ఇరాన్ ప్రయోగించిన ఒక క్షిపణి అమెరికా రక్షణ వలయాన్ని ఛేదించుకుని, సైనిక స్థావరం వద్ద ఉన్న తాత్కాలిక నివాస సముదాయాన్ని ఢీకొట్టింది. న్యూయార్క్ టైమ్స్‌తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో "మేము దాదాపు అన్ని క్షిపణులను కూల్చివేశాం. కానీ ఒకటి మాత్రం రక్షణ వలయాన్ని దాటుకుని లోపలికి



వచ్చేసింది" అని తెలిపారు.ఈ ఘటనలో ముగ్గురు అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా గాయపడ్డారు. అదే వారంలో జోర్డాన్‌లోని ఇతర అమెరికా స్థావరాలపై జరిగిన దాడుల్లో పలు విమానాలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా ఆయుధ నిల్వలపై అవగాహన ఉన్న ఇద్దరు వ్యక్తులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ యుద్ధ సమయంలో పెంటగాన్ ఇప్పటికే 1,500కి పైగా పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్లను ఉపయోగించిందని, ప్రస్తుతం వారి వద్ద 1,700 కంటే తక్కువ మాత్రమే మిగిలి ఉన్నాయని తెలుస్తోంది.'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' రక్షణభద్రత విభాగం ప్రెసిడెంట్ సేథ్ జి. జోన్స్ మాట్లాడుతూ.."ఒకేసారి రకరకాల క్షిపణులు, డ్రోన్లు దాడికి వస్తున్నప్పుడు వాటిని అడ్డుకోవడం వైమానిక రక్షణ వ్యవస్థలకు అత్యంత సవాల్‌గా మారుతుంది" అని అన్నారు.ఉక్రెయిన్ రష్యా యుద్ధం నుంచి ఇరాన్ అనేక పాఠాలు నేర్చుకుంది. రష్యా ఏకకాలంలో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లను పదే పదే ఉపయోగించింది. యుద్ధం ప్రారంభమైన మొదటి ఐదు వారాల్లో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌కు చెందిన అనేక క్షిపణి స్థావరాలపై బాంబుల వర్షం కురిపించాయి. వాటిలో చాలావరకు భూగర్భంలో ఉన్నవే. దీంతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం తీవ్రంగా దెబ్బతిందని అమెరికా భావించింది. కానీ, ఇరాన్ అత్యంత వేగంగా ఆ స్థావరాలను పునరుద్ధరించుకుని, మళ్లీ క్షిపణి దాడులను ప్రారంభించగలిగింది.

# అప్పటి వరకూ భారత్‌కు రాలేం

- తేల్చి చెప్పిన బంగ్లాదేశ్
- హసీనాను అప్పగించాకే వస్తామని వెల్లడి
- ఈ విషయంలో ఇండియాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ

**ఢాకా, ఆగస్టు 16:**
భారత్‌లో ఆశ్రయం పొందుతున్నబంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనాను అప్పగించాలనిఆ దేశం కోరుతున్న విషయం తెలిసిందే. తాజాగా, బంగ్లాదేశ్ దీనిపై కీలక వ్యాఖ్యలు చేసింది. హసీనా, పరారీలో ఉన్న నిందితులను బంగ్లాదేశ్‌కు అప్పగించే విషయంలో ముందుకు వెళ్తే తప్ప, తమ ప్రధాని తారిక్ రెహమాన్ భారత పర్యటన అసంభవమని తేల్చిచెప్పింది. భారత పర్యటనకు రావలసిందిగా బంగ్లాదేశ్ ప్రధానికి వచ్చిన ప్రతిపాదన ముందుకు సాగే అవకాశం లేదని స్పష్టం చేసింది. తారిక్ రెహమాన్ న్యూఢిల్లీ ద్వైపాక్షిక పర్యటన అవకాశాల



పై ఇరు దేశాల అధికారులు గత కొన్ని వారాలుగా చర్చలు జరుపుతున్నట్లు బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలభారత్ హైకమిషనర్ దినేష్ త్రివేది.. బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహమాన్ మధ్య జరిగిన భేటీలోనూ హసీనా అప్పగింత అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం. అయితే, ఆగస్టు 5న న్యూఢిల్లీలో షేక్ హసీనా పాల్గొన్న ఓ సమావేశం కారణంగా ఈ చర్చలు ప్రభావితమయ్యాయని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎకేఎమ్ షాహిదుల్ కరీమ్ తెలిపారు. "ఈ పర్యటనకు తగిన అనుకూల వాతావరణం ఏర్పడాలని మేం భావిస్తున్నాం" అని కరీమ్ పేర్కొన్నారు. "మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు పరారీలో ఉన్న ఇతర నేరస్థులను భారత్ అప్పగించాలి.... అలాగే ద్వైపాక్షిక అప్పగింత ఒప్పందానికి కట్టుబడి షహీద్ షరీఫ్ ఉస్మాన్ హాడీ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని మేము చేసిన అభ్యర్థనపై భారత అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాం. వారి సమాధానం కోసం మేము ఎదురుచూస్తున్నాం" అని ఆయన అన్నారు.అయితే, బంగ్లాదేశ్ అధికారులతో కూడిన హసీనా మీడియా సమావేశంతో భారత ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని కేంద్రం స్పష్టం చేసింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ – ఉమ్మడి జిల్లాల వార్తలు

## వనదేవతలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు

- చేయూత పింఛన్ల చెక్కుల పంపిణీ, వాటర్ ప్లాంట్ ప్రారంభం
- మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి ముచ్చట

**మేడారం/ములుగు, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ములుగు జిల్లాలోని ప్రముఖ గిరిజన పుణ్యక్షేత్రం మేడారంలో పర్యటించారు. బిచ్కుంద నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రికి గిరిజన పూజారులు సాంప్రదాయ డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. మేడారంలోని వనదేవతలు సమ్మక్క–సారలమ్మల గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వనదేవతలను ప్రార్థించారు. తన మొక్కులలో భాగంగా వనదేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు.

**మహిళలకు చేయూత పింఛన్ల పంపిణీ**

గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన 24 మంది వితంతువులు, ఒంటరి మహిళలకు చేయూత సామాజిక భద్రత పింఛన్లను ముఖ్యమంత్రి స్వయంగా అందజేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.2,016 చొప్పున అందించే పింఛన్లకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.

ఆలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొక్క నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.





**వాటర్ ప్లాంట్ ప్రారంభం**

మేడారానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భక్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా అవసరమైన ఏర్పాట్లు సూచించారు.

**మహిళా సంఘాల సభ్యులతో ముచ్చట**

అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముచ్చటించారు. మహిళా సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలు, వారి ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం ముఖ్యమంత్రి మేడారం నుంచి ములుగుకు తిరుగుపయనమయ్యారు. ఈ పర్యటనలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణ రావు, నాయని రాజేందర్ రెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మురళి నాయక్, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, సెర్ఫ్ సీఈఓ దివ్య, మేడారం ఈఓ వీరస్వామి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన అధికారులు

**పరకాల టౌన్, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి) :**



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదివారం సాయంత్రం 5:06 గంటలకు ములుగు నుంచి హెలికాప్టర్‌లో పరకాలకు చేరుకున్నారు. పరకాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్కలతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు. హెలిప్యాడ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి దేవసేన, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వరంగల్ సీపీ శ్వేత, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న తదితరులు ఉన్నారు.

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష

**జనగామ, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో ఆదివారం, రాత పరీక్ష నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖలో 1 కుక్, 3 కామాటి, షెడ్యూల్డ్ కులాల సర్వీస్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్‌లో 1 డేటా ఎంట్రీ ఆపరేటర్, 1 ఆఫీస్ సబార్డినేట్, వ్యవసాయ మార్కెట్ కమిటీలో 2 డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 2 సెక్యూరిటీ గార్డులు, 1 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ కోసం మొత్తం (575) దరఖాస్తులు రాగా, అందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు (371), ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు (146), కుక్, కామాటి పోస్టులకు (50), సెక్యూరిటీ గార్డు పోస్టులకు (8) దరఖాస్తులు వచ్చాయి.

ఈ రాత పరీక్షకు మొత్తం (480) మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు (309) మంది, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు (118) మంది, సెక్యూరిటీ గార్డు పోస్టులకు (7) మంది, కుక్ పోస్టుకు (24) మంది, కామాటి పోస్టుకు (22) మంది పరీక్ష రాశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన రాత పరీక్షను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షించారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, ఉపాధి శాఖ అధికారి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు బల్లాలు వితరణ

**మధిర, ఆగస్టు 16, వుదయం ప్రతినిధి:**

ఎంపీ యుపిఎస్ కృష్ణాపురం పాఠశాల విద్యార్థులకు పది బల్లాలను గ్రామ మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మాజీ ఇంటర్మీడియట్ బోర్డు మెంబర్ కర్నాటి రామ్మోహన్ రావులు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వందనపు సునీత మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామంలోని పాఠశాల విద్యార్థుల కనీస అవసరాలు గుర్తించి బల్లాలను విరాళంగా ప్రకటించి అందజేయడం గొప్ప విషయమని అన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాల లో చదివి ప్రభుత్వ పథకాలను పొందాలని అన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అందజేసిన బల్లాల దాత కర్నాటి రామారావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కొత్తపల్లినరసింహారావు, ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, కోట జ్యోతి, వూట్ల కొండలరావు, చావా విజయమ్మ, చావా రమేష్ బాబు, రిటైర్డ్ హెడ్మాస్టర్ కర్నాటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## బిఎస్ఎన్ఎల్ లో ప్రత్యేక ఆఫర్లు

**హనుమకొండ, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి) :**

80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా వినియోగదారుల కోసం బిఎస్ఎన్ఎల్ పరిమిత కాలానికి పలు ఆకర్షణీయమైన మొబైల్, ఏప్ టీ టీ ఎచ్, ఇతర టెలికాం ఆఫర్లను ప్రవేశపెట్టిందని బిఎస్ఎన్ ఎల్ వరంగల్ జనరల్ మేనేజర్ ఎం.అరవింద్ కుమార్ ఆదివారం రోజున ప్రకటనలో తెలిపారు. రూ.1 మొబైల్ ప్లాన్.. 24 రోజుల వ్యాలిడిటీతో ప్రతిరోజు 1 జిబి డేటా, అపరిమిత వాయిస్ కాల్స్, వంద ఎస్ఎంఎస్ లు లభిస్తాయి, ఈ ఆఫర్ సెప్టెంబర్ 12వ తేదీ వరకు వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రూ.2,399 వార్షిక ప్లాన్:

ప్రత్యేక ఆఫర్లో భాగంగా 412 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. అంటే అదనంగా 47 రోజుల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ ఆఫర్ 12 సెప్టెంబర్ 12వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు. 1,111ఫైబర్ హై స్పీడ్ ప్లాన్.... గతములోరూ 1199 ఉన్న ఈ ప్లాన్ ప్రస్తుతంరూ.1,111కే అందిస్తున్నామని పేర్కొన్నారు.27 ఓటిటిలు, 200 ఎంబిపియస్ స్పీడ్, అపరిమిత వాయిస్ కాల్స్, 5000 జీబీడేటా వంటి ప్రయోజనాలు లభించడంతోపాటు జిఎస్టి అదనంగా వర్తిస్తుందిన్నారు . రూ499 ఫైబర్ బేసిక్ ప్లాన్... ప్రస్తుతం రూ499కే లభించే ఈ ప్లాన్ మొదటి నెల ఉచితం, తదుపరి 3 నెలలకు నెలకు రూ.100 తగ్గింపు ఉంటుంది. అనంతరం సాధారణ టారిఫ్,జిఎస్టి అదనంగా వర్తిస్తుందిని తెలిపారు. అలాగేమొబైల్ నెట్వర్క్ అందుబాటులో లేని ప్రాంతాల్లో కమ్యూనికేషన్ కోసం బిఎస్ఎల్ఎన్ స్టేట్ ల్లిటి ఫోన్ రూ.1,34,166/– (జిఎస్టి తో కలిపి) అందుబాటులో ఉందని జిఎంతెలిపారు.ప్రత్యేక ఆఫర్లు వినియోగదారులకు అందుబాటు ధరల్లో మెరుగైన టెలికాం, హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించాలనే బి ఎస్ ఎల్ ఎన్ లక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయని ఆయన చెప్పారు.



## 2 ఏళ్ల బేబీ ముక్కులోని అగ్గిపుల్ల తొలగింపు

- ఎండోస్కోపీతో సురక్షితంగా తీసివేసిన డా. ఆనంద్ రావు వాఘ్మారే
- ముక్కులో విదేశీ వస్తువులు ప్రాణాంతకం: ఐఎంఏ సెక్రటరీ డా. ఆనంద్ రావు హెచ్చరిక

**సూర్యాపేట ఆగస్టు 16 వుదయం ప్రతినిధి**



చిన్నారుల నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో తెలిపే సంఘటన ఒకటి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. 2 సంవత్సరాల చిన్నారి ఆడుకుంటూ చాలా పొడవైన అగ్గిపుల్లను ముక్కులోకి పెట్టుకోవడంతో అది లోపలికి వెళ్లి మిడిల్ మీటస్ మరియు నాసోఫారింక్స్ వద్ద ఇరుక్కుపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు సీనియర్ ఈ ఎన్ టి సర్జన్ డా. ఆనంద్ రావు వాఘ్మారే ని సంప్రదించారు. మొదటి ప్రయత్నంలో అది కనిపించలేదు. అయితే సరైన డీకంజెషన్ చేసిన తర్వాత ఎండోస్కోపీ మార్గదర్శకత్వంలో ఓ పి డి లోనే ఆ విదేశీ వస్తువును గుర్తించి ఎలాంటి ఇబ్బంది లేకుండా సురక్షితంగా తొలగించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సూర్యాపేట కార్యదర్శి డా. ఆనంద్ రావు వాఘ్మారే మాట్లాడుతూ, "ముక్కు, చెవి, నోటిలోకి విదేశీ వస్తువులు వెళ్లడం చాలా ప్రమాదకరం. అవి ఊపిరితిత్తుల్లోకి చేరితే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు" అని హెచ్చరించారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు అగ్గిపెట్టెలు, చిన్న బొమ్మలు, నాణేలు వంటివి పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే ఈ ఎన్ టి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

## వరి సాగు వద్దు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోండి

**జయశంకర్ భూపాలపల్లి: ఆగస్టు 16(వుదయం జిల్లా ప్రతినిధి)**

రైతు సోదరులు వానకాలంలో వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు పండించుకోవాలని మహాదేవపూర్ ఏ.డి.ఏ శ్రీపాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఎలినో ప్రభావంతో ఈ వానకాల సీజన్‌లో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉందని ఏప్రిల్ నెల నుంచే వ్యవసాయ శాఖ తోపాటు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,తెలంగాణ ప్రభుత్వం తరపున రైతులను పదేపదే చైతన్య పరుస్తున్నారు అని తెలిపారు.రైతు సోదరులు వరి సాగు విపరీతంగా చేస్తున్నారు అని తెలిపారు ఒకవేళ నీళ్లు సరిపోకపోతే ఏం చేస్తారంటే, మాకు వర్షాలు పడతాయనే నమ్మకం ఉన్నది. ఒకవేళ నీరు సరిపోక పంట నష్ట పోతే మా దురదృష్టం అనుకుంటాము.కానీ ప్రభుత్వాన్ని కానీ వ్యవసాయ శాఖను గాని బదనాం చేయమని చెప్పారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన లిఖితపూర్వక ఫిర్యాదులను ప్రజావాణిలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, వాటిపై తగిన చర్యలు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలోనూ ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావం వరి సాగుకు స్వస్తి పలకాలి

- వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ. ఆల్డాస్ జానయ్య

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి ఆగస్టు 16**

నల్లగొండ పట్టణ కేంద్రంలో వ్యవసాయ రంగంపై ఎల్ ని నో ప్రభావం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవలసిన చర్యలపై రైతు సంఘం సెమినార్ నిర్వహించడం జరిగింది. సెమినార్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అల్డాస్ జానయ్య మాట్లాడుతూ నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టుల్లో నీటి లభ్యతపై ఆశలు పెట్టుకుని కొత్తగా వరి నాట్లు వేయడం సరికాదని స్పష్టం చేశారు. ఇప్పటికే నార్లు పోసిన రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. నల్లగొండ పట్టణంలోని డైనింగ్ హాల్‌లో ఆదివారం వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన సెమినార్‌లో వీసీ మాట్లాడారు. రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే ప్రస్తుతం సుమారు 10–12 శాతం వర్షపాతం లోటు నమోదైందని, ఎనిమిది జిల్లాల్లో లోటు మైనస్ 30 శాతం వరకు చేరిందని తెలిపారు.

**సాగర్ నీళ్లపై ఆశలు వద్దు**

నాగార్జునసాగర్‌లో ఈసారి నీరు నిండే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని గత రెండు నెలలుగా ప్రభుత్వం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, నీటిపారుదల శాఖ రైతులను అప్రమత్తం చేస్తున్నాయని వీసీ తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచడంతో పాటు విత్తన మేళాలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. అయినప్పటికీ సాగర్ నీళ్లు వస్తాయన్న ఆశతో కొంతమంది రైతులు వరి నార్లు పోసుకున్నారని తెలిపారు. బావులు, బోర్లు ఉన్న ప్రాంతాల్లో కొంతమేర పంటను కాపాడుకునే అవకాశం ఉన్నప్పటికీ కేవలం సాగర్ నీటిపైనే ఆధారపడిన వరి సాగుకు ప్రస్తుతం అనుకూల పరిస్థితులు లేవన్నారు.

**కొత్తగా నాట్లు వేయొద్దు**

ఇప్పటి నుంచి కొత్తగా వరి నాట్లు వేయొద్దని వీసీ స్పష్టం చేశారు. ఇప్పటికే నారు పోసుకున్న రైతులు పరిస్థితిని గమనించాలని, కేవలం సాగర్ నీటిపై ఆధారపడి నాట్లు వేసుకోవడం వల్ల తర్వాత నీటి కొరతతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నల్లగొండలోనే రైతు మహాసభకు ప్రత్యేకత అఖిల భారత కిసాన్‌సభ 36వ మహాసభను నల్లగొండలో నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయమని జూలకంటి రంగారెడ్డి అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది రైతు ప్రతినిధులు నాలుగు రోజులపాటు మహాసభలో పాల్గొంటారని తెలిపారు. మహాసభను కేవలం ప్రతినిధులతో నిర్వహించి తీర్మానాలు చేయడం కాకుండా, రైతాంగాన్ని పెద్దఎత్తున కదిలించే కార్యక్రమం గా నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.



**రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది**

కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, ఎరువుల కొరత, బ్యాంకు రుణాల సమస్యలు రైతులను తీవ్రంగా వేధిస్తున్నాయని తెలిపారు. రైతుల సమస్యలపై అఖిల భారత కిసాన్‌సభ మహాసభలో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

ఈ సెమినార్ లో విశ్రాంత ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వీరపల్లి వెంకటేశ్వర్లు, కందాల ప్రమీల, బండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## సాగు నీటి సద్వినియోగం, ఆరుతడి పంటలపై శ్రద్ధ చూపాలి

**మహబూబాబాద్, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి) :**

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన శనివారం జిల్లా సాగునీటి పారుదల, వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి, అధిక లాభాలనిచ్చే ఆరుతడి, వాణిజ్య పంటలు, కూరగాయల సాగు వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించాలి. అవగాహనతో పంట మార్పిడి విధానంపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని, రైతుల్లో చైతన్యం తేవడంలో మీడియా ప్రతినిధులు భాగస్వాములు కావాలని కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు.



## రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

- జిల్లా పరకాలలో విజయోత్సవ సభ
- హిండ్రా డెయిరీ శంకుస్థాపన, 100 పడకల ఆసుపత్రి ప్రారంభం
- వరంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది సీఎం రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి



**హనుమకొండ, ఆగస్టు 16 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

వరంగల్ గడ్డకు గొప్ప చరిత్ర, పోరాట స్ఫూర్తి మరియు ప్రజా చైతన్యం ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా పరకాల మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 'ప్రజాపాలన–ప్రగతి బాట' విజయోత్సవ సభకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు రూ. 484 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో భారీ అప్పుల భారం ఉన్నప్పటికీ, సంక్షేమం మరియు అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, వరి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఇందిరమ్మ మహిళా శక్తి భవనాలు' మరియు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, వరంగల్ నగరాభివృద్ధికి ఓఆర్ఆర్, టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

**మామునూరు విమానాశ్రయం, దేవాదుల ప్రాజెక్టు త్వరలోనే పూర్తి: మంత్రి పొంగులేటి**

రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాల కల అయిన మామునూరు విమానాశ్రయం కోసం రూ.300 కోట్లకు పైగా హెచ్చించి భూసేకరణ చేపట్టామని, రెండేళ్లలో విమాన సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. అంతేకాకుండా, రూ.6,000 కోట్ల వ్యయంతో కూడిన దేవాదుల ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. వరంగల్ నగరంలో రూ.5,700 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.

**పరకాల అభివృద్ధికి విరామం లేని కృషి: ఎమ్మెల్యే రేవూరి, ఎంపీ కడియం కావ్య**

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పరకాల అమరధామాన్ని ప్రత్యేక పర్యాటక కేంద్రంగా గుర్తించాలని సీఎంను కోరారు. రూ.11.60 కోట్లతో పూర్తి చేసిన 100 పడకల ఆసుపత్రి ప్రారంభం, మహిళా సాధికారతకు దోహదపడే 'హిండ్రా డెయిరీ'కి శంకుస్థాపన జరగడం పరకాల ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుస్తుందన్నారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. విద్య, వైద్యం, మహిళా సాధికారతకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ.6,500 కోట్లతో వరంగల్ ప్రాంత రూపురేఖలు మారుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి
- సెప్టెంబర్లో అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావు ను చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

**పరకాల ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి):**

పరకాల నియోజకవర్గ అభివృద్ధికి రూ.424 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు మహిళా అభ్యున్నతి, ఆధునిక సాంకేతికత, రహదారుల అభివృద్ధి తదితర పనులకు శ్రీకారం చుట్టారు. ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామంలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు, పరకాల దేవస్థానానికి రూ.5 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేత కేసీఆర్, ఆయన కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వచ్చే సెప్టెంబర్‌లో జరిగే శాసనసభ సమావేశాలకు "అయ్యా, కొడుకు, అల్లుడు రండి.. చర్చించుకుందాం" అంటూ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును ఉద్దేశించి సవాల్ విసిరారు. తెలంగాణ అభివృద్ధి, రైతులు, పేదలు, మహిళల సంక్షేమంపై గత ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య తేడాను అసెంబ్లీలో చర్చిద్దామని అన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని సీఎం తెలిపారు. ఇప్పటివరకు ఎనిమిది లక్షల ఇళ్లను మంజూరు చేసి, రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లో రూ.90 వేల కోట్లు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఉచిత విద్యుత్ అందిస్తూ ప్రజలపై విద్యుత్ భారాన్ని పడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



**రైతు రాజ్యమే కాంగ్రెస్ లక్ష్యం:**

గతంలో వరి పంట వేస్తే ఉరి వేసుకున్నట్లేనని చెప్పిన కేసీఆర్ మాటలను ప్రస్తావిస్తూ, నేడు రైతులు వరి పంట పండించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకొచ్చామని సీఎం అన్నారు. రైతులకు మద్దతుగా నిలిచి రైతు రాజ్యాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ప్రజాప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశమని సీఎం అన్నారు. రై తు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత వి ద్యుత్, ధాన్యం కొనుగోళ్లు, వరి పంటకు బోనస్ కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

**మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం**

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మహిళలకు అందించిన బతుకమ్మ చీరలపై కూడా ఆయన విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన చీరలతో మహిళల్లో ఆనందాన్ని నింపుతోందని పేర్కొన్నారు.

**పరకాల అభివృద్ధికి మరిన్ని నిధులు**

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని సీఎం హామీ ఇచ్చారు. పరకాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. సభను విజయవంతం చేసిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు పరకాల శాసనసభ్యులు రేవుల ప్రకాష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**సీఎంకి బ్రహ్మరథం పట్టిన పరకాల నియోజకవర్గ ప్రజలు**

**వరంగల్ గడ్డ చైతన్యానికి ప్రతీక**

కాకతీయుల పాలన, వారి నిర్మాణాలు, చారిత్రక వారసత్వం వరంగల్ ప్రాంత గొప్పతనానికి ప్రతీకలని సీఎం అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, దాశరథి వంటి మహనీయులు ప్రజల కోసం తమ జీవితాలను అంకితం చేశారని గుర్తు చేశారు. ప్రజల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులుగా పనిచేయాలని, ప్రజలపై ఆధిపత్యం చెలాయించే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సీఎం స్పష్టం చేశారు. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యానికి బలమని అన్నారు.

**భారీ అప్పుల భారం ఉన్నా సంక్షేమానికి పెద్దపీట**

గత ప్రభుత్వం రాష్ట్రంపై భారీగా అప్పుల భారాన్ని మిగిల్చినప్పటికీ, ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఏకకాలంలో ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను క్రమబద్ధీకరిస్తూనే రైతులు, మహిళలు, నిరుపేదలు, యువత, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

**నిరుపేదల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయం**

ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సీఎం అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడమే ప్రజాపాలన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## అటల్ జీ సేవలు చిరస్మరణీయం

- **వాజ్ పేయ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి.**

**నిర్మల్ జిల్లా 16 ఆగస్ట్ 2026 (వుదయం ప్రతినిధి)**

భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి గారి 8వ వర్ధంతి సందర్భంగా నేడు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అటల్ జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.అటల్ జీ ఒక రాజనీతిజ్ఞుడు మాత్రమే కాదు, ఒక కవి, ఒక దార్శనికుడు. పోఖ్రాన్ అణు పరీక్ష, సర్వ శిక్షా అభియాన్ వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలతో భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన సుపరిపాలన మార్గం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణ రెడ్డి, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ బీజేపీ నాయకులు కందుల హరీష్, పొడెల్లి గణేష్, డి శ్రీనివాస్, తో పాటు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## PDS బియ్యం అక్రమ తరలింపు.. ఇద్దరు వ్యక్తులు పట్టివేత



**నాగిరెడ్డిపేట,వుదయం**

ప్రభుత్వ PDS బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగిరెడ్డిపేట పోలీసులు పట్టుకున్నారు. బూర్గుపల్లి గ్రామానికి చెందిన తోగేట బాలరాజు (49), మేంగారబోయిన యేసు (33) కలిసి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు.ఎస్ఐ భార్గవ్ గౌడ్ వివరాల ప్రకారం.. బూర్గుపల్లి నుంచి పోచారం మీదుగా లింగంపేట్ వైపు Ashok Leyland Dost Plus వాహనం (TS35TA2486)లో 29 సంచుల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, మాల్తుమ్మెద గేట్ సమీపంలోని NH765D రహదారిపై పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నారు.వాహనంలో మొత్తం 29 సంచుల్లో సుమారు 14.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బియ్యంతో పాటు అక్రమ కొనుగోలు, విక్రయాలకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.ఈ ఘటనపై నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ ఎం. మదన్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు. నిందితులపై తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన గడ్డం ఇందుప్రియ



**కామారెడ్డి, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి):-**

కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె జోనిట వివాహ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వివాహ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు నూతన వధూవరులకు దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

## భక్తిశ్రద్ధలతో నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన.



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని ఎలుకపెల్లి, బెజ్జూర్ గ్రామాల సమీపంలోని నాగుల చెరువు సమీపంలో నాగదేవత విగ్రహ పుణః ప్రతిష్టాపన భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి కాగజ్ నగర్ త్రినేత్ర ఆలయ ప్రధాన అర్చకులు సాయిరాం శాస్త్రి వేద పండితుల సమక్షంలో విగ్రహ పుణ: ప్రతిష్టాపన,ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సహకరించిన దాతలు అందరికీ ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు

. ఈ కార్యక్రమంలో శ్రీ రంగనాయక స్వామి ఆలయ అధ్యక్షులు తంగేడి పల్లి మహేష్, ఎలుక పెల్లి హనుమాన్ ఆలయ అధ్యక్షుడు శ్రీనివాస్, కోట్రంగి రామకృష్ణ, సిద్దాపూర్ సర్పంచ్ చెండే పద్మ శంకర్ విలేకరుల బృందం, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## రైతుబంధు బకాయిలపై హైకోర్టు సంచలన తీర్పు

### సింగిల్ జడ్జి ఉత్తర్వులు కొట్టివేత

**పెద్దపల్లి ఆగ్గు 16 (వుదయం ప్రతినిధి)**

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాలు తీసుకునే ఆర్థిక నిర్ణయాలకు, న్యాయస్థానాల ఆదేశాలకు మధ్య గీత ఎక్కడ ఉంది? ప్రజాధనాన్ని ఎవరికి, ఎలా, ఎంతమేర కేటాయించాలనే అంశాన్ని నిర్దేశించే సర్వోన్నత అధికారం ఎవరిది? కరోనా కాలంలో ఖజానాపై పడిన భారం దృష్ట్యా ప్రభుత్వం నిలిపివేసిన నిధులను న్యాయస్థానాల ద్వారా రప్పించుకోవచ్చా? వీటన్నింటికీ సమాధానమిస్తూ తెలంగాణ హైకోర్టు ధర్మాసనం అత్యంత కీలకమైన, స్పష్టమైన తీర్పును వెలువరించింది. ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చాలా పరిమితమని తేల్చిచెప్పింది.

ప్రభుత్వాలు అమలు చేసే ఆర్థిక, సంక్షేమ పథకాల ప్రాధాన్యాలను న్యాయస్థానాలు నిర్దేశించలేవని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రభుత్వ నిర్ణయం ఏకపక్షంగా, రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా లేదా స్పష్టమైన వివక్షతో కూడుకున్నదని రుజువైతే తప్ప పాలసీ విషయాల్లో న్యాయ సమీక్ష పరిధి అత్యంత పరిమితమని స్పష్టం చేసింది. బడ్జెట్ కేటాయింపులు లేని మొత్తాన్ని ఖజానా నుంచి విడుదల చేయాలని ఆదేశించడం కోర్టుల పరిధి కాదని స్పష్టీకరించింది. ఈ మేరకు 2019 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన రైతుబంధు బకాయిలను పిటిషనర్లకు చెల్లించాలంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ అప్పీలును డివిజన్ బెంచ్ అనుమతించింది.అసలు వివాదం ఏమిటి? : ఖమ్మం జిల్లా తల్లాడ మండలం



తల్లాడ, తెలగారం రెవెన్యూ గ్రామాలకు చెందిన టి.వెంకటనారాయణతో పాటు మరో నలుగురు రైతులు 2019 ఖరీఫ్, రబీ (వానాకాలం, యాసంగి) సీజన్లలో తమకు రైతుబంధు పెట్టుబడి సాయం అందలేదని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి, పిటిషనర్ల వినతిని పరిగణనలోకి తీసుకుని ఎనిమిది వారాల్లోగా 2019 రైతుబంధు నిధులను విడుదల చేయాలని గతంలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను, తదనంతరం దాఖలైన రివ్యూ పిటిషన్ తిరస్కరణను సవాలు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అప్పీల్‌పై లోతైన విచారణ జరిపి తీర్పునిచ్చింది.

కొవిడ్ వేళ ప్రభుత్వ ప్రాధాన్యతలు.. గణాంకాల పరిశీలన : ధర్మాసనం విచారణ సందర్భంగా ప్రభుత్వం సమర్పించిన రికార్డులను పరిశీలించింది. కరోనా మహమ్మారి విజృంభించిన 201920 ఆర్థిక సంవత్సరంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం పరిమిత వనరులతో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యమిచ్చినట్లు కోర్టు గుర్తించింది. 10 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే సాయం అందించారు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 1.42 లక్షల మంది రైతులకు రూ.850.82 కోట్ల నిధులు విడుదల కాలేదు. 6 ఎకరాల లోపు ఉన్న వారికే పరిమితం చేయడంతో 9.46 లక్షల మంది రైతులకు రూ.2,132.95 కోట్ల నిధులు నిలిచిపోయాయి. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం—ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేసినదే తప్ప, పిటిషనర్లపై మాత్రమే ఉద్దేశపూర్వకంగా వివక్ష చూపలేదని నిర్ధారించింది.

ప్రభుత్వ నిధుల కేటాయింపులు, ఆర్థిక పరిమితులపై గతంలో సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలను డివిజన్ బెంచ్ గుర్తుచేసింది. ఖజానా లభ్యతను బట్టి ఏ రంగానికి, ఏ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలనేది పూర్తిగా కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్) పరిధిలోని అంశం. కేవలం వినతిపత్రాలను ఉన్నతాధికారులకు పంపినంత మాత్రాన అది ప్రభుత్వం చేసిన హామీగా లేదా బాధ్యతగా పరిగణించలేమని స్పష్టం చేసింది.

## సోమవారం నుంచి మండల స్థాయిలోనూ “ప్రజావాణి” కార్యక్రమం...

- **ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ...**
- **జిల్లా రెవెన్యూ డివిజన్ స్థాయిలలో ప్రజావాణి యథావిధిగా కొనసాగింపు...**
- **జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**

ప్రజల సమస్యలను వారి నివాస ప్రాంతాలకు మరింత చేరువలో పరిష్కరించడంతో పాటు ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో పారదర్శకత జవాబుదారీతనం వేగవంతమైన స్పందనను పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మండల స్థాయిలోనూ “ప్రజావాణి” కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు ప్రభుత్వం జారీ చేసిన జి ఓ యంఎస్ నంబర్ 4 ప్లానింగ్ (వి) డిపార్ట్మెంట్ డేటెడ్ 4 8 2026 ప్రకారం జగిత్యాల జిల్లాలో సోమవారం నుంచి అనగా తేది 17 8 2026 నుంచి ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం (ఎంపీడీఓ ఆఫీసర్)లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు ఇప్పటికే నిర్వహిస్తున్న జిల్లా స్థాయి మరియు రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని వీటికి అదనంగా ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా మండల స్థాయి ప్రజావాణిని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ పేర్కొన్నారు ఎంపీడీఓ నోడల్ అధికారిగా బాధ్యతలుbమండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులు ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు ప్రారంభించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు మండల స్థాయి ప్రజావాణికి ఎంపీడీఓ తహసీల్దార్ మండల పంచాయతీ అధికారి మండల వ్యవసాయ అధికారి ఉద్యానవన అధికారి పశువైద్యాధికారి మత్స్యశాఖ



అధికారి మండల విద్యాధికారి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సీడీపీఓ అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు గృహ నిర్మాణ గ్రామీణ నీటి సరఫరా రహదారులు భవనాలు నీటిపారుదల భూగర్భ జల అటవీ విద్యుత్ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్ తో పాటు సంబంధిత ఇతర మండల స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు ప్రతి వినతి ఆన్‌లైన్‌లో నమోదు మండల స్థాయి ప్రజావాణిలో అందే ప్రతి వినతిని ఏకీకృత ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేస్తారని కలెక్టర్ తెలిపారు దరఖాస్తుదారులు సమర్పించే వినతిపత్రంతో పాటు సంబంధిత ఆధారాలు ధ్రువపత్రాలను స్కాన్ చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు వినతి నమోదు చేసిన అనంతరం దరఖాస్తుదారుడికి గ్రీవెన్స్ ఐడీతో కూడిన రసీదు అందజేస్తారని తెలిపారు ఈ గ్రీవెన్స్ ఐడీ ఆధారంగా దరఖాస్తుదారులు తమ ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు ప్రజలు తమ వినతులకు సంబంధించిన పూర్తి వివరాలు మొబైల్ నంబర్ చిరునామా అవసరమైన ఆధారాలు గతంలో సమర్పించిన దరఖాస్తుల వివరాలు ఉంటే వాటిని వెంట తీసుకురావాలని సూచించారు ప్రత్యేక సహాయ కేంద్రాల ఏర్పాటు ప్రతి మండల ప్రజావాణి కేంద్రంలో కంప్యూటర్ స్కానర్ ఇంటర్నెట్ సదుపాయాలతో ప్రత్యేక ఫిర్యాదుల నమోదు కౌంటర్ ఏర్పాటు చేయాలని సంబంధిత ఎంపీడీఓలను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు ప్రజలకు వినతులు రాయడంలో సహాయం చేయడానికి గతంలో సమర్పించిన వినతుల స్థితిని తెలుసుకోవడానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు ప్రజావాణికి వచ్చే వారికి తగిన కూర్చునే సౌకర్యం సురక్షిత తాగునీరు ఆరోగ్య సహాయ కేంద్రం మరుగుదొడ్లు అవసరమైన వారికి వీల్‌చైర్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు ప్రత్యేక అవసరాలున్న వారికి ప్రాధాన్యం దివ్యాంగులు వృద్ధులు గర్భిణులు చంటిపిల్లలతో వచ్చే మహిళలు అనారోగ్యంతో ఉన్న వారు ఇతర ప్రత్యేక అవసరాలున్న వారికి వినతుల స్వీకరణలో ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు ప్రజలు ఎక్కువసేపు వేచి ఉండకుండా సక్రమమైన టోకెన్ విధానం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి స్నేహపూర్వక వాతావరణంలో వినతులను స్వీకరించాలని సూచించారు ప్రజలు మండల స్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోనే పరిష్కరించ గల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరై వినతులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు అధికారులు ప్రజల నుంచి అందే వినతులను కేవలం స్వీకరించడానికే పరిమితం కాకుండా నిర్ణీత గడువులో నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు పరిష్కారం సాధ్యం కాని సందర్భాలలో అందుకు సంబంధించిన స్పష్టమైన కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు ప్రజావాణి వినతుల నమోదు శాఖలకు పంపిణీ పరిష్కార పురోగతి తుది పరిష్కారం తదితర అంశాలను జిల్లా స్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు జిల్లాలోని ప్రజలు 17 8 2026 నుంచి ప్రారంభమయ్యే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు





## ప్రపంచ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన రిశ్వితకు ఘన సన్మానం

**కామారెడ్డి, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి):-**

ప్రపంచ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇటలీలో జరిగిన పోటీల్లో రజత పతకం సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన రిశ్విత సుంచనకోటను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఘనంగా సన్మానించారు.

ఆదివారం కామారెడ్డి నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రిశ్వితను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుతూ రజత పతకం సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

రిశ్విత సాధించిన ఈ అద్భుత విజయం తెలంగాణ యువతకు, ముఖ్యంగా క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. పట్టుదల, కృషి, ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించవచ్చని రిశ్విత నిరూపించిందని పేర్కొన్నారు.

రిశ్విత భవిష్యత్తులో మరెన్నో అంతర్జాతీయ విజయాలు సాధించి దేశానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని షబ్బీర్ అలీ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఆమె క్రీడా ప్రస్థానంలో అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు.

ఈ సందర్భంగా రిశ్విత సుంచనకోట మాట్లాడుతూ, తనను సన్మానించి ప్రోత్సహించి ఆర్థిక సహాయం అందించిన షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది ప్రతిభావంతులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఐరేని సందీప్ కుమార్, సుదర్శన్, గోనె శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల స్థాయిలోనే 'ప్రజావాణి'

- **ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ**

**జన్నారం,ఆగస్ట్ 16 (వుదయం విలేఖరి)**

ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.ఇకపై ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో డిజిటలైజ్డ్ ప్రక్రియ ద్వారా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జన్నారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని అర్జీలను స్వీకరిస్తారని,ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వేగవంతమైన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు .జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

కావున మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.





## ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం

- **ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**

**జగిత్యాల ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణ గాంధీనగర్ 14వ వార్డు చెందిన సర్దార్ ఖాన్ కుటుంబ సభ్యులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆదివారం గృహప్రవేశ వేడుకలు నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కు సర్దార్ ఖాన్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు

అనంతరం జగిత్యాల రూరల్ మండలం అంతర్గం గ్రామానికి చెందిన మారంపెల్లి వినోద (వీవోఏ) నరేష్ కుటుంబ సభ్యులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆదివారం గృహప్రవేశ వేడుకలకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం ఆడపడుచు కట్నంగా చీరను కానుకగా ఇచ్చిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కు మారంపెల్లి వినోద నరేష్ ల కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు అనంతరం జగిత్యాల నియోజకవర్గం రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన మెల్ల సౌమ్య మధులకు రాయికల్ పట్టణానికి చెందిన మద్దులపల్లి లావణ్య కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆదివారం నిర్వహించిన గృహప్రవేశానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి అనంతరం ఆడపడుచులకు కట్నంగా చీరలను కానుకగా ఇచ్చిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ కు మెల్ల సోమ్య మధు మద్దుల పల్లి లావణ్య కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలే శంకర్ స్థానిక కౌన్సిలర్ బొల్లారపు గిరిధర్ కౌన్సిలర్లు నాయకులు గ్రామ సర్పంచ్ మాజీ సర్పంచులు ఉప సర్పంచ్ లు ఎంపీటీసీలు సీనియర్ నాయకులు గ్రామ నాయకులు మాజీ సర్పంచులు ఉప సర్పంచ్ లు ఎంపీటీసీలు మండల పట్టణ నాయకులు సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఫోక్సో కేసు లో విచారణను వేగవంతం చేయండి

- **సీపీ - సాయి చైతన్య**

**నిజామాబాద్, ఆగస్ట్ 16;**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన పోక్సో కేసులపై సీపీ సాయిచైతన్యప్రత్యేకంగా సమీక్షించారు. సీపీ కార్యాలయంలో ఆదివారం పోలీసు ఉన్నతాధికారులతోజిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చిన్నారులపై లైంగిక దాడులు, లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులను ఒక్కొక్కటిగా సీపీ పరిశీలించారు. ఆయా కేసుల్లో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, నిందితుల గుర్తింపు, అరెస్టులు, సేకరించిన ఆధారాలు, సాక్షుల వివరాలు, బాధిత చిన్నారుల వాంగ్మూలాలు, కేసుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కేసులో దర్యాప్తు ఏ దశలో ఉందనే విషయాన్ని క్షుణ్ణంగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించారు.నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని.. బాధిత చిన్నారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని సీపీ అధికారులతో పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో చిన్నారుల భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాధితుల పట్ల సున్నితమైన వైఖరితో వ్యవహరించాలన్నారు. కేసుల దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణకు ప్రాధాన్యత



ఇవ్వాలని, అవసరమైన ఎఫ్ఎస్ఎల్ పరీక్షలను త్వరితగతిన పూర్తి చేయించి నివేదికలు పొందాలని ఆదేశించారు. అదేవిధంగా బాధితులు, నిందితులకు సంబంధించిన మెడికల్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు.కేసుల్లో లభించిన సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలు, ఇతర సాంకేతిక ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించి, వాటిని దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సాయిచైతన్య సూచించారు. సాక్షుల వాంగ్మూలాలు, ఇతర కీలక ఆధారాలను పకడ్బందీగా నమోదు చేసి కేసులు కోర్టులో బలంగా నిలిచేలా దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. డీసీపీ (అడ్మిన్) శుభంప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేషం, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల సాధనకు టీయూడబ్ల్యూజే నిరంతర కృషి



- **నివేశన స్థలాల కోసం త్వరలో ప్రభుత్వంపై ఒత్తిడి**
- **అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డును మంజూరు చేయాలి**

**జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా**

**చందుర్తి ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**

జర్నలిస్టుల హక్కుల సాధనతో పాటు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయించే వరకు ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా అన్నారు. ఆదివారం చందుర్తిలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని లాయక్ పాషా పేర్కొన్నారు. సమాజం కోసం నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం కూడా ప్రాధాన్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం సాధించే వరకు టీయూడబ్ల్యూజే పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా యూనియన్‌ను మరింత బలోపేతం చేసి జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రత కోసం టీయూడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చందుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లింగాల తిరుమల్, వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, సభ్యులు రహీం , సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అర్హతలకు సమాధి.. సిఫార్సులకే 'సేవా' పట్టాభిషేకం!

- గద్వాలలో 'ఉత్తమ' పురస్కారాల కుంభకోణం.. నడిగడ్డ వ్యాప్తంగా నిరసన జ్వాలలు!
- నిజమైన త్యాగధనులకు మొండిచేయి.. పొలిటికల్ పవర్, పైరవీలకే పీఠం!
- వివాదాస్పద అధికారుల కాళ్ల వద్దకే అవార్డులు.. ఇదేనా ప్రజాసేవకు ఇచ్చే గౌరవం?



గద్వాల ఆగస్టు 16 (వుదయం బ్యూరో)

స్వాతంత్ర్య దినోత్సవ వేదిక సాక్షిగా జోగులాంబ గద్వాల జిల్లాలో 'ఉత్తమ సేవా పురస్కారాల' పేరిట సాగిన అవార్డుల పంపిణీ తీవ్ర దుమారాన్ని రేపుతోంది. ప్రజాసేవనే ఊపిరిగా భావించి అహరహం శ్రమిస్తున్న క్షేత్రస్థాయి ఉద్యోగులను, నిస్వార్థంగా సమాజానికి సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలను, కళాకారులను పక్కనబెట్టి.. కేవలం పొలిటికల్ రికమండేషన్లు, రాజకీయ ప్రాపకం ఉన్నవారికే 'సేవా' కిరీటాలు తొడగడంపై ప్రజానీకం మండిపడుతోంది. ప్రతిభకు పాతర.. పైరవీలకే పట్టం! సేవకు ఇచ్చే గౌరవాన్ని రాజకీయ సిఫార్సులకు బలిచ్చారనే విమర్శలు జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, తీవ్ర విమర్శలు, ఫిర్యాదులు ఎదుర్కొన్న కొందరు అధికారుల పేర్లు సైతం ఈ పురస్కారాల జాబితాలో ప్రత్యక్షం కావడం యంత్రాంగం నిష్పాక్షికతను నట్టేట ముంచేసింది. అర్హత, నిజాయితీలను కొలమానంగా తీసుకోకుండా.. కేవలం సిఫార్సు లేఖల ఆధారంగానే జాబితాను తయారు చేశారనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిజమైన సేవకుల గుండెకోత! నడిగడ్డ నేలలో విద్య, సాహిత్యం, పర్యావరణ పరిరక్షణ, రక్తదానం వంటి రంగాల్లో ఏళ్ల తరబడి స్వార్థం లేకుండా, సొంత నిధులను వెచ్చించి సేవలందిస్తున్న మహనీయు లెందరో ఉన్నారు. వారి త్యాగాలను, శ్రమను కనీసం గుర్తించకపోగా.. ప్రజాప్రతినిధుల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసే వారికే అవార్డులు కట్టబెట్టడం నిజమైన సేవకులను తీవ్రంగా అవమానించడమేనన్న ఆవేదన వ్యక్తమవుతోంది. బాధ్యులెవరు? జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాలి! ప్రభుత్వం ఇచ్చే ఉత్తమ సేవా పురస్కారాల విశ్వసనీయతను బజార్న పడేసిన ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పష్టత ఇవ్వాలి. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి ఈ ఎంపికలు జరిపారో, ఏ ప్రమాణాల ఆధారంగా జాబితా రూపొందించారో ప్రజలకు బహిర్గతం చేయాలి. ఇప్పటికైనా పొలిటికల్ రికమండేషన్ల సంస్కృతికి స్వస్తి పలికి, పారదర్శకమైన కమిటీ ద్వారా ప్రజల నుంచి నేరుగా నామినేషన్లు స్వీకరించి అర్హులైన నిజమైన సేవకులకే పురస్కారాలు దక్కేలా చూడాలని నడిగడ్డ ప్రజలు గంభీరంగా హెచ్చరిస్తున్నారు.



## నిరుపేదలకు అండగా నిలుస్తున్న జయ కృష్ణకు విశ్వకర్మ సంఘం ఘన సన్మానం

అయిజ, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)

సమాజ సేవలో ముందుంటూ, వివిధ ప్రాంతాల నుంచి గాంధీ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు అండగా నిలుస్తున్న జయకృష్ణను జోగులాంబ గద్వాల జిల్లా విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గాంధీ ఆసుపత్రిలో డిసిహెచ్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జయకృష్ణ, దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందిస్తున్నారు. నిరుపేద రోగులకు వైద్య సేవలు అందేలా సంబంధిత విభాగాలతో సమన్వయం చేస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం కల్పిస్తున్న ఆయన సేవలు అభినందనీయమని విశ్వకర్మ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. "వైద్యం కేవలం వృత్తి కాదు.. మానవ సేవ" అనే స్ఫూర్తితో జయకృష్ణ చేస్తున్న సేవలు ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నాయని వారు కొనియాడారు. ఎలాంటి స్వార్థం లేకుండా ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుతున్న ఆయన సేవలను గుర్తించి కృతజ్ఞతాపూర్వకంగా సన్మానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో తమ బాధ్యతను గుర్తించి నిరుపేదలకు సహాయం చేస్తున్న సేవాభావం కలిగిన వ్యక్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జయకృష్ణ సేవలు మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. నిరుపేదల పట్ల మానవత్వం, వైద్య సేవల పట్ల అంకితభావం, సమాజం పట్ల బాధ్యతతో పనిచేస్తున్న జయకృష్ణను సన్మానించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని విశ్వకర్మ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సూర్య ప్రకాష్, ఐజ పట్టణ అధ్యక్షులు పర్దేపురం వీరయ్య, ఐజ మండల కోశాధికారి జ్ఞానేంద్ర చారి, గౌరవ అధ్యక్షులు సుధాకర్, రాఘవేంద్ర, సింహాద్రి, చిన్న వీరయ్య, గోవర్ధన్, వీరన్న, సర్వేశ్వర చారి మొదలగు వారు పాల్గొన్నారు.

## తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజయవంతం

- జాతీయ స్థాయిలో రాణించేలా విద్యార్థులు సిద్ధం కావాలి
- డీవైఎస్ఓ సీతారాములు నాయక్

నాగర్ కర్నూల్, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి):

జిల్లా కేంద్రంలోని గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ విజయవంతంగా జరిగింది. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు పంచెస్, కిక్స్, బ్లాక్స్, స్టాండ్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి బెల్టులు, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన సేవలు, క్రీడల శాఖ జిల్లా అధికారి సీతారాములు నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల స్వీయరక్షణ నైపుణ్యాలు పెరుగుతాయని, అదే సమయంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటేందుకు మార్గం సుగమమవుతుందని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటా ద్వారా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తెప్ప శ్రీను, జనరల్ సెక్రటరీ రవికుమార్, ట్రెజరర్ మాస్టర్ స్వాతి, విఘ్నేష్, మణికంఠ, సిరిన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎస్ డి పి ఐ నారాయణపేట జిల్లా నూతన కమిటీ ఎంపిక

నారాయణపేట ఆగస్టు16 (వుదయం ప్రతినిధి)



సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ( ఎస్ డి పి ఐ) నారాయణపేట జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. స్థానిక ఎం. కె గార్డెన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించే దిశగా మరో ముఖ్యమైన అడుగు వేసేందుకు ఈ కమిటీ ఏర్పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఫయాజ్ అలీ, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ యూనస్ ఖాద్రీ, జనరల్ సెక్రెటరీగా ఉట్కూర్ అబ్దుల్ ఖాలిఖ్ తాడ్ పత్రి , ఆర్గనైజర్ గా మొహమ్మద్ ఆసిఫ్ , కార్యదర్శిగా ఉట్కూర్ మొహమ్మద్ నవాజ్ ఉల్ హక్, కోశాధికారిగా ఉట్కూర్ అబ్దుల్ ఖాలిఖ్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులుగా మొహమ్మద్ షహాబ్ ఉద్దీన్ బాబర్, మొహమ్మద్ ముక్రమ్ ఉట్కూర్, ఫయాజ్ ఖురేషీ, అబ్దుల్ జబ్బార్ ఖురేషీ లను ఎంపిక చేశారు. నారాయణపేట్ జిల్లా కమిటీ ఏర్పాటు కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ మన్సూర్ షా, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అఫాన్ అల్‌కోమాన్, మౌలానా అబ్దుస్సమద్, రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ జమీల్ ఉద్దీన్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు షేక్ సాజిద్ అడ్వకేట్ ,మొహమ్మద్ ఆబిద్ సమక్షంలో నిర్వహించారు. తెలంగాణలో ఎస్ డి పి ఐ సంస్థాగత నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజాక్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించేందుకు మరో ముఖ్యమైన ముందడుగు వేయనున్నట్లు వారు తెలిపారు. ఇందుకుగాను ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు.

## రేవంత్‌రెడ్డి రాష్ట్రానికే పెద్ద చీడ.. పీడ: చింత ప్రభాకర్

- సంగారెడ్డి పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకపోవడం అహంకారానికి నిదర్శనం

సంగారెడ్డివుదయం :

ముఖ్యమంత్రి రవంత్‌రెడ్డి సంగారెడ్డి పర్యటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి హోదాలో అధికారిక కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సమావేశంలా నిర్వహించారని, స్థానిక ఎమ్మెల్యేగా తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడం అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు.తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన చింత ప్రభాకర్.. తనను అవమానించడం కాదని, తనను ఎన్నుకున్న సంగారెడ్డి ప్రజలను అవమానించినట్లేనని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంగారెడ్డికి కొత్తగా ఒక్క ప్రాజెక్టు లేదా పథకం కూడా తీసుకురాలేదని విమర్శించారు.

**ఖాళీ చేతులతో వచ్చి.. ఖాళీ మాటలతో వెళ్లారు**

కేసీఆర్ హయాంలో మంజూరైన ఎస్‌డీఎఫ్, ఇతర అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులను రద్దు చేశారని చింత ప్రభాకర్ ఆరోపించారు. సంగారెడ్డి, సదాశివపేటతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగాల్సిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం ఆటంకాలు కల్పించిందన్నారు. సీఎం పర్యటనలో సంగారెడ్డి అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన హామీలు, నిధుల కేటాయింపులు లేకపోవడం బాధాకరమన్నారు. జాతీయ జెండా సాక్షిగా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై మాట్లాడాల్సిన ముఖ్యమంత్రి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు.

**యువత ముందస్తు అరెస్టులపై ఆగ్రహం**

సీఎం పర్యటన సందర్భంగా విద్యార్థి, యువజన నాయకులను ముందస్తు అరెస్టుల పేరుతో అదుపులోకి తీసుకోవడాన్ని చింత ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. శ్రవణ్‌రెడ్డితో పాటు పలువురు యువ నాయకులను సీఎం పర్యటన ముగిసే వరకు నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.



**వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే రాజకీయ విమర్శలు**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చెప్పుకోవడానికి ఒక్క మంచి పని లేదని చింత ప్రభాకర్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రాజకీయ విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకుని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

**రైతులకు అన్యాయం చేయొద్దు**

భూముల వ్యవహారాల్లో రైతులకు అన్యాయం జరుగుతోందని చింత ప్రభాకర్ ఆరోపించారు. TGIIC పేరుతో వందల ఎకరాల భూముల సేకరణలో రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**ప్రజలు అన్నీ గమనిస్తున్నారు**

ప్రభుత్వాలు, పదవులు శాశ్వతం కావని చింత ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పథకాలపై సీఎం, మంత్రుల ఫొటోలు పెట్టుకోవడం ద్వారా శాశ్వత గుర్తింపు వస్తుందని భావించడం సరికాదన్నారు. ప్రజలు ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారని చింత ప్రభాకర్ పేర్కొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం - కాపాడిన పోలీసులు

- 112 కు సమాచారంతో సకాలంలో స్పందన

నాగర్ కర్నూల్, ఆగస్టు 16, (వుదయం ప్రతినిధి):

వ్యక్తిగత, ఆర్థిక సమస్యలతో విషం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు.112 డయల్‌కు అందిన సమాచారం మేరకు నాగర్‌కర్నూల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుళ్లు బాలస్వామి, కృష్ణ బాధితుడిని గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సకాలంలో చికిత్స అందించడంతో అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.పోలీసుల తక్షణ స్పందనతో విలువైన ప్రాణం కాపాడబడటంపై పలువురు అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 112 కు సమాచారం అందిస్తే పోలీసులు వెంటనే స్పందించి సహాయం అందిస్తారని ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.





## దుబ్బాక సీరియల్ హత్యల గుట్టు రట్టు చేసిన సిద్దిపేట పోలీసులు

- రూ. 10 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం
- నిందితురాలికి రిమాండ్, బాలుడికి జువైనల్ హోమ్

సిద్దిపేట, ఆగస్టు 16 (వుదయం బ్యూరో)

దుబ్బాక మండల పరిధిలో తీవ్ర కలకలం రేపిన సీరియల్ హత్యల గుట్టును సిద్దిపేట పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కేవలం ఆభరణాలు, డబ్బు సంపాదించాలనే దురాశతో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని దారుణంగా హత్యలకు పాల్పడుతున్న కంటికి రెప్పలా ఉండాల్సిన తల్లి, కొడుకుల ముఠాను అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితురాలు చాకలి రజిత (38)ను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించగా, ఆమె కుమారుడైన బాలుడిని బాలల పరిశీలనా గృహానికి పంపించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ దారుణ ఉదంతం వివరాల్లోకి వెళ్తే... ఈ నెల 8వ తేదీన రామక్కపేట గ్రామ శివారులో పాక్షికంగా కాలిన ఒక గుర్తుతెలియని మహిళ శవం లభ్యమవ్వడంతో దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో ఆ శవం భూంపల్లి గ్రామానికి చెందిన అతికం విజయ (45)గా తేలింది. స్థానిక పోలీసులతో పాటు ప్రత్యేక నేర పరిశోధన బృందాలు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు. ఆగస్టు 8న విజయను తమ కిరాణం షాప్‌లోకి పిలిచి గొంతు నులిమి హత్య చేసిన నిందితులు, అదే రోజు రాత్రి శవాన్ని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి రామక్కపేట శివారులో పెట్రోల్ పోసి తగలబెట్టారు. విచారణలో నిందితులు గతంలో మే 28న కుంట రేఖ అనే మహిళను కూడా ఇదే రీతిలో చంపి అచ్చుమయిపల్లి అడవిలో కాల్చివేసినట్లు, అలాగే జూన్ 2025లో భూంపల్లిలో ఉదయం నడకకు వెళ్తున్న అన్నపూర్ణ అనే మహిళపై దాడి చేసి 5 తులాల బంగారు గొలుసు దోచుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 5.61 తులాల బంగారు ఆభరణాలు, 53 తులాల వెండి, రూ. 1,03,000 నగదు, రెండు చరవాణులు మరియు ఒక ద్విచక్రవాహనం (మొత్తం విలువ సుమారు రూ. 10 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. వారం వ్యవధిలోనే ఈ సంక్లిష్టమైన కేసులతో పాటు గత నేరాలను ఛేదించిన సిద్దిపేట సహాయ పోలీస్ కమిషనర్ రవీందర్ రెడ్డి, దుబ్బాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఉప తనిఖీ అధికారులు కీర్తిరాజు, రాజశేఖర్, సతీష్, సైఫ్ అలీ, ప్రత్యేక విభాగాల అధికారులను పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ పరిసరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, 'సిద్దిపేట సురక్ష నేత్ర'లో భాగంగా ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ సూచించారు.



## రేషన్ కార్డు కేవలం కాగితం కాదు

- పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవం
- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 15:వు దయం:

స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని.. పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.

**ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..**

ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, అయితే గతంలో పేదల కోసం వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

**రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్**

రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం తెలిపారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. రైతు భరోసా మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి.. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి సంబంధించి రూ.90 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని, రెండున్నరేళ్లలో రైతుల కోసం మొత్తం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని సీఎం పేర్కొన్నారు.

**ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు**

గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా తమ ప్రభుత్వం రెండేళ్లలో సుమారు 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి పెన్షన్లు అందిస్తామని స్పష్టం చేశారు.

**72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**

గత రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని సీఎం తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.నిరుద్యోగ యువత మాయమాటలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్నామని చెప్పారు.జగ్గారెడ్డి పోటీపై సీఎం కీలక వ్యాఖ్యలుసంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అన్నది ఆయన ఒక్కరి నిర్ణయం కాదని.. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.మహిళా సాధికారతలో భాగంగా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలు చేపట్టామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు.సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

**1.06 కోట్ల రేషన్ కార్డులు: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 15 తెలంగాణ చరిత్రలో ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు అందించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.రాష్ట్రంలో సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 1.06 కోట్ల రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు జయప్రకాశ్ రెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండలానికే ప్రజావాణి

- ఇక కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సిన పనిలేదు!
- ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు.. అన్ని శాఖల అధికారులు హాజరు
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 16 (వుదయం కరస్పాండెంట్)



జిల్లా: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇక మండల స్థాయికీ విస్తరించింది. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించనున్నారు. దీంతో చిన్నచిన్న సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా, మండల కేంద్రంలోనే సంబంధిత అధికారులను కలిసి తమ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం కలగనుంది. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల స్థాయి ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు.అన్ని శాఖల అధికారులు ఒకేచోటమండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరించ నున్నారు. సంబంధిత మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. తమ శాఖకు సంబంధించిన సమస్యలను అక్కడికక్కడే పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు నిర్దేశిత గడువులో పరిష్కరించేలా అధికారులు బాధ్యత తీసుకోనున్నారు. ఇక జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదుప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిం చింది. చిన్నచిన్న సమస్యల కోసం ప్రజలు కలెక్టరేట్ వరకు వచ్చి సమయం, ధనం వృథా చేసుకోకుండా తమ మండల కేంద్రంలోనే సంబంధిత అధికారులను కలిసే అవకాశం కల్పించింది. అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని నిర్లక్ష్యం చేయకుండా పరిశీలించి, సంబంధిత సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగం మరింత చేరువ కావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలతో ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగే ప్రజావాణికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు.

## తాడూరు శివారులో మహిళ దారుణ హత్య

నాగర్ కర్నూల్, ఆగస్టు 16, (వుదయం ప్రతినిధి):



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు శివారులో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది.మృతురాలిని తెలకపల్లి మండలం రాకొండ గ్రామానికి చెందిన బంగారమ్మ (43)గా పోలీసులు గుర్తించారు.అప్పు డబ్బుల వ్యవహారంలో బంగారమ్మకు, తాడూరుకు చెందిన భీమయ్యకు మధ్య శుక్రవారం సాయంత్రం వివాదం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో భీమయ్య బొలెరో వాహనంతో బంగారమ్మను ఢీకొట్టి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు దారితీసిన అసలు కారణాలు, అప్పు డబ్బుల వ్యవహారంలో జరిగిన వివాదం తదితర అంశాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.



## వృత్తి, ప్రవృత్రి లో యువకుడు ఆదర్శం

అచ్చంపేట,ఆగస్టు16 (వుదయం ప్రతినిధి)

సుమన్ అనే యువకులు తన వృత్తి ఉప్పునుంతల మండలం పెనిమిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ గా విధులను నిర్వహిస్తూ మరో వైపు ఉచితంగా పాములను పట్టి ఇటు సమాజానికి అటు ప్రకృతికి సేవ చేస్తున్నందుకు గాను స్వాతంత్ర దినోత్సవం వేడుకల సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీ హేమంతా కేశవ పాటిల్, ఎస్పీ , ఎంపీ మల్లు రవి, చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం జరిగింది.

## యువత భవిష్యత్ కు భరోసా

- కల్వకుర్తిలో SI , కానిస్టేబుల్ ఉచిత శిక్షణ 2వ బ్యాచ్‌కు శ్రీకారం

కల్వకుర్తి ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)


గ్రామీణ ప్రాంత యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలోకల్వకుర్తి పట్టణంలోని MRO కార్యాలయం ఎదురుగా ఓల్డ్ కృష్ణవేణి జూనియర్ కళాశాలలో SI ,కానిస్టేబుల్ ఉచిత శిక్షణ 2వ బ్యాచ్‌ను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, TASK COO సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక విద్యార్థి జీవితంలో ఉద్యోగం ఎంత ముఖ్యమో ప్రతి యువత గుర్తించాలని అన్నారు. ఉద్యోగం సాధించడం అంటే కేవలం నెలవారీ జీతం పొందడం మాత్రమే కాదని, అది ఒక యువకుడి జీవితానికి స్థిరత్వం, కుటుంబానికి ఆర్థిక భరోసా, తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం తీసుకువచ్చే గొప్ప అవకాశం అని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉద్యోగాల భర్తీకి అవకాశం కల్పిస్తూ SI, కానిస్టేబుల్ తదితర విభాగాల్లో మొత్తం 7 వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయడం పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఇది గొప్ప అవకాశమని సూచించారుప్రభుత్వం ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చిన ఈ సమయంలో యువత సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి శారీరక దారుఢ్యంతో పాటు రాత పరీక్షకు కూడా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. ఆరు మండలాల్లో మొదటి బ్యాచ్ విజయవంతంగా పూర్తి చేసుకున్నామని తెలిపారు. మొదటి బ్యాచ్ ఇచ్చిన అనుభవం, విద్యార్థుల నుంచి వచ్చిన స్పందన ఆధారంగా ఇప్పుడు మరింత మెరుగైన ప్రణాళికతో కల్వకుర్తిలో రెండో బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు.గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ ఉన్న ప్రతి యువకుడికి సమానమైన అవకాశం లభించాలన్నదే తన లక్ష్యమని,ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారి ఏ ఒక్క విద్యార్థి కూడా తన ఉద్యోగ కలను వదులుకోకూడదని , ప్రతిభ ఉన్న యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించి వారిని ఉద్యోగ సాధన దిశగా నడిపించాలనే తన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ బోజి రెడ్డి,అధ్యాపకులు మోహన్ లాల్, ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్ బాబా, గణేష్,శేఖర్,శ్రీపతి, శ్రీను లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఒక కిలోపు 3బొమ్మలు పెడితే 5 కిలోలకు ఎన్ని బొమ్మలు పెట్టాలి

- **కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ**

**నారాయణపేట టౌన్ ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**



ప్రజలకు ఇచ్చే రేషన్ కార్డులపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయా లు చేస్తున్నదని కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్రమోడీ ఫోటో పెట్టక పోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ ప్రభుత్వం సొమ్మొకడిది సోకొక్కడిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రజలకు రేషన్ ద్వారా ఒక్క కిలో బియ్యం మాత్రమే ఇస్తున్నదని అన్నారు.కానీ ఒక్క కిలో బియ్యం ఇస్తూ రేషన్ కార్డులపై సి ఎం, డిప్యూటీసీఎం,మంత్రి ముగ్గురి ఫోటోలు ముద్రించడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించా రు.కేంద్ర ప్రభుత్వం కుటుంబం లోని ప్రతి ఒక్కరికి 5 కిలోల బియ్యం ఇస్తుందని అన్నారు.అయినా రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టకుండా అంతా తామే చేస్తు న్నామని నిరాధారణీయులు చేస్తున్నదని అన్నారు.కానీ ప్రజలు చైతన్యవంతులు అయ్యారని ఎవరు ఏమి చేస్తున్నారో గు ర్తిస్తున్నారని సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఐజ, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**

ఐజ మండలం సంకాపురం గ్రామంలో రామకృష్ణ మఠం, హైదరాబాద్ వారి సౌజన్యంతో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.శిబిరంలో సుమారు 200 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వ హించారు. వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి తగిన సూచనలు అందించారు. వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.గ్రామీణ ప్రాంత ప్రజల కు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిబిర నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రాజీవ్ జాగీ ర్దార్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు వెంకట్రాములు, కృష్ణ, సత్యనారాయణ, వీరభద్రుడు, దామోదర, గోపాల్, తిమ్మ ప్ప, ఈశ్వరన్న తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం సభ ప్రజలకు తీవ్ర నిరాశ



- **ప్రభుత్వ కార్యక్రమాన్ని కాంగ్రెస్ సభగా మార్చారు.. మాటలు తప్ప నిధులు ఎక్కడ?**

**సంగారెడ్డివుదయం :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించిన సభ ప్రజలకు తీవ్ర నిరాశను మిగిల్చిం దని బీఆర్ఎస్ నాయకులు విమర్శిం చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు సీఎం పర్యటనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
ప్రభుత్వ అధికారిక కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ సభగా మార్చారని, స్థానిక ఎమ్మెల్యేకు కనీస సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం నిర్వహించడం అహంకారానికి నిద ర్శనమని ఆరోపించారు. ప్రజా సమస్య లు, జిల్లా అభివృద్ధిపై కీలక ప్రకటనలు వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు.సంగారెడ్డి మున్సి పాలిటీలోని ప్రతి వార్డుకు రూ.8 కోట్ల చొప్పున నిధులు ప్రకటిస్తారని ప్రజలు ఆశించారని, అయితే ముఖ్యమంత్రి ఆ విషయంపై ఎలాంటి ప్రకటన చేయకపో వడంపై ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న SDF, TUFIDC, మార్కెట్‌యార్డు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు."సీఎం సంగారెడ్డికి వస్తున్నారంటే జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొత్త అభివృద్ధి పనులు, నిధులు, కీలక ప్రాజెక్టులపై ప్రకటనలు వస్తాయని ఎదురుచూశా రు. కానీ సంగారెడ్డి నియోజకవర్గానికి గానీ, జిల్లాకు గానీ చెప్పుకోదగ్గ కొత్త నిధులు ప్రకటించలేదు" అని బీఆర్ఎ స్ నేతలు అన్నారు."కొండంత ఆశ పెట్టుకుంటే గోరంత కూడా ఇవ్వలేదు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా మాటలతో కోటలు కట్టారు" అంటూ సీఎం పర్యట నను ఎద్దేవా చేశారు.సంగారెడ్డి జిల్లాలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వైద్యం, విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి భారీగా నిధులు అవసరమని తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులకు నిధులు కేటా యించాల్సిన అవసరం ఉందన్నారు.
"పొగడ్తలతో పొట్ట నిండదు..మాటలతో అభివృద్ధి జరగదు. మాట ఇచ్చి మరిచి పోవడం సులభం..కానీ ప్రజలు మాత్రం మరిచిపోరు" అని వ్యాఖ్యానించారు.
ప్రభుత్వ అధికారిక కార్యక్రమాన్ని రాజకీయ ప్రచార సభగా మార్చడం సరికాదని, రాజకీయ విమర్శలను పక్కనపెట్టి సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి నిధులు, ప్రాజెక్టులు ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.
"సంగారెడ్డి ప్రజలకు మాటలు కాదు.. చేతల్లో అభివృద్ధి కావాలి. ప్రకటనలు కాదు.. నిధులు కావాలి. హామీలు కాదు.. అమలు కావాలి" అని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో ఎస్కే రషీద్, మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, విఠల్, చక్రపాణి, కౌ న్సిలర్ జాఫర్, కాసిని శ్రీకాంత్‌తో పాటు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరు లు పాల్గొన్నారు.

## సిద్దిపేట పారిశుద్ధ్యంపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**



పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆదివారం ఉదయం సైకిల్‌పై పట్టణంలోని ప్రధాన రహ దారుల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థి తులను స్వయంగా పరిశీలించారు. పొన్నాల చౌరస్తా నుంచి బీజీఆర్ చౌరస్తా, కోమటి చెరువు, రూరల్ పోలీస్ స్టేషన్, నాగదేవత గుడి, ఎల్లమ్మ గుడి, వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా, మోడ్రన్ బస్టాండ్, రంగధాంపల్లి చౌరస్తా మీదుగా పొన్నాల వరకు రింగ్‌రోడ్డు వెంట పర్యటించారు.రింగ్‌రోడ్డు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొల గింపజేసి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిం చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుతూ మున్సిపల్ సిబ్బం దికి సహకరించాలని కమిషనర్ మల్లి కార్జున్ కోరారు.

## ఆపదలో ఉన్న సహఉపాధ్యాయుడికి అండగా బ్రైట్ స్టార్స్ పాఠశాల ఉపాధ్యాయులు

**అయిజ, ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**



ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందు లు ఎదుర్కొంటున్న తమ పాఠశాల మాజీ సహఉపాధ్యాయుడు నర్సన్నకు బ్రైట్ స్టార్స్ పాఠశాల ఉపాధ్యాయు లు, సిబ్బంది మానవతా దృక్పథం తో ఆర్థిక సహాయం అందించారు. బ్రైట్ స్టార్స్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన నర్సన్న ప్రస్తుతం ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయం పాఠశాల సిబ్బంది దృష్టికి వచ్చింది. ఆయన పరిస్థితిని తెలుసుకున్న ఉపాధ్యాయులు, సిబ్బంది స్పందించి తమ వంతు సహాయం చేయాలని నిర్ణయించారు.దీనిలో భాగంగా ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కలిసి రూ.12,000 నగదును సేకరించారు. అనంతరం నర్సన్న నివాసానికి వెళ్లిన బ్రైట్ స్టార్స్ పాఠశాల సిబ్బంది ఆయనకు నగదు సహాయాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నా రు. ఈ సందర్భంగా నర్సన్న సహాయం అందించిన పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తోటి మనిషికి అండగా నిలవడం, ముఖ్యంగా తమతో కలిసి పనిచేసిన సహఉపాధ్యాయుడికి ఆపన్నహస్తం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.బ్రైట్ స్టార్స్ పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టిన ఈ మానవతా కార్యక్రమం కరుణ, బాధ్యత, సంఘీభావానికి ప్రతీకగా నిలిచింది.

## దిగ్గజాల సమక్షంలో మహేంద్ర–సహస్రల కళ్యాణం

- **అయిజలో శుభాకాంక్షల వెల్లువ!**

**అయిజ ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి)**



అయిజ పట్టణంలో సీనియర్ రిపోర్టర్ మహేంద్ర, సహస్రల వివాహ మహో త్సవం అత్యంత వైభవంగా, రాజకీయ రంగు సంతరించుకుని ఘనంగా జరిగింది. స్థానిక శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శనివారం కన్నులపండువగా జరిగిన ఈ వేడుకకు నియోజకవర్గ స్థాయి అగ్రనేతలు, ప్రముఖులు తరలివ చ్చి నూతన దంపతులను ఆశీర్వదించా రు. ఈ వేడుకకు అలంపూర్ శాసనసభ్యు లు శ్రీ విజయుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాస్ హనుమంతు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అయిజ మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ మాల పద్మ నాగరాజు ప్ర త్యేక ఆహ్వానం మేరకు విచ్చేసిన నేతలు, నూతన వధూవరులపై తలంబ్రాలు వేసి నిండు నూరేళ్లు పచ్చని సంసారంతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దంప తులను దీవించారు.పోటెత్తిన అభిమా నులు, కిటకిటలాడిన కళ్యాణ మండపం రాజకీయ అగ్రనేతలు, మున్సిపల్ ప్రజా ప్రతినిధుల రాకతో శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ ప్రాంగణం పూర్తిగా కిటకిట లాడింది. ఈ కళ్యాణ వేడుకలో అయిజ మున్సిపా లిటీ వైస్ ఛైర్మన్ మాల నర్సిం హులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, శ్రేణులు, పాత్రికేయ మిత్రులు మరియు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన జోడీకి హృదయపూర్వక శుభాకాంక్షలు అందించారు.

## నేటి నాగ పంచమి వ్రత కథ

- **వివరించిన ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చైర్మన్**

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 16....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలో ని గూడూరు గ్రామ వాస్తవ్యులు ప్రముఖ సంఘ సేవకులు శ్రీ గురు పీఠం చారిటబు ల్ ట్రస్ట్ చైర్మన్ పెద్ద గోని జిన్నారం శివకు మార్ గౌడ్ నేడు 17 తారీఖున జరుపుకో బడే నాగపంచమి గురించి ఆయన ఇలా వివరించారు ఆయన మాటల్లో విందాం
పూర్వము ధనవంతురాలైన ఒక గృహిణి వుడేది ప్రతిరోజూ సర్పాలు అనేకం వచ్చి తనను కాటు వేస్తున్నట్లుగా ఆమెకు కలలు వస్తుదేవి, దానితో ఆమె భయకం పితురాలైంది. ఒక రోజున వారి కులగు రువు వారి ఇంటికి వచ్చి ఆమె దీన గాథను విన్నారు. విని 'అమ్మా ' నువ్వు గతజన్మలో పుట్టలో పాలు పోసేవారిని చూసి ఎగతాళి చేశావు, అందువలన నీకు ఈ జన్మలో ఈ జాడ్యము సంక్రమించినది అని చెప్పి నివారణకోసం నాగపంచమి నోము నోయమని, పాముల భయం తొలగి పోతుందని చెప్పెను . ఆమె అట్లాగే నోచి ఆ స్వప్నాల భయం నుండి విముక్తురా లైనది. నాగపంచమి వ్రత కథల్లో ఇది ఒకటి . ఈ కథ వెనుక ఒక సామాజిక మైన హితవు ఉన్నది ఇతరులకు ఎవ్వరికీ ఇబ్బంది కలగని విధంగా ఎవరైనా తన కుటుంబ ఆచారాన్ని తానూ పాతిస్తున్నట్ల యితే వారిని పరిహసించకూడదు.. ఎవరి విశ్వాశము వారిది. ఈ నాగపూజా వెనుక యోగాపరమైన అంతరార్ధము కుడా ఉన్నది.. మన వెన్నెముకకు అడుగుభా గములో మూలాధార చక్రమున్నది. ఆ చక్రంలో కుండలినీ శక్తి ఇమిదివున్నది ... అదే నాగదేవత, ధ్యానం to ఆ కూడలిని కదిలించి సహస్రారం దాకా తీసుకొని వెళ్లి నట్లయితే మానవుడు మహానీయుడ వుతాడు.. అదీ నాగశక్తి.
నాగపంచమి నోము పూర్వకాలంలో ఒకానొక గ్రామంలో ఒక శ్రీమంతురాలు వుండేది. ధనగర్వం గాని అహంకారం గాని లేని సుగుణవతి, విద్యావినయం గల సౌజన్యురాలు. పెద్దలపట్ల వినయ విధేయతలతోను పనివారి పట్ల కరుణ, దయ సానుబూతిగల సద్గుణ సంపన్ను రాలు. ఈ సుగునవతికి ఒక తీరని బాధ వుండేది. చెవిలో చీము కారుతుండేది. రాత్రులందు సర్పం కలలో కనబడి కాటు వేయబోతుండేది. ఇందువల్ల ఆమె మన స్సులో ఎంతో కలవరపడుతుండేది. ఎన్ని పూజలు చేయించినా ఎన్ని శాంతులు చేయించినా కలలో పాములు కనబడడం కాటు వేయడం తగ్గలేదు.

**నాగ దేవత (వనస్థలిపురం)**



ఇందుపై ఆమె తనకు కనబడిన వారం దరికీ తన బాధలు చెప్పుకుని తరుణోపా యం చెప్పమని వేడుకునేది. ఒకనాడు ఒక సన్యాసి వాళ్ళ ఊరుకు వచ్చాడు. ఆ సాధువు త్రికాలజ్ఞానుడని విని అతనివ ద్దకు వెళ్ళిన తన ఇంటికి పాదపూజకు ఆహ్వానించింది. అతిథి మర్యాదలు పాద పూజలు సమారాధన గడిచాక ఆమె తన బాధలను చెప్పి ఇందుకు గల కారణమే మై ఉంటుందని, ఇవి తొలగే మార్గామేమి తని వినయపూర్వకముగా వేడుకున్నది. అందుకా సాధు పుంగవుడు తీవ్రంగా ఆలోచించి ఇది నీకు సర్పదోశంవల్ల సంభవించింది. ఏమిచేసినా నాగేంద్రుని అనుగ్రహం నీకు సిద్ధించడం లేదంటే, దానికి గల కారణం నీ వ్యాధి, భయాందో ళనలు తోలగాలన్నదే నీ లక్షంగానే సుస్థిర భక్తితో ఆరాధించి శ్రద్ధని చూపనందువల్ల నీకీ దుస్థితి నిన్నింకా వేధిస్తుంది. నీవు గత జన్మలో నాగపూజా చేసే వారిని ఆక్షేపణ చేయడం నీవు పూజలు చేయకపోగా చే సేవారిని చెడగొట్టడం, చులకన చేయడం నీవు చేసిన మహాపరాధం. నాగేంద్రుడు దయామయుడు, తనను నమ్మినవారిని ఉద్ధరించే కరుణా సముద్రుడు కనుక నీ విషయం పట్ల విశ్వాసముంచి నాగ పంచమి నోము నోచినట్లయితే నీ కలతలు తొలగుతాయి. చెవి చక్కబడుతుందని చెప్పి ఆ వ్రత విధానము దాని నియమాల గురించి వివరించి వెళ్ళిపోయెను. ఆ సాధువు ఉపదేశించిన వ్రత విధాన క్రమ మున ఎంతో భక్తి శ్రద్ధలతో నాగపంచమి నోము నోచి ఆ వ్రత ప్రభావం వల్ల తన భయాందోళనలు తొలగి సంతోషముగా ఉంది.
ఉద్యాపన: శ్రావణ మాసంలో శుక్ల పంచ మినాడు చేయవలసిన నోము ఇది. అభ్యం గన స్నానం చేసి మాదిగా శుచిగా ఏకాగ్ర తతో ఉంది నాగేంద్రుడిని ఆరాధించాలి. నాగేంద్రుడి వెండి విగ్రహం చేయించి పాలు పానకం వడపప్పు నివేదించి తాంబూల పప్లూ పుష్పాదులు నారికేళం సమర్పించాలి. నాడు ఉపవాసం వుండాలి. నిరాహారం జాగరణ మరింత శ్రేయస్కరం అని వారు వివరించారు.

## బూచి నెల్లి పాఠశాలలో పూర్వ విద్యార్థుల కు ఘన సన్మానం

**కోహీర్ ఆగస్టు 16 (వుదయం ప్రతినిధి )**




జహీరాబాద్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూచి నెల్లిగ్రామంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పాఠశాల వి ద్యార్థులు మరియు గ్రామస్తులు కలిసి ఘనంగా నిర్వహించారు విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు చేరుకొని త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకొని పాఠశాల నుండి గ్రామంలో దేశభక్తి నినాదాలు చేస్తూ వీధి వీధిన తిరుగుతూ స్వాతంత్ర పోరాటంలో తమ ప్రాణా లను త్యాగం చేసిన అమరవీరులకు స్మరిస్తూ వారికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు తదుపరి పాఠశాలలకు చేరుకొని పాఠశాలలో ఏర్పాటుచేసిన జాతీయ జెండా ను పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ లాల్లయ్య గారు ఎగురవేయగా విద్యార్థులు జాతీ యగీతం ఆలపించారు పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశం పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ది విద్యార్థుల ఆట పాట మరి సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి తదుపరి కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నిక కాబడిన గ్రామ సర్పంచ్ శ్రీమతి సునీత శ్రీనివాసును సంస్థ తరపున బూచి నెల్లి గ్రామంలో ప్రజలకు ఉత్తమ సేవలను అందిస్తున్నందున మా సంస్థ తరపున వారికి శాలువాతో సేవా రంగ పురస్కారాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ లాలయ్య సాహ ఉపాధ్యాయులు గోపాల్ నర్సింలు సంజీవ్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

## నాయినోన్ పల్లి మైసమ్మ తల్లి దర్శనం

**అచ్చంపేట/కొల్లాపూర్, ఆగస్టు 16, వుదయం ప్రతినిధి:**

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మం డలంలోని నాయనపల్లి మైసమ్మ తల్లిని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కొల్లాపూర్ బీజేపీ ఇంచార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు శనివారం భక్తిశ్ర ద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించి పరిరక్షించాలని పి లుపునిచ్చారు. పూర్వీకులు అందించిన ఆచారాలు, పండుగలు, దేవాలయ సంప్రదాయాలు, ధార్మిక విలువలను నేటి తరానికి పరిచయం చేసి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అంద రిపైనా ఉందన్నారు.
దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాకుండా సంస్కృతి, సంప్రదా యాలకు నిలయాలుగా నిలుస్తాయని చెప్పారు. దేవాలయాల పవిత్రతను కాపాడుకోవడంతో పాటు ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.హిందూ ధర్మ పరిరక్షణకు భక్తులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు.నాయనపల్లి మైసమ్మ తల్లి ఆశీస్సులతో అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి ఇంట శాంతి, సౌభాగ్యం నెలకొనాలని



అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## ప్రజా పాలనలో మౌలిక సదుపాయలకు కృషి

- **ఎమ్మెల్యే వంశీకృష్ణ**

**అచ్చంపేటఆగస్టు16 (వుదయం ప్రతినిధి )**



మౌలిక సదుపాయాలకు కృషి చేస్తామ ని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం రాత్రి నియోజకవర్గంలోని సింగారం గ్రా మపంచాయతీ నూతన భవనము ప్రారంభోత్సవము చేశారు. గ్రామ పంచాయతీ ఆవరణము లో ఉన్నా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్ర హన్ని ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నీలం శేఖర్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి మంజుల, గుత్తేదరు బోడ నారాయణ ఉప సర్పంచ్ జరుపుల శివ నాయక్, వార్డు సభ్యులు,మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్ మాజీ ఎంపీపీ రామనాథం , దళిత సంఘాల నాయకులు ఆనంద్, శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లు, ప్రజా ప్రతినిధులు,అధికారులు, తదితరులు ,పాల్గొన్నారు.



## బిఎస్పి రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగార్జున ప్రెస్ మీట్

- **మండల సమస్యలపై నిరంతరం పోరాడుతా బిఎస్పి రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగార్జున**

**ఊర్కొండ న్యూస్ 16 వుదయం ప్రతినిధి**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం కేంద్రంలో ఈరోజు బీఎస్పీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగార్జున ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాడ తానని. రోడ్డు.విద్యా వైద్యం. ఊరుకొండ మండల కేంద్రంలో నాణ్యమైన విద్య . వైద్యం అందించాలని. ఊరుకొండ మండలంలో తండాలలో రోడ్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారని బిఎస్పి రాష్ట్ర నాయకుడు నాగార్జున తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరారు. గ్రామాలలో పోలీసు అధికారులు ప్రత్యేకంగా యువకుల పైన నిఘా పెట్టి గ్రామాలలో కౌన్సి లింగ్ నిర్వహించి చెడు మార్గాలకు పోకుండా యువతను కాపాడాలని కోరారు . ఊరుకొండ మండలంలో అన్ని గ్రామాలలో విచ్చేసి ప్రజల సమ స్యలు పరిష్కరించాలని మండల అధికా రులను ప్రెస్ మీట్ ద్వారా బిఎస్పి రాష్ట్ర నాయకుడు Dr నాగార్జున కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణ. బిజెపి సీనియర్ నాయకుడు తాడెం చిన్న. నాగేశ్వర్ పాల్గొన్నారు





## ఇంట్లోనే పిచ్చుకల గూళ్ళ అరుదైన దృశ్యం

- **మిరుదొడ్డి ధర్మారం గ్రామంలో సందడి**

**మిరుదొడ్డి, ఆగస్టు 16, వుదయం:**

ఒకప్పుడు చెట్లపై కనిపించే పిచ్చుక గూళ్ళు, పిచ్చుకలు ఇప్పుడు అరుదైపో యాయి. కానీ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మాత్రం ఓ ఇంట్లో పిచ్చుకలు గూడు కట్టుకొని నివాసం ఉంటున్నాయి. దాదాపు సంవ త్సరం క్రితం రెండు పిచ్చుకలు ఇంట్లోకి వచ్చి అందంగా గూడును ఏర్పాటు చేసు కున్నాయి. అప్పటి నుండి అవి ఇంట్లోనే ఉంటున్నాయని ఇంటి యజమానులు తెలిపారు. వాటి సంఖ్య ఇప్పుడు పదికి చేరుకోవడం విశేషం. చిన్నచిన్న పిచ్చుక లను చేతుల్లోకి తీసుకొని యజమానులు అల్లారుముద్దుగా పిచ్చుకలను చూసుకుం టున్నారు. పక్షులంటే ఇష్టం ఉండటంతో పిచ్చుకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుం డా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామ ని చెప్పారు. ఇంట్లోనే పిచ్చుకలు గూడు వేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామ న్నారు. ఈ విషయం గ్రామంలో ప్రచారం కావడంతో అటుగా వెళ్లేవారు పిచ్చుక గూళ్ళను చూసి ముచ్చటపడుతున్నారు. ప్రకృతిని కాపాడితే ప్రకృతి మన ఇంటికే వస్తుందనడానికి ఇదే నిదర్శనంగా నిలిచింది.

## భూంపల్లి డబుల్ బెడ్రూం ఇండ్లలో భయం భయం

- **మర్డర్ కేసులో ఉలిక్కిపడే నిజాలు**
- **డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో రాత్రి అయితే భయాందోళన**
- **సీసీ కెమెరాల ఏర్పాటుకు డబ్బుల జమ**
- **పోలీసులు అవగాహన కల్పించాలని విన్నపం**

**వుదయం, దుబ్బాక ప్రతినిధి**



అక్బర్ పేటభూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో వరుస హత్యల విషయం వెలుగులోకి రావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డా రు. బంగారం కోసం ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి హత్యలు చేసిన నేరస్తులు అదే గ్రామానికి చెంది నవారే కావడం స్థానికులను మరింత కలవరపెడుతోంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ కేసులో నింది తురాలు చాకలి రజిత (38), ఆమె మైనర్ కొడుకు ఉన్నారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే 2 హత్యలు చేసినట్లు, ఒకరిపై దాడి చేసి బంగారం చోరీ చేసినట్లు తేలింది. ఈ నెల 8 న భూంప ల్లికి చెందిన అతికం విజయ (45) ను హత్య చేసి రామక్కపేట శివారులో కా ల్చివేశారు. మే నెలలో డబుల్ బెడ్రూం ఇండ్లలో నివాసం ఉండే కుంట రేఖ ను మిస్సింగ్ కేసుగా నమోదైన ఆమెను ఇదే పద్ధతిలో చంపి అచ్చుమయిపల్లి అడవిలో కాల్చారు. గత సంవత్సరం జూన్ నెలలో అన్నపూర్ణ పై దాడి చేసి 5 తులాల పుస్తెల తాడును దోచుకు న్నారు. నిందితులు తగాదాలు ఉన్న వారిని, ఒంటరిగా ఉండే మహిళలను, సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్ గా ఉండేవారిని లక్ష్యంగా చేసుకునేవారు. విచారణలో మరో 4 మంది పేర్లు కూడా టార్గెట్ లిస్ట్ లో ఉన్నట్లు పోలీస్ కమిష నర్ రష్మీ పెరుమాళ్ వెల్లడించారు.

**గ్రామంలో భయాందోళన వాతావరణం**

డబుల్ బెడ్రూం కాలనీలో సుమారు 100కుటుంబాలు నివాసం ఉంటున్నా యి. ఈ ఘటన తర్వాత సాయంత్రం 7 గంటలు కాగానే ఇండ్లకు డోర్లు పెట్టు కుంటున్నారు. రోజూ మాట్లాడుకున్న రజిత పేరు వింటేనే గ్రామస్తులు భయ పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, ఒంటరి మహిళలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు తమంతట తాము డబ్బులు జమ చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చి రక్షణ కల్పించాలని కోరుతున్నారు. ఈ కేసును త్వరగా ఛేదించి మరికొం తమంది ప్రాణాలను కాపాడిన పోలీస్ బృందాలను, సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ కృతజ్ఞత లు తెలిపారు.

## మున్నూరు కాపుల అభ్యున్నతికి కృషి చేస్తా

- **జిల్లా అధ్యక్షుడు గుర్రప్పగారి పోలీస్ రాజులు**

**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 16, వుదయం:**



మున్నూరు కాపు కుల బాంధవుల అభ్యున్నతికి తనవంతుగా కృషి చేస్తా నని మున్నూరు కాపు సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గుర్రప్పగారి (పోలీస్) రాజులు అన్నారు. దుబ్బాక పట్టణంలో ని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పోలీస్ రాజును సంఘ సభ్యులు ఘనంగా శాలువా కప్పి సన్మానించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమిష్టిగా ఉంటే ప్రతి మున్నూరు కాపు సభ్యుడు ఆర్థి కంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగవచ్చని అన్నారు. ప్రతి గ్రామంలోని మున్నూరు కాపు సంఘ సభ్యులను కలిసి ఏకతాటిపైకి తీసుకువచ్చి అన్ని రంగాల్లో మున్నూరు కాపులు ముందుండేలా కృషి చేస్తానని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక మున్నూరు కాపు సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## డయాబెటిస్ ఉన్నవారు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు ఇవే..



మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలంటే కేవలం ఏం తింటున్నామనేదే కాదు, ఎప్పుడు తింటున్నామన్నది కూడా అంతే ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం చేసే సమయం రక్తంలో చక్కెర స్థాయిపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. శరీరం సహజ జీవ గడియారం (సర్కేడియన్ రిథమ్) ప్రకారం పనిచేస్తుంది. దానికి అనుగుణంగా భోజన సమయాలను పాటిస్తే భోజనం తర్వాత చక్కెర ఒక్కసారిగా పెరగకుండా ఉంటుందని, దీర్ఘకాలికంగా హెచ్‌బీఏ1సీ స్థాయిలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. మధుమేహం నియంత్రణలో లేకపోతే గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, నరాలు దెబ్బతినడం, కంటి చూపు దెబ్బతినడం వంటి తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే సమతుల ఆహారంతోపాటు సరైన భోజన సమయాలను పాటించడం కూడా చికిత్సలో కీలక భాగంగా పరిగణిస్తారు. పీచుపదార్థాలు అధికంగా ఉండే తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు రక్తంలో చక్కెర నెమ్మదిగా శోషణకు గురయ్యేలా చేస్తాయి. అలాగే గింజలు, నట్స్, అవకాడో వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండాలంటే ప్రతిరోజూ ఒకే సమయానికి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలి. భోజనాల మధ్య ఎక్కువ విరామం ఉంటే తీవ్రమైన ఆకలి వేయడంతో ఒకేసారి ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది. దీనివల్ల రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరుగుతుంది. అదే తరహా తినడం వల్ల కూడా గ్లూకోజ్ స్థాయిలు నిరంతరం ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంటుంది. మధుమేహం ఉన్న వారు రోజుకు మూడు ప్రధాన భోజనాలను నాలుగు నుంచి ఐదు గంటల వ్యవధిలో తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. రెండు భోజనాల మధ్య ఎక్కువ గ్యాప్ ఉంటే ఆరోగ్యకరమైన చిరుతిండిని తీసుకోవచ్చు. ముఖ్యంగా రక్తంలో చక్కెరను తగ్గించే మందులు లేదా ఇన్సులిన్ తీసుకునేవారికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఉదయం నిద్రలేచిన గంటలోపు అల్పాహారం తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల జీవక్రియలు చురుకుగా ప్రారంభమవుతాయి. అలాగే ఇన్సులిన్ నిరోధకత తగ్గేందుకు సహాయపడుతుంది. అల్పాహారాన్ని ఆలస్యం చేసే కొద్దీ ఉపవాస రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మధ్యాహ్న భోజనాన్ని సరైన సమయంలో తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది. మధ్యాహ్నం అలసట తగ్గడంతోపాటు సాయంత్రం అతిగా తినే అలవాటు కూడా తగ్గుతుంది. రాత్రి భోజనాన్ని తేలికగా, నిద్రపోయే సమయానికి కనీసం రెండు నుంచి మూడు గంటల ముందే ముగించడం వల్ల రాత్రిపూట రక్తంలో చక్కెర నియంత్రణ మెరుగుపడుతుంది. భోజనం చేసిన వెంటనే కూర్చోవడం లేదా పడుకోవడం కంటే 10 నుంచి 15 నిమిషాల పాటు తేలికగా నడవడం మంచిది. ఇలా చేయడం వల్ల భోజనం తర్వాత చక్కెర ఒక్కసారిగా పెరగకుండా నియంత్రించవచ్చు. అలాగే భోజనంలో ముందుగా కూరగాయలు, ప్రోటీన్ ఆహారం తీసుకుని చివర్లో కార్బోహైడ్రేట్లు తినడం వల్ల గ్లూకోజ్ శోషణ నెమ్మదిగా జరిగి రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఇన్సులిన్ లేదా రక్తంలో చక్కెరను తగ్గించే మందులు వాడుతున్నవారు తప్పనిసరిగా మందుల సమయాలకు అనుగుణంగా భోజనం చేయాలి. లేకపోతే రక్తంలో చక్కెర ప్రమాదకరంగా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, జీవనశైలి, రక్తంలో చక్కెర స్పందన భిన్నంగా ఉంటాయి కనుక వైద్యులు లేదా డైటీషియన్ సూచనల మేరకు వ్యక్తిగత ఆహార ప్రణాళికను రూపొందించుకోవడం ఉత్తమ మార్గమని నిపుణులు సూచిస్తున్నారు.

## చర్మంపై ఈ లక్షణాలు, సంకేతాలు కనిపిస్తే జాగ్రత్త..

గుండె జబ్బులు అంటే చాలామందికి ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె దడ వంటి లక్షణాలే గుర్తుకు వస్తాయి. అయితే కొన్ని సందర్భాల్లో గుండె ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు చర్మంపై కనిపించే మార్పుల రూపంలోనూ సంకేతాలు ఇస్తాయి. ఇవి గుండె జబ్బులను నిర్ధారించే లక్షణాలు కాకపోయినా, శరీరంలో రక్తప్రసరణ, కొలెస్ట్రాల్, ఆక్సిజన్ సరఫరా లేదా ఇతర జీవక్రియల్లో లోపాలు ఉన్నట్లు సూచించే హెచ్చరికలుగా పరిగణించవచ్చు. అందువల్ల ఇలాంటి మార్పులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



చర్మంపై, ముఖ్యంగా కనురెప్పలు, మోచేతులు, మోకాళ్లు లేదా ఇతర భాగాల్లో పసుపు రంగులో చిన్న కొవ్వు గడ్డలు కనిపిస్తే వాటిని జాంతోమాస్ అంటారు. ఇవి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నట్లు సూచిస్తాయి. అధిక కొలెస్ట్రాల్ కారణంగా రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయి గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతాయి. చర్మం కింద మైనంలా కనిపించే చిన్న గడ్డలు కూడా కొవ్వు జీవక్రియలో లోపాలకు సంకేతంగా ఉంటాయి. పెదవులు, వేళ్లు లేదా కాలి వేళ్లు నీలం రంగులోకి మారడం కూడా గుండె సమస్యలకు సంబంధించిన హెచ్చరికగా భావించాలి. దీనిని సయానోసిస్ అంటారు. రక్తంలో తగినంత ఆక్సిజన్ లేకపోవడం లేదా గుండె సమర్థంగా రక్తాన్ని పంప్ చేయలేకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా ఈ లక్షణంతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. పాదాలు, చీలమండలు లేదా కింది కాళ్లలో వాపు రావడం కూడా గుండె పనితీరు బలహీనపడినట్లు సూచించే అవకాశం ఉంటుంది. దీనిని పెరిఫెరల్ ఎడిమా అంటారు. శరీర కణజాలాల్లో అదనపు ద్రవం పేరుకుపోవడం వల్ల ఈ వాపు ఏర్పడుతుంది. చర్మం బిగుసుకుపోయినట్లు, మెరిసేలా కనిపిస్తుంది. ముఖ్యంగా గుండె వైఫల్యం ఉన్నవారిలో ఈ లక్షణం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. వాపు తగ్గకుండా కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదు. మెడ, చంకలు లేదా తొడల మడతల్లో నలుపు రంగులో మందంగా, వెల్వెట్‌లా కనిపించే చర్మాన్ని అకాంథోసిస్ నైగ్రికన్స్ అంటారు. ఇది సాధారణంగా ఇన్సులిన్ నిరోధకతకు సంకేతం. ఇలాంటి పరిస్థితి మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. మధుమేహం గుండె జబ్బులకు ప్రధాన ప్రమాద కారకాలలో ఒకటి. కాబట్టి ఈ లక్షణాలు కనిపిస్తే రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం అవసరం. కాళ్లపై వెంట్రుకలు తగ్గిపోవడం కూడా కొన్ని సందర్భాల్లో రక్తప్రసరణ సరిగా లేకపోవడానికి సంకేతం అవుతుంది. పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ (PAD) అనే వ్యాధిలో కాళ్లకు రక్తప్రసరణ తగ్గిపోవడం వల్ల చర్మం పలుచబడటం, గాయాలు ఆలస్యంగా మానడం, వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధికి గుండె జబ్బులతో కూడా సంబంధం ఉండే అవకాశం ఉంటుంది.


## ఏసీలో ఎక్కువసేపు ఉంటే..

ఇటీవల కాలంలో ఇళ్లు, కార్యాలయాలు, వాహనాల్లో ఎయిర్ కండిషనర్ (ఏసీ) వినియోగం బాగా పెరిగింది. అయితే, ఎక్కువ సమయం ఏసీ గదుల్లో గడిపితే ఎముకలు బలహీనపడతాయా? కీళ్ల నొప్పులు లేదా ఆర్థరైటిస్ వచ్చే ప్రమాదం ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఏసీ నుంచి వచ్చే చల్లని గాలి ఎముకలను నేరుగా బలహీనపరచదు. అయితే, రోజంతా ఏసీ గదుల్లోనే ఉండడం వల్ల కొన్ని పరోక్ష ప్రభావాలు ఎముకల ఆరోగ్యంపై పడే అవకాశం ఉంది. ఎముకల దృఢత్వం ప్రధానంగా కాల్షియం, విటమిన్–డి, సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా చేసే వ్యాయామంపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ సమయం ఇంట్లో లేదా కార్యాలయంలో ఏసీలో గడిపేవారికి సూర్యరశ్మి తక్కువగా తగులుతుంది. దీంతో శరీరంలో విటమిన్–డి లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. విటమిన్–డి ఎముకలకు అవసరమైన కాల్షియంను శరీరం గ్రహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీర్ఘకాలం విటమిన్–డి లోపం ఉంటే ఎముకలు బలహీనపడటంతో పాటు ఆస్టియోపొరోసిస్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఏసీ వాడకం వల్ల నేరుగా కీళ్లవాతం (ఆర్థరైటిస్) రాదు. అయితే ఇప్పటికే కీళ్ల నొప్పులు, ఆస్టియో ఆర్థరైటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి చల్లటి వాతావరణం కారణంగా నొప్పి, బిగుతు ఎక్కువగా అనిపించవచ్చు. రోజూ కనీసం 10 నుంచి 15 నిమిషాల పాటు సూర్యరశ్మిలో గడపండి. కాల్షియం, విటమిన్–డి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోండి. పాలు, పెరుగు, జున్ను వంటి పాల ఉత్పత్తులను ఆహారంలో చేర్చుకోండి. రోజూ నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయండి. ఏసీ ఉష్ణోగ్రతను 24 డిగ్రీల సెల్సియస్ వద్ద ఉంచడం మంచిది. ఏసీ వాడటం వల్ల ఎముకలు నేరుగా బలహీనపడవు. అయితే సూర్యరశ్మి లోపం, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలు ఎముకల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే సరైన ఆహారం, వ్యాయామం, తగినంత సూర్యరశ్మి తీసుకోవడం చాలా ముఖ్యం.



## కాపర్‌ను తరచూ తీసుకుంటే మెదడు ఆరోగ్యం పదిలం..

మెదడు ఆరోగ్యాన్ని కాపాడడంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా శరీరానికి అవసరమైన సూక్ష్మ ఖనిజాల్లో ఒకటైన కాపర్ (రాగి) మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఇప్పటికే తెలిసిన విషయమే. తాజాగా వెలువడిన ఓ ప్రయోగాత్మక అధ్యయనం ప్రకారం, నియంత్రిత మోతాదులో కాపర్‌ను ఉపయోగించడం వల్ల ప్రోటీన్ల ప్రభావం తగ్గినట్లు పరిశోధకులు గుర్తించారు. కాపర్ శరీరానికి చాలా తక్కువ మోతాదులో అవసరమయ్యే సూక్ష్మ ఖనిజం. ఇది మెదడులో న్యూరోట్రాన్స్‌మిటర్ల పనితీరును మెరుగుపరచడం, వివిధ ఎంజైమ్‌ల కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడం వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుంది. అలాగే మెదడు కణాలను రక్షించే న్యూరోప్రొటెక్టివ్ పాత్ర కూడా పోషిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే శరీరంలో కాపర్ మోతాదు సమతుల్యంగా ఉండటం చాలా ముఖ్యం. కాపర్ ఎక్కువైనా, తక్కువైనా మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. కాపర్ అసమతుల్యత వల్ల ఆక్సిడేటివ్ ఒత్తిడి పెరిగి మెదడు కణాలు దెబ్బతినడం, న్యూరో ఇన్‌ఫ్లమేషన్ పెరగడం, కణాల్లో శక్తిని ఉత్పత్తి చేసే మైటోకాండ్రియా పనితీరు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంటుంది. మెదడులోని ప్రోటీన్లు సాధారణంగా నాడీ వ్యవస్థ పనితీరుకు అవసరమైనవే. కానీ బీటా–అమిలాయిడ్, టావు వంటి కొన్ని ప్రోటీన్లు అసాధారణంగా పేరుకుపోతే అవి విషపూరితంగా మారి మెదడు కణాల మధ్య సమాచార మార్పిడిని అడ్డుకుంటాయి. అల్జీమర్స్ వ్యాధిలో ఈ ప్రోటీన్లు పేరుకుపోవడాన్ని ప్రధాన లక్షణంగా గుర్తించారు. తాజా పరిశోధనలు కాపర్ థెరపీ ద్వారా ఈ ప్రక్రియను కొంతవరకు నియంత్రించే అవకాశాన్ని పరిశీలిస్తున్నాయి. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాలు ప్రయోగశాలల్లో జంతువులపై నిర్వహించిన అధ్యయనాలకే పరిమితమయ్యాయి. మానవుల్లో ఇదే ఫలితాలు వస్తాయో లేదో నిర్ధారించడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరమని పరిశోధకులు చెబుతున్నారు.



మెదడులో పేరుకుపోయే హానికరమైన ప్రోటీన్లను తగ్గించే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే ఈ పరిశోధన ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, దీనిని ప్రస్తుతం చికిత్సగా పరిగణించరాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అల్జీమర్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధుల్లో మెదడులో విషపూరిత ప్రోటీన్లు పేరుకుపోవడం ప్రధాన కారణంగా భావిస్తారు. ఈ ప్రోటీన్లు మెదడు కణాల మధ్య సమాచార మార్పిడిని దెబ్బతీసి జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తాజా ప్రయోగశాల అధ్యయనంలో నియంత్రిత మోతాదులో కాపర్ ఇవ్వడం వల్ల మెదడు కణాల మధ్య సమాచార ప్రసారం మెరుగుపడటంతో పాటు హానికరమైన

## చిగుళ్ల వాపు, రక్తస్రావం సమస్యలకు అసలు కారణం ఏంటి..

చిగుళ్ల వాపు, బ్రష్ చేస్తున్నప్పుడు రక్తం రావడం వంటి సమస్యలను చాలా మంది సాధారణ దంత సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ఇవి కేవలం నోటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు మాత్రమే కాకుండా, శరీరంలో విటమిన్ సి లోపానికి కూడా సంకేతాలు అవుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరంలో విటమిన్ సి తగినంతగా లేకపోతే చిగుళ్లు బలహీనపడటంతోపాటు వాపు, నొప్పి, రక్తస్రావం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని అంటున్నారు. విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి అత్యంత కీలకమైన పోషకం. కొల్లాజెన్ చిగుళ్లతోపాటు చర్మం, ఎముకలు, కణజాలాలను బలంగా ఉంచే ప్రధాన ప్రోటీన్. విటమిన్ సి లోపం ఏర్పడితే చిగుళ్ల నిర్మాణం బలహీనపడుతుంది. ఫలితంగా అవి సులభంగా వాపు రావడం, బ్రష్ చేసే సమయంలో లేదా గట్టిగా నమిలినప్పుడు రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే చిగుళ్ల సమస్యలకు విటమిన్ సి లోపం ఒక్కటే కారణం కాకపోయినా, దీన్ని ప్రధాన కారణాల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఈ సమస్యలను తగ్గించుకోవడానికి విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ ఆహారంలో చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నారింజ, జామ, మోసంబి వంటి పండ్లు విటమిన్ సికి మంచి మూలాలు. వీటిని తరచూ తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్ సి లభిస్తుంది.



రోజును నిమ్మరసం కలిపిన గోరువెచ్చని నీరు లేదా తాజాగా తీసిన నారింజ రసంతో ప్రారంభించడం కూడా మంచి అలవాటు. సిట్రస్ పండ్లను తరచూ తీసుకోవడం వల్ల రోజువారీ విటమిన్ సి అవసరాన్ని తీర్చుకోవచ్చు. ఎరుపు, పసుపు రంగు క్యాప్సికమ్‌లలో కూడా విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. వీటిని సలాడ్లలో కలిపి లేదా తేలికపాటి చిరుతిండిగా తీసుకోవచ్చు. అలాగే ఉదయపు అల్పాహారంలో పెరుగు లేదా సిరియల్‌లో స్ట్రాబెర్రీ, బ్లాక్‌కరెంట్, బొప్పాయి, జామ, కివీ వంటి పండ్లు కలిపి తీసుకుంటే శరీరానికి మంచి మోతాదులో విటమిన్ సి అందుతుంది. పాలకూర, కేల్, బోక్ చోయ్ వంటి ఆకుకూరలు కూడా విటమిన్ సికి మంచి వనరులు. వీటిని సలాడ్లు, స్మూతీలు లేదా ఇతర వంటకాల రూపంలో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా విటమిన్ సి లోపాన్ని తగ్గించుకోవడంతోపాటు చిగుళ్ల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరచుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## జొన్నలతో మేలెంతో..!


జొన్నల తో చేసిన వంటకాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు.

జొన్నల్లో గ్లూటెన్ ఉండదు. కాబట్టి ఇది మంచి ఆహారం. ఫైబర్ పుష్కలంగా ఉండే జొన్నలు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలోనూ తోడ్పడతాయని చెబుతున్నారు. ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే జొన్నల్ని



ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎక్కువసేపు పొట్ట నిండుగా ఉండేలా చూసుకోవచ్చు. బరువు అదుపు చేసుకోవడానికి ఇదీ ఓ మార్గమే! వివిధ పోషకాలు పుష్కలంగా ఉండే జొన్నలు ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. రక్తనాళాల్లో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో జొన్నలు సహకరిస్తాయట. శరీరంలో శక్తి స్థాయుల్ని పెంచడానికి కూడా తోడ్పడతాయని చెబుతున్నారు నిపుణులు. ఎన్ని ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని రకాల చిరు ధాన్యాల విషయంలో తమ శరీర తత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, సంబంధిత నిపుణుల సలహా మేరకే వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిదన్న విషయం గుర్తుంచుకోవాలి.

## శరీరంలోని వేడిని తగ్గించడంలో కీరదోస, పుచ్చకాయ..



కీరదోసకాయలో సుమారు 95 శాతం వరకు నీరు ఉంటుంది. అందువల్ల ఇది శరీరానికి క్రమంగా నీటిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల వేసవిలో రోజువారీ ఆహారంలో కీరదోసకాయను చేర్చడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పుచ్చకాయలో 92 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు, లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటాయి. ఇవి శరీరానికి త్వరగా నీటిని అందించడమే కాకుండా వేడి కారణంగా తగ్గిన శక్తిని తిరిగి అందించడంలో, ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. అయితే పుచ్చకాయను భోజనం చేసిన వెంటనే తినకూడదని, పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కీరదోసకాయ, పుచ్చకాయ రెండూ శరీరాన్ని చల్లబరచడంలో ఉపయోగపడినా వాటి ప్రయోజనాలు కొంత భిన్నంగా ఉంటాయి. కీరదోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండి శరీరానికి నెమ్మదిగా హైడ్రేషన్ అందిస్తుంది. పుచ్చకాయ మాత్రం సహజ చక్కెరల కారణంగా త్వరగా శక్తిని, నీటిని అందిస్తుంది. అలాగే పుచ్చకాయలో ఎలక్ట్రోలైట్లు కొంత ఎక్కువగా ఉండగా, కీరదోసకాయ తక్కువ కేలరీలతో ఎక్కువసేపు చల్లదనాన్ని అందిస్తుంది. హీట్ స్ట్రెస్‌ను తగ్గించడంలో ఏది మంచిదన్నది వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. శరీరానికి దీర్ఘకాలం చల్లదనం, తక్కువ కేలరీలతో హైడ్రేషన్ కావాలనుకునేవారికి కీరదోసకాయ మంచి ఎంపిక. త్వరగా నీరు, శక్తి అందించాలంటే పుచ్చకాయ ఉపయోగపడుతుంది. రెండింటినీ సమతుల్యంగా తీసుకోవడం వల్ల మరింత ప్రయోజనం ఉంటుంది. వేసవిలో కీరదోసకాయను సలాడ్ రూపంలో లేదా నీటిలో ముక్కలు వేసి ఇన్‌ఫ్యూజ్డ్ వాటర్‌గా తీసుకోవచ్చు. పుచ్చకాయను మధ్యాహ్నం సమయంలో చిరుతిండిగా తినడం మంచిది. ప్యాకెట్ జ్యూస్‌లకు బదులుగా తాజా పండ్లనే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రతి ఒక్కరూ వీటిని ఒకే విధంగా తీసుకోవడం సరైంది కాదు. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. అలాగే మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు పొటాషియం మోతాదును దృష్టిలో పెట్టుకుని పుచ్చకాయ వినియోగాన్ని నియంత్రించాలి. ఇక వేసవిలో హీట్ స్ట్రెస్ నుంచి రక్షణ పొందాలంటే కీరదోసకాయ, పుచ్చకాయ రెండింటినీ సమతుల్యంగా ఆహారంలో చేర్చడం మంచిది. వీటితోపాటు తగినంత నీరు తాగడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకుండా ఉండటం, శరీరానికి అవసరమైన హైడ్రేషన్‌ను కాపాడుకోవడం ద్వారా వేసవి ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

## చక్కటి జుట్టు కోసం..!

ఒత్తిడి, కాలుష్యం.. మొదలైన కారణాల వల్ల చాలామందికి చిన్న వయసులోనే వివిధ కేశ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని దూరం చేసుకునేందుకు మార్కెట్లో దొరికే వివిధ రకాల హెయిర్ కేర్ ఉత్పత్తులు, నూనెలను ఆశ్రయిస్తున్నారు. కానీ, ఇలాంటి కొన్ని ఉత్పత్తులను ఇంట్లోనే సహజసిద్ధంగా చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఈ నూనె అలాంటిదేనంటున్నారు!

కొబ్బరినూనె – అరకప్పు
కరివేపాకు – 15 నుంచి 20 రెబ్బలు
మెంతులు – టేబుల్ స్పూన్
ఉల్లిపాయ – (సన్నగా తరుక్కోవాలి)

పైన చెప్పిన పదార్థాలన్నీ ఓ మందపాటి పాత్రలో తీసుకుని మీడియం మంటపై అరగంట పాటు మరగనివ్వాలి. ఆ తర్వాత మిశ్రమాన్ని చల్లారనిచ్చి వడకట్టాలి. ఈ నూనెను బాటిల్‌లో నింపి.. కావాల్సినప్పుడు ఉపయోగించవచ్చని చెబుతున్నారు నిపుణులు.

కరివేపాకులో పుష్కలంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టుకు కావాల్సిన తేమను అందించి సహజమైన మాయిశ్చరైజర్‌లా పనిచేస్తాయట. ఇందులోని ప్రొటీన్లు జుట్టుకు పటుత్వాన్ని అందిస్తాయంటున్నారు నిపుణులు.

కొబ్బరి నూనె కురులకు రక్షణ కలిగిస్తుంది. కుదుళ్లకు బలాన్ని అందించి జుట్టు చివర్లు చిట్లిపోకుండా కాపాడుతుందట. మెంతుల్లో ఉండే ప్రొటీన్, నికోటినిక్ యాసిడ్.. మొదలైనవి చుండ్రు సమస్యను తగ్గించడంలో సహాయం చేస్తాయంటున్నారు నిపుణులు.



## ఉడుమును సురక్షితంగా అడవిలోకి విడిచిన ఫారెస్ట్ అధికారులు



**అచ్చంపేట, ఆగస్టు 16, (వుదయం ప్రతినిధి):**
అచ్చంపేట పట్టణంలో పదర మండల పంచాయతీ కార్యదర్శి రమేష్ నివసిస్తున్న ఇంట్లోకి ఉడుము ప్రవేశించింది. దీంతో వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న నెక్కు క్యాచర్ సుమన్, రెస్క్యూ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో ఉన్న ఉడుమును ఎలాంటి హాని కలగకుండా సురక్షితంగా పట్టుకుని, సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అడవిలోకి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ శ్రీ చంద్రశేఖర్, ACF మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పాములు, ఉడుములు లేదా ఇతర అడవి జంతువులు అనుకోకుండా ఇళ్లలోకి, గ్రామాల్లోకి వచ్చినప్పుడు వాటిని కొట్టడం, గాయపరచడం లేదా చంపకుండా వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.అడవి జంతువులను రక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ హనుమత్ నాయక్ పాల్గొన్నారు.



## హనుమాన్ నగర్ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షునిగా ఉప్పు బాలస్వామి

**వెల్దండ ఆగస్టు 15 (వు దయం)**
కర్మన్ ఘాట్ హనుమాన్ నగర్ ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షునిగా ఉప్పు బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు మృదు స్వభావి అందరితో కలిసిమెలిసి ఉండే గుణం కలిగిన ఉప్పు బాలస్వామి గత 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాల లో భాగస్వామ్య తన వంతు సాయం చేసేవాడు అని పలువురు ఆర్యవైశ్య సంఘం నేతలు, మరియు మిత్రబృందం, కాలనీవాసులు బాలస్వామికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సోమ సత్యనారాయణ, చంద్రశేఖర్, గణేష్, సైదులు, వెంకట్ రెడ్డి, బాల ప్రసాద్, రమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు



## లలితభాయి కుటుంబానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి పరామర్శ

**దౌల్తాబాద్, ఆగస్టు 16 (వుదయం):**
బీఆర్ఎస్ పార్టీ రాయపోల్ మండల అధ్యక్షుడు రాయపోల్ వెంకటేశ్వర శర్మ అమ్మమ్మ లలితభాయి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. లలితభాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ సహకారం ఉంటుందని తెలిపారు.ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు మాజీ జడ్పీటీసీ యాదగిరి, స్థానిక సర్పంచ్ మాసంపల్లి రాజు, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, ఇప్ప దయాకర్, వెంకట్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాజుగౌడ్ తదితర నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విద్యార్థుల కోసం స్మార్ట్ టీవీ, సౌండ్‌బార్ బహూకరణ



**దౌల్తాబాద్ ఆగస్టు 16(వుదయం):**
మండలం ఎల్కల్ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యువత ఆధ్వర్యంలో పాఠశాలకు స్మార్ట్ టీవీ, సౌండ్‌బార్‌ను బహూకరించారు. ఎల్కల్ యూత్ లీడర్ నరేష్‌గౌడ్, వాలీబాల్ యూత్ సభ్యుల సహకారంతో ఈ పరికరాలను పాఠశాలకు అందజేశారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి, డిజిటల్ తరగతుల నిర్వహణకు స్మార్ట్ టీవీ, సౌండ్‌బార్ ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి యువత ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం వాలీబాల్ యూత్ సభ్యులు రతన్, మనోజ్ గౌడ్, వడ్లకొండ నాగరాజు, బద్రీనాథ్ చారి, నవీన్, గణేష్, స్వామి, శ్రీకాంత్, మీ సేవ రాజు, నరేష్, శ్రీను, సాయి శ్రీధర్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు నరసింహ, నరేష్, కరుణాకర్, అండాలు, మహాలక్ష్మి, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ పదివేల ఆర్థిక సాయం

**సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్**



**వెల్దండ ఆగస్టు 16 (వు దయం )**
మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన గన్నోజు కళావతి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోతేపల్లిగ్రామ సర్పంచ్ తగుళ్ల కొండలు యాదవ్ మృతుడి కుటుంబానికి టిఆర్ఎస్ నాయకుల ద్వారా రూ.10,000/అందజేశారు.
ఈ కార్యక్రమంలో మైబు యాదవ్, ఎగిరిశెట్టి శివ,అంజి యాదవ్, సాయి యాదవ్, శ్రీశైలం, లట్టు యాదవ్, శేఖర్ చారి,తదితరులు ఉన్నారు.

## వందేమాతరం'పై గద్వాలలో ఉగ్రరూపం: కాంగ్రెస్ అగ్రనేతలే లక్ష్యంగా నిరసన జ్వాలలు!



**గద్వాల ఆగస్టు 16 (వుదయం కరస్పాండెంట్)**
స్వాతంత్ర్య దినోత్సవ పవిత్ర వేదికపై జాతీయ గేయం 'వందేమాతరం'ను సంపూర్ణంగా ఆలపించకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంపై భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఉగ్రరూపం దాల్చాయి. జాతీయ భావనలను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను అవమానించే రీతిలో వ్యవహరించారంటూ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. జాతీయ గేయం పట్ల కాంగ్రెస్ వహించిన బాధ్యతారాహిత్య వైఖరిని నిరసిస్తూ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న వైఎస్సార్ చౌక్ వద్ద భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన జ్వాలలు పట్టణాన్ని ఊపేశాయి.క్షమాపణలు చెప్పాల్సిందే' జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి నేతృత్వంలో సాగిన ఈ పోరాటంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొని కాంగ్రెస్ నాయకత్వంపై పరుష పదజాలంతో ధ్వజమెత్తారు. 'వందేమాతరం' గీతాన్ని విస్మరించడం, అరకొరగా ఆలపించడం 140 కోట్ల భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని నిప్పులు చెరిగారు. దేశభక్తి కంటే రాజకీయ స్వార్థమే ఎక్కువైందని విమర్శించిన ఆయన, ఈ ఘోర తప్పిదానికి కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర అధిష్ఠానాలు తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని హెచ్చరించారు. ఉద్రిక్తంగా మారిన వైఎస్సార్ చౌక్ దేశభక్తి, జాతీయ సంకేతాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేస్తూ పార్టీ, యువ మోర్చా కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీకి, అగ్రనేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వైఎస్సార్ చౌక్ ప్రాంగణమంతా తీవ్ర రాజకీయ గందరగోళంతో ఉద్రిక్తంగా మారింది. నిరసనలో ఆందోళనకారుల హోరు ఈ భారీ నిరసన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, శ్యామ్‌రావు, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహ, ఇతర వెనుకబడిన తరగతుల మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనిల్, జిల్లా మోర్చా అధ్యక్షుడు దాస్, పురపాలక సంఘ సభ్యుడు చంద్రశేఖర్, మాజీ సభ్యుడు శ్రీమన్నారాయణ, సీనియర్ నాయకులు అక్బర్ బాషా, సద్దల క్రిష్ణ, మధుగౌడ్, శంకర్, డిల్లీవాలా క్రిష్ణ, తిమ్మనలతో పాటు యువ మోర్చా ప్రతినిధులు పాండు, సతీష్, మోహన్‌రెడ్డి, పవన్, రమేష్, కిషోర్ మరియు శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టారు.

## పి.ఎల్.సి. ఫార్మ్ ల్యాండ్ అంతా బోగస్‌నా?

**వుదయం నాగలిగిద్ద మండల్ తేదీ:**
గుట్టలను ఆక్రమించి ఫార్మ్ ల్యాండ్ పేరుతో ప్రజలకు ఎర వేస్తున్నారన్న బీఎస్పీ నేతనారాయణఖేడ్,నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గంగారాం తండా సమీపంలో గుట్టలను ఆక్రమించి నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.ఎల్.సి. ఫార్మ్ ల్యాండ్ వ్యవహారంపై నారాయణఖేడ్ బీఎస్పీ అధ్యక్షుడు ఎనుముల తుకారాం తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఫార్మ్ ల్యాండ్ ప్రాంతాన్ని సందర్శించి అక్కడికి వచ్చిన కొనుగోలు దారులతో మాట్లాడారు. ప్రజలను ఆకర్షించే పేర్లతో భూములను విక్రయిస్తూ మోసం చేస్తున్నారాని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మ్ ల్యాండ్‌లో గుంటల చొప్పున భూములను విక్రయిస్తూ, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాల పేరుతో కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారని ఆరోపించారు. అయితే సంబంధిత భూములు గుట్టలపై ఉండటంతో సాగునీటి వనరులు



అందుబాటులో లేవని, అలాంటి ప్రాంతాల్లో చెట్లు పెంచి భవిష్యత్తులో భారీ లాభాలు పొందవచ్చంటూ ప్రజలను నమ్మిస్తున్నారని విమర్శించారు.ఫార్మ్ ల్యాండ్ పేరుతో భూములను విక్రయించాలంటే భూమి వినియోగ మార్పిడి, లేఅవుట్ అనుమతులు, సంబంధిత రెవెన్యూ రికార్డులు, స్థానిక సంస్థల అనుమతులు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు సంబంధించిన నిబంధనలు పాటించాల్సి ఉంటుందని అన్నారు. సంబంధిత భూములు వ్యవసాయ భూములైతే వాటిని ఫార్మ్ ల్యాండ్ పేరుతో విక్రయించడానికి ఏమైనా ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గుట్టలు, ప్రభుత్వ భూములు లేదా ఇతరుల భూములను ఆక్రమించి ఉంటే వాటిపై హక్కులు ఎలా కల్పించారు? రిజిస్ట్రేషన్లు ఏ ఆధారాలతో జరుగుతున్నాయి? అని ఆయన ప్రశ్నించారు. భూముల రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్లు, ఎన్‌కంబరెన్స్ వివరాలు, భూమి వినియోగం, లేఅవుట్ అనుమతులు తదితర అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అమాయక ప్రజల డబ్బులు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని, ఫార్మ్ ల్యాండ్ పేరుతో ప్రకటనలు చేసి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లయితే, ముందుగా సంబంధిత శాఖలు పూర్తి స్థాయిలో తనిఖీ చేసి భూముల వాస్తవ స్థితిగతులను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేస్తారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా అధికారులు ముందుగానే వాస్తవాలను బయటపెట్టాలి. పి.ఎల్.సి. ఫార్మ్ ల్యాండ్‌కు ఉన్న అనుమతులు, భూముల అసలు స్వరూపం, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలను అధికారులు బహిర్గతం చేయాలి అని డిమాండ్ చేశారు.

## గిన్నిస్ రికార్డు తెప్ప శ్రీనివాస్‌కు ఘన సన్మానం

**నాగర్ కర్నూల్ జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో సత్కారం**





**నాగర్ కర్నూల్, ఆగస్టు 16 (వుదయం బ్యూరో)**
రెండుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన డాక్టర్ లయన్స్ తెప్ప శ్రీనివాస్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.
సేవా ఫౌండేషన్ ద్వారా ఎన్నో ఏళ్లుగా తెప్ప శ్రీనివాస్ నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలు, వృద్ధులు, వికలాంగులకు అండగా నిలుస్తూ, పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. వృద్ధులకు వస్త్రాలు అందిస్తూ మానవతా దృక్పథం చాటుకుంటున్నారు.విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పేద విద్యార్థులకు తైక్వాండో, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నారు. ఆయన శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు,లయన్స్ క్లబ్ ద్వారా రక్తదానం, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలకు తెప్ప శ్రీనివాస్ ప్రోత్సాహం అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ రెండుసార్లు గుర్తింపునిచ్చింది.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాజిక సేవతో పాటు విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. జిల్లా ముదిరాజ్ సమాజానికి ముద్దుబిడ్డగా తెప్ప శ్రీనివాస్ సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు.సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించడం మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెప్ప శ్రీనివాస్ అన్నారు. భవిష్యత్తులోనూ పేదలు, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులకు సేవలు కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు తెప్ప తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు తెప్ప రుద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తవిటి నిరంజన్, డీఏఫ్‌సీఎస్ జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, డైరెక్టర్ తెప్ప బాబు, యాదయ్య, యానామోని తిరుపతయ్య, రాజేందర్, రాజు, రాము తదితరులు పాల్గొని తెప్ప శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

## మృతుని కుటుంబానికి క్లాస్ మెంట్ల సహకారం

**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 16....**
మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుణం గారి స్వామి ఇటీవల ప్రమాదవశత్తు నీట మునిగి మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయాన్ని క్లాస్ మెంట్ స్వామి కుటుంబానికి ఏదో ఒక చిన్నపాటి సహాయం చేయాలన్న సంకల్పంతో క్లాస్ మెంట్స్ అందరూ కలిసి 16 వేల రూపాయలు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. తమ మిత్రుడు స్వామి ఏ లోకంలో ఉన్న ఆయన ఆత్మకు శాంతిని చేకూర్చేలా భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని చేకూర్చేలా చూడమని భగవంతుని కోరారు. ఈ కార్యక్రమంలో సతీష్ గౌడ్. కుమార్. గణేష్. నాగరాజు. గణేష్. పోచయ్య. రాజు. పోల్దాస్ నర్సింలు. రాజు. పి రవి. ఆంజనేయులు గౌడ్. అనంతరం స్నేహితులు కలిసి నా తమ్ముడు స్వామి కుటుంబానికి సాయం చేసిన ప్రతి ఒక్కడికి కృతజ్ఞతలు అని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుణముగారి రాజు తెలిపారు.



## ఉచిత కుట్టు మిషన్ దరఖాస్తులకు ఆహ్వానం


**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి**



**దౌల్తాబాద్, ఆగస్టు 16 (వుదయం):**
కుట్టు మిషన్లపై ఆధారపడి జీవిస్తున్న బీసీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందని దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోందన్నారు.ఈ పథకంలో మొదటి ప్రాధాన్యతగా నిరుపేద మహిళలు, దివ్యాంగులు, అనాథలు, వితంతువులు, ఒంటరి మహిళలకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. వివాహం అనంతరం ఒంటరిగా జీవిస్తున్న మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.మండలంలోని అర్హులైన బీసీ మహిళలు పార్టీలకు అతీతంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్లారెడ్డి కోరారు. ముఖ్యంగా కుట్టు శిక్షణ పొందిన మహిళలకు మొదటి ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన మహిళలు వినియోగించుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు.

## ఎల్పీజీ వినియోగదారులకు మరో వారం గడువు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 16 వుదయం ప్రతినిధి:**
ఎల్పీజీ వినియోగదారులకు చమురు సంస్థలు స్వల్ప ఊరట కల్పించాయి. గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు గతంలో విధించిన ఆగస్టు 16 గడువును తాజాగా ఆగస్టు 23 వరకు పొడిగించాయి. ఈ మేరకు వినియోగదారులకు మొబైల్ ఫోన్ల ద్వారా సమాచారం అందించాయి. ఆగస్టు 23లోగా ఈకేవైసీ పూర్తి చేయకపోతే గృహ వినియోగ (డొమెస్టిక్) సబ్సిడీ రేటుపై ఎల్పీజీ సిలిండర్ పొందే అర్హత కోల్పోయే అవకాశం ఉందని చమురు సంస్థలు హెచ్చరించాయి. అర్హత కోల్పోకుండా వినియోగదారులు నిర్ణీత గడువులోగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించాయి.




## గవర్నర్ ను కలిసిన సర్పంచ్



**వుదయం న్యూస్ శివ్వంపేట ఆగస్ట్ 16.....**
భారత స్వాతంత్ర్య ధినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి గవర్నర్ బంగ్లా లోక్ భవన్ లో జరిగిన తేనేటి విందు కార్యక్రమానికి ప్రముఖులతోపాటు శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్ సర్పంచ్, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి హనుమంతరావు ను సైతం గవర్నర్ ఆహ్వానించగా, ఎట్ ది హోమ్, తేనేటి విందు కార్యక్రమానికి హనుమంతరావు కీర్తన దంపతులు హాజరయ్యారు. తమను తినేటివిందు కార్యక్రమానికి ఆహ్వానించిన సందర్భంగా హనుమంతరావు దంపతులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఆదివారం తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## దర్గానుదర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

**ఆందోల్ జోగిపేట్ వుదయం**
ఆదివారంఅన్నాసాగర్ 79వ వార్షిక ఆరాధన సందర్భంగా మొదలు కావడంతో ప్రత్యేకంగా మాజీ ఎమ్మెల్యే చంటి కాంతి కిరణ్ దర్శించుకున్నారు కార్యక్రమం కార్యక్రమంలో అన్నాసాగర్ పీఠాధిపతి హుస్సేన్ చతుర్థిశాలువతో మాజీ ఎమ్మెల్యే చంటి కిరణ్ ని సన్మానించారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి పి నారాయణ ముదిరాజ్ సంఘం కౌన్సిలర్ శివశేఖర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డిబి నాగభూషణం చాపల వెంకటేశం మాచర్ల విజయ కుమార్ పీర్ల శంకర్ రఫీ తదితరులు పాల్గొన్నారు



## ప్రజావాణికి ఎంపీడీవో కార్యాలయంలో పూర్తి ఏర్పాట్లు

**ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతుల స్వీకరణ**

**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 16, (వుదయం ప్రతినిధి):**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ మండల పరిషత్ కార్యాలయంలో 'ప్రజావాణి' నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో చెన్నమ్మ తెలిపారు.ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు కార్యాలయంలో అవసరమైన సదుపాయాలను సిద్ధం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.స్థానికులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుందని చెప్పారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అధికారులకు వినతిపత్రాలు అందజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చెన్నమ్మ కోరారు.
ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక ఉపయోగపడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



**దౌల్తాబాద్, ఆగస్టు 16 (వుదయం):**
గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని గొడుగుపల్లి గ్రామ సర్పంచ్ మద్దెల వనజ స్వామి అన్నారు. దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో 2బీహెచ్‌కే ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు గత కొన్ని రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.
ఈ సమస్యను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారని తెలిపారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి వివేక్ వెంకటస్వామి, చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి గొడుగుపల్లి గ్రామ పంచాయతీ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, మద్దెల మల్లేశ్, కుమారి, రమేష్, కృష్ణ, సాయి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఉపన్యాస పోటీలు

**విద్యార్థులకు బహుమతుల ప్రదానం**

**బిజినాపల్లి, ఆగస్టు 16, (వుదయం ప్రతినిధి)):**
80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రామ హైస్కూల్లో 8వ, 9వ, 10వ తరగతుల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు.స్వాతంత్రోద్యమంలో అతివాదులు మితవాదుల పాత్ర" అనే అంశంపై విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. దేశభక్తి, త్యాగాల గురించి విద్యార్థులు ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమం ముగింపులో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు .ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీజేఏసీ మంగనూరు గ్రామ అధ్యక్షులు అల్వాల శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షులు బందెల శివకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



వుదయం సినిమా:

## ...ాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్
## ...శ్వనాథ్ & సన్స్' సినిమాపై ప్రేమను కురిపిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు: కథానాయకుడు సూర్య



...మిళ అగ్ర కథానాయకుడు సూర్య ...టించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ ... సన్స్'. ప్రతిభ గల దర్శకుడు వెంకీ ...ట్లూరి దర్శకత్వం వహించిన ఈ ...త్రంలో మమితా బైజు కథానాయిక ...ా నటించారు. రాధిక శరత్‌కుమా..., రవీనా టాండన్ కీలక పాత్రలు ...ోషించారు. శ్రీకర స్టూడియోస్ సమ...ృణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ...ార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై ...ూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ...ంయుక్తంగా నిర్మించారు. జి.వి. ...కాష్‌కుమార్ సంగీతం అందించారు. ...హజమైన హాస్యం, సున్నితమైన భా...ోద్వేగాలతో హృదయాన్ని హత్తుకునే ...టుంబ కథా చిత్రంగా ఆగస్టు 14, ...026న థియేటర్లలో అడుగుపెట్టిన ...శ్వనాథ్ & సన్స్' సినిమాకి ప్రేక్షకు...ు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రధాన ...ారాగణం అద్భుతమైన నటన, వెంకీ ...ట్లూరి రచనలోని బలం, సాంకేతిక ...పుణుల పనితీరు.. ఇలా అన్ని ...ంశాలు చక్కగా కుదిరి 'విశ్వనాథ్ & ...న్స్'ను గొప్ప చిత్రంగా మలిచాయి. ...ందుకే ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ ...భిస్తూ, వసూళ్ళ వర్షం కురుస్తోంది. ...ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం, ...ాదరాబాద్ లోని ఐటీసీ కోహినూర్ ...ో సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించి తమ ...ంతోషాన్ని పంచుకోవడంతో పాటు, ...క్షకులకు కృతజ్ఞతలు తెలియజేసింది. ...ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు, ...ాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివా... ముఖ్య అతిథిగా పాల్గొనడం విశేషం.

...ఈ వేడుకలో ప్రముఖ దర్శకులు, ...ాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీని...ాస్ మాట్లాడుతూ.. "అందరికీ నమ...్కారం. ఈ కథ విన్నప్పటి నుంచే, ...ఈ సినిమా నా హృదయానికి చాలా ...గ్గరైంది. ఇలాంటి సమయంలో ఒక ...టుంబ కథా చిత్రం చేసి, దానిని విజ...యవంతం చేసినందుకు చిత్ర బృందం ...ుత్తానికి అభినందనలు. నేను సూర్య ...ారితో ఒక సినిమా చేయాలి. ఆయనకు ...చ్చే కథ ఇంకా చెప్పలేకపోయాను (న...్వుతూ). త్వరలోనే మేమిద్దరం కలిసి ...ని చేస్తామని నమ్ముతున్నాను. నా ...తీమణి సూర్య గారికి పెద్ద ఫ్యాన్. ...ూర్య గారితో సినిమా చేయమని ...క్వెస్ట్ కాదు, డిమాండ్ చేస్తున్నారు. ...ాధారణంగా సినిమా షూటింగ్ లకు ...ద్దగా వెళ్ళరు. అలాంటిది సూర్య గారి ...ద అభిమానంతో ఈ సినిమా సెట్ కి ...ళ్ళి, సూర్య గారితో ఫోటో దిగారు. ...డవాళ్లు అంత గమ్మున ఇష్టపడరు. ...ానీ, ఇష్టపడితే మాత్రం జీవితాంతం ...దిలిపెట్టరు. అలాంటి హీరోలు అతికొ... మంది ఉంటారు. అందులో సూర్య ...ారు ఒకరు. ఇండియాలో ఇద్దరే హీరోలకు వయసు వెనక్కి వెళ్తుంది. ఒకళ్ళు సూర్య గారు, ఇంకొకళ్ళు మహేష్ బాబు గారు. గజినీలో సూర్య గారు పోషించిన సంజయ్ రామస్వామి పాత్ర.. తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాదు, తెలుగు ప్రేక్షకులకు కూడా చాలా దగ్గరైన పాత్ర. కొన్ని పాత్రలు మనతో పాటు దశాబ్దాల పాటు ప్రయాణిస్తాయి. అలాంటి పాత్ర అది. హిందీ గజినీ చేసిన సమయంలో 'నేను సూర్యను మ్యాచ్ చేయలేకపోయాను' అని స్వయంగా అమీర్ ఖాన్ గారు ఒప్పుకున్నారు. జల్సా సినిమా చేసేటప్పుడు ఈ విషయం నాకు అల్లు అరవింద్ గారు చెప్పారు. ఆ లుక్ ని మళ్ళీ తీసుకురావడం కోసం వెంకీ పడిన కష్టానికి, అది రాయడంలో గానీ, తీయడంలో గానీ హ్యాట్సాఫ్. వెంకీ చాలా బాగా రాశారు. ఎడిట్ లో చూసిన సమయంలోనే నాకు అనిపించింది.. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు భవిష్యత్తులో ఐకానిక్ సీన్స్ గా మిగిలిపోతాయి. ఈ సినిమాలో నాలుగు పిల్లర్స్ ఉన్నాయి. ఒక పిల్లర్ సూర్య గారైతే, ఇంకో పిల్లర్ రాధిక గారు, మూడో పిల్లర్ రవీనా టాండన్ గారు, ఇంకో పిల్లర్ మమితా బైజు గారు. నేను కేజీఎఫ్ చూశాను, అలాగే బయట కూడా నాకు రవీనా గారు తెలుసు. బయట స్ట్రాంగ్ గా, డైనమిక్ లేడీలా కనిపిస్తారు. కానీ, ఇందులో ఆశ్చర్యకర పాత్ర పోషించారు. ఇక సూర్య గారిది చాలా డిఫికల్ట్ క్యారెక్టర్. కొంచెం కూడా ఎక్కువ చేయకూడదు. అలా అండర్ పెర్ఫార్మ్ చేయడం చాలా కష్టం. అలాంటి పాత్రలో సూర్య గారు అద్భుతంగా నటించారు. సూర్య గారి సినిమా నిర్మాణంలో మా ప్రొడక్షన్ పేరు కూడా ఉన్నందుకు సంతోషంగా ఉంది. కానీ, సూర్య గారి సినిమాకి దర్శకుడిగా నా పేరు పడినప్పుడు ఇంకా ఎక్కువ సంతోషిస్తాను. ఒక్క ఏడాది వ్యవధిలో కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్ లాంటి రెండు పూర్తి విభిన్న సినిమాలు చేశారు. సూర్య గారు ప్రయాణం మళ్ళీ కొత్తగా మొదలుపెట్టినట్లు అనిపిస్తుంది. మనతో ప్రయాణిస్తున్నారు, మనకు ఎన్నో జ్ఞాపకాలు ఇస్తున్నారు. సూర్య గారి నుంచి నేర్చుకోవాల్సింది వినయం. సూర్య తండ్రి గారు (శివకుమార్) అంటే నాకెంతో గౌరవం. సూర్య గారు, కార్తీ గారిని తెలుగు హీరోలుగా భావిస్తాం. ఇప్పుడు తమిళ సినిమా, తెలుగు సినిమా, హిందీ సినిమా అనే హద్దులు లేవు. ఇప్పుడు అన్ని భాషలు కలిపి ఇండియన్ సినిమా అయింది. ప్రపంచ వేదికపై భారతీయ సినిమా సత్తా చాటాల్సిన సమయం ఇది. ఆ దిశగానే మేమందరం పని చేస్తున్నాం. వెంకీ, వంశీ సహా టీమ్ అందరికీ శుభాకాంక్షలు. ఈ సినిమాకి నిజమైన హీరోలు ప్రేక్షకులే. ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు మా అందరి తరపున కృతజ్ఞతలు." అన్నారు.

కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. "మీరు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు చెప్పడానికి మాటలు కూడా సరిపోవడం లేదు. త్రివిక్రమ్ గారు ఈ వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఆయన రాకతో ఇది మరింత ప్రత్యేకంగా మారింది. త్రివిక్రమ్ గారి ఆశీస్సులు, ప్రేమ, మద్దతు వల్లే ఈ సినిమా సాధ్యమైంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తో నా ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. నాగవంశీ గారితో మరిన్ని సినిమాలు చేయాలని, మరిన్ని జ్ఞాపకాలు మూటకట్టుకోవాలని కోరుకుంటున్నాను. వెంకీ, వంశీ గారు తెలుగువారు. నేను తమిళనాడు, మమితా కేరళ, రవీనా గారు మహారాష్ట్ర. మేమందరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చాము, విభిన్న భాషలు మాట్లాడతాం. అందరం కలిసి ఒక మంచి సినిమా చేశాము. దానిని మీరు ఆదరిస్తున్నారు. ఈ సినిమాపై ప్రేమను కురిపిస్తూ.. ఫ్యామిలీ సినిమాలకు ప్రేక్షకులు మళ్ళీ లైఫ్ ఇచ్చారు. అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుంది. ఈ సినిమా పట్ల ప్రేక్షకులు ప్రేమను, గౌరవాన్ని చూపిస్తున్నారు. మా అందరికీ ఫ్యామిలీ జానర్ ఎంత ముఖ్యమో మళ్ళీ తెలియజేసింది ఈ సినిమా. ఫ్యామిలీ సినిమాల విషయంలో త్రివిక్రమ్ గారి స్ఫూర్తి ఎంతో ఉంటుంది. ఇలాంటి గొప్ప సినిమాను అందించిన వెంకీ అట్లూరికి కృతజ్ఞతలు. కొన్ని సినిమాలను వసూళ్లతో కొలవలేము. ప్రేక్షకులు పొందిన అనుభూతిలోనే ఈ సినిమా అసలు విజయం దాగుంది. వెంకీ రచనకు హ్యాట్సాఫ్. అలాగే తెలుగు ప్రేక్షకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు." అన్నారు.


**నటి రవీనా టాండన్ మాట్లాడుతూ..** "విశ్వనాథ్ & సన్స్ సక్సెస్ వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాపై ప్రేమను కురిపిస్తూ, ఇంతటి విజయానికి కారణమైన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. వెంకీ అట్లూరి గొప్ప దర్శకుడు. వినయంగా, ప్రేమగా ఉంటూ అందరి నుంచి మంచి అవుట్ పుట్ రాబట్టుకుంటూ ఉంటారు. భావోద్వేగాలతో నిండిన అద్భుతమైన సినిమా ఇది. ఇలాంటి గొప్ప సినిమాను అందించిన దర్శకుడు వెంకీకి అభినందనలు. ఈ షూటింగ్ ఒక పిక్నిక్ లాగా, ఎంతో సరదాగా జరిగింది. సూర్య గారికి ఎంతో క్రేజ్ ఉంది. కేవలం ఆయనను కలవడం కోసమే నా ఫ్రెండ్స్ మూవీ సెట్స్ కి వచ్చేవారు. రాధిక గారితో కలిసి నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. అందరికీ వెన్నుముకలా నిలిచి, ఇంత మంచి సినిమాని అందించిన నాగవంశీ గారికి అభినందనలు." అన్నారు.

దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "ముందుగా ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఈ కథ రాసినప్పుడు ట్రెండ్ ఇది కాదు. యాక్షన్, డార్క్ హ్యూమర్, హారర్, డివోషనల్ లాంటి సినిమాల ట్రెండ్ నడుస్తుంది. ఇలాంటి సమయంలో ఫ్యామిలీ సినిమా చేస్తానంటే, ఎవరైనా నిరుత్సాహ పరుస్తారు. కానీ, వంశీ గారు అలా చేయలేదు. త్రివిక్రమ్ గారు కూడా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఆయన మద్దతు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు. త్రివిక్రమ్ గారు ఎప్పుడైతే ఈ సినిమాను తనది అనుకున్నారో, ఆ తర్వాత అన్నీ వాటంతట అవే కుదిరాయి. మొదటి రోజుతో పోలిస్తే, రెండో రోజు రెట్టింపు వసూళ్ళు వస్తున్నాయని డిస్ట్రిబ్యూటర్లు చెప్పడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. 30 శాతం, 40 శాతం వసూళ్ళు పెరగడం నేను విన్నాను. కానీ, వసూళ్ళు రెట్టింపు అవ్వడం నా కెరీర్ లో మొదటి సారి చూస్తున్నాను. అందరూ నేను బాగా రాశానని అంటున్నారు. కానీ, సూర్య గారు ఈ సినిమాని భుజాల మీద మోశారు. ఈ వసూళ్ళ ఘనత అంతా ఆయనకే దక్కుతుంది. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు." అన్నారు.

ఈ కార్యక్రమానికి చిత్ర పంపిణీదారులు హాజరై, సినిమా సాధిస్తున్న భారీ వసూళ్లపై సంతోషం వ్యక్తం చేశారు. అలాగే నటులు సునీల్ రెడ్డి, వైవా హర్ష, ఫైట్ మాస్టర్ వెంకట్ తదితరులు పాల్గొని చిత్ర విజయం పట్ల తమ ఆనందాన్ని పంచుకున్నారు.

# వారాహి చిత్రం నుంచి బ్రహ్మానందం డివైన్ గింప్స్ రిలీజ్

వుదయం సినిమా:



...ుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్ర...ో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ ...మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జా...ర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ...మహేంద్రగిరి వారాహి' మహేంద్రగి... నేపథ్యంగా, వారాహి మాత డివైన్ ...వర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్నో ...ంతుచిక్కని సంఘటనలు, రహస్యా...ు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ ...నుభూతిని అందించబోతుంది.

...ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, ...ాళవిక నాయర్, బ్రహ్మానందం, ...ెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ ...లక పాత్రలు పోషిస్తున్నారు.

...ాజాగా మేకర్స్ బ్రహ్మానందం పాత్రని పరిచయం చేస్తూ పవర్ఫుల్ గ్లిమ్స్ ని రిలీజ్ చేశారు. గ్లిమ్స్ లో బ్రహ్మానందం అమ్మవారిని ప్రార్థిస్తున్న భక్తుని పాత్రలో డివైన్ ఫుల్ గా కనిపించారు. అమ్మ వారాహి మా మహేంద్రగిరిని కాపాడు తల్లి అని ప్రార్థిస్తున్నా ఈ గ్లిమ్స్ చివర్లో అమ్మవారు దర్శనం గూజ్ బంప్స్ అనుభూతి కలిగించింది.

రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది

నటీనటులు: సుమంత్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ.

సాంకేతిక బృందం:
దర్శకత్వం: సంతోష్ జాగర్లపూడి
నిర్మాతలు: కలిపు మధు, లక్ష్మణ్
నిర్మాణ సంస్థలు: రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిల్మ్స్
సంగీతం: అనూప్ రూబెన్స్
సినిమాటోగ్రాఫర్: ప్రతాప్ ఆర్ కృష్ణ
ఎడిటర్: జునైద్ సిద్ధిఖీ
ఆర్ట్ డైరెక్టర్: కృష్ణ ఆర్ట్స్

# ...ది ఇండియన్ బార్డర్' మంచి విజయం సాధించాలి

వుదయం సినిమా:

### ...ిందా రహేన్ తో డ్యూటీ' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో మేజర్ ఎస్‌పీఎస్ ఒబేరాయ్



...ర్ట్ ఇన్ హార్ట్ క్రియేషన్స్ బ్యానర్ మీద ...వేద్య రెడ్డి నిర్మాణంలో డి.ఎస్. బాషా ...ర్శకత్వం వహించిన చిత్రం 'ది ...ండియన్ బార్డర్'. ఈ సినిమాలో కిరణ్ ...ార్లగడ్డ, ఆదర్ష్, మురళీ మోహన్, ...ేఘా శ్రీ, సింధు తులాని ముఖ్య పా...్రలను పోషించారు. ఇండిపెండెన్స్ డే ...ందర్భంగా ఈ మూవీ నుంచి ఓ దేశ ...క్తి గీతాన్ని విడుదల చేశారు.

...ిందా రహేన్ తో డ్యూటీ' అంటూ సాగే ...ఈ పాట అడ్రినల్ రష్‌లా ఉంది. గూస్ ...ంప్స్ ఇచ్చేలా, నరనరాల్లో దేశభక్తిని ...గిల్చేలా ఈ పాట సాగింది. ఇక ఈ ...ాటకు ఆనంద్ మంత్ర బాణీ, డి.ఎస్. ...ాషా సాహిత్యం, శరవణ గాత్రం దేశ ...క్తి గీతంగా మార్చేసింది. జవాన్ల త్యా...ాల్ని, ధైర్య సాహసాల్ని గుర్తు చేసేలా ...ఈ పాట సాగింది. కె మ్యూజిక్ ఈ ...ూవీ ఆడియో రైట్స్‌ను దక్కించు...ంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్ర...ాల్లో చిత్రయూనిట్ బిజీగా ఉంది. ఈ ...ాంగ్ లాంచ్ ఈవెంట్‌లో మేజర్ ఎస్‌పీఎస్ ఒబేరాయ్ మాట్లాడుతూ .. "దేశం గురించి, సైన్యం గురించి సినిమా తీయడం ఆనందంగా ఉంది. అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. బయటి ఆహారాన్ని తినొద్దు. నాకు సినిమా ఇండస్ట్రీతో ఎలాంటి సంబంధం లేదు. ఈ మూవీ మంచి విజయం సాధించాలి' అని అన్నారు. నిర్మాత నివేద్య రెడ్డి మాట్లాడుతూ .. "ది ఇండియన్ బార్డర్' ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. అందరూ కలిసి ఓ ఫ్యామిలీలా కష్టపడ్డాం. నా తండ్రి కూడా సైనికుడే. ఈ చిత్రంతో మానవ సంబంధాలు, ఎమోషన్స్‌ని చూపించాలని అనుకున్నాం. సైనికులకు అంకితమిచ్చేలా మా సినిమా ఉంటుంది' అని అన్నారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాం గోపాల్ చౌదరి మాట్లాడుతూ .. "కిరణ్ నాకు ఓ మంచి కథను చెప్పారు. దేశ భక్తి మీద చెప్పిన ఈ కథ నాకు చాలా నచ్చింది. కిరణ్ అందరికీ సహాయం చేస్తుంటాడు. అందుకే నేను కిరణ్‌కి, నివేద్య గారికి నా వంతుగా సాయం చేశాను' అని అన్నారు. నటీనటులు : కిరణ్ యార్లగడ్డ , ఆదర్శ్, మురళీ మోహన్, మేఘశ్రీ, సింధు తులాని, గజ్జెల మాయ మశ్చేంద్ర, ఆదిత్య మీనన్, అజయ్, ఇందు ఆనంద్, ఉమ పూరుకొండ, షాన్, పాషా, తిరుపతి దొరై, రాజేందర్ తదితరులు

**సాంకేతిక బృందం**
బ్యానర్ : ఆర్ట్ ఇన్ హార్ట్ క్రియేషన్స్
నిర్మాత : నివేద్య రెడ్డి
దర్శకుడు : డి.ఎస్. బాషా
కథ :కిరణ్ యార్లగడ్డ
సంగీతం :ఆనంద్ మంత్ర
కెమెరా : నలినికాంత్ కొండపల్లి
ఎడిటింగ్ : కె. రమేష్
అసోసియేట్ ఎడిటర్ : అనుగోజు రేణుక
బాబుకొరియోగ్రాఫర్ : ఈ. రమేష్ మాస్టర్



# ధర్మస్థల నియోజకవర్గం" చిత్రంలోని 'ధర్మో రక్షతి రక్షితః' పాట

వుదయం సినిమా:

'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రంలోని 'ధర్మో రక్షతి రక్షితః ' పాటను ప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి , ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్ర బోస్ సంయుక్తంగా నేడు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. సినిమా కథాంశానికి అనుగుణంగా రూపొందించిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉందని చిత్ర బృందం తెలిపిందిధర్మో రక్షతి రక్షితః. పాట విడుదల కార్యక్రమంలో చిత్ర దర్శకులు జై జ్ఞాన ప్రభ తోట, చిత్ర నిర్మాత మెరుం భాస్కర్ సంగీత దర్శకుడు యేలెంధర్ , సినిమాటోగ్రాఫర్ వెంకట్ హనుమ, లతో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొని, సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట మాట్లాడుతూప్రముఖ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి చేతుల మీదుగా మా సినిమా పాట విడుదల కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. అలాగే మా ప్రతి అడుగులోనూ చంద్రబోస్ గారు వెన్నంటి ఉండి మమ్మల్ని ముందుకు నడిపిస్తున్నందుకు ఆయనకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 'ధర్మస్థల నియోజకవర్గం' చిత్రం త్వరలో ముందుకు రానుందని, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు జై జ్ఞాన తోట ప్రభ.నటరాజ, రాయంచ కొక్కుర, సుమన్, సాయికుమార్, రాజీవ్ కనకాల , రాజా రవీంద్ర, శివకుమార్ రామచంద్ర వారపు,వితిక షేరు, వరుణ్ సందేశ్, కస్తూరి, హారిక, కాలకేయ ప్రభాకర్, షఫీ, ఛత్ర పతి శేఖర్ ఐ డ్రీమ్ అంజలి, సత్య ప్రకాశ్ తదితరులు నటించారు.

టెక్నికల్ టీమ్
బ్యానర్: మూవింగ్ డ్రీమ్స్
సాహిత్యం: చంద్రబోస్
గానం: సాయి చరణ్
ఛాయాగ్రహణం: వెంకట హనుమ
ఫైట్స్: నందు మాస్టర్
మాటలు: అస్లాం
ఎడిటింగ్: సాయిబాబు తలారి
సంగీతం; మహా వీర్ యేలెంధర్
కళ: భార్గవచారి నౌండ్ల
నిర్మాత: మేరుం భాస్కర్
దర్శకత్వం: జై జ్ఞాన ప్రభ తోట



# ఈ చిత్రం అందరికీ కనెక్ట్ అవుతుంది 'అమీర్ లోగ్'

వుదయం సినిమా:

**హీరోలు MC హరి, మనోజ్, శశిధర్**

'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో MC హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా ప్రధాన పాత్రధారులు MC హరి, మనోజ్, శశిధర్ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. వారు చెప్పిన సంగతులివే..

'అమీర్ లోగ్' ఎంతో నేచురల్‌గా ఉంటుంది. సినిమాని చూసినట్టుగా ఉండదు. హైదరాబాద్ బస్తీలోకి వెళ్లినట్టుగా, ఆ బస్తీల్లో జీవిస్తున్నట్టుగా అనిపిస్తుంది. మా డైరెక్టర్ గారి అత్తగారి ఇల్లు, ఆ బస్తీలోనే షూటింగ్ చేశాం. అక్కడి వాళ్లంతా మా అందరినీ ఎంతో కేరింగ్‌గా చూసుకున్నారు.

'అమీర్ లోగ్' అవుట్ పుట్ చూశారు కాబట్టే మా దర్శకుడు రమణన్న గారు అంత కూల్‌గా ఉంటున్నారు. అనుకున్నది అనుకున్నట్టుగా తీయగలిగారు. సినిమా చూశాక మా అందరికీ ఎంతో కాన్ఫిడెంట్ వచ్చింది. మంచి ప్రొడక్ట్ మా చేతుల్లో ఉంది. దాన్ని ఇలా ప్రమోట్ చేసుకుంటున్నాం.

* రానా గారి టీం మా సినిమాని చూసింది. హైదరాబాద్‌లో ముందు ఫోకస్ పెట్టండి. ఆ తర్వాత అన్ని ఏరియాల్లో కవర్ చేయండని రానా గారు చెప్పారు. త్వరలోనే ఆయన కూడా సినిమాని చూస్తారు.* మా సినిమాలోని ఎమోషన్‌ను స్మరణ్ మ్యూజిక్ మరో స్థాయికి తీసుకు వెళ్లింది. ఆయన పాటలే ఈ చిత్రానికి ప్రాణం. ఆయన ఇచ్చిన మ్యూజిక్, ఆర్ఆర్‌తో సినిమా నెక్స్ట్ లెవెల్‌కి వెళ్లింది. * రెగ్యులర్ తెలుగు సినిమాల్లో ఉండేలా కాకుండా ఇందులో హిందీ ఎక్కువగా ఉంటుంది. తెలంగాణ, హైదరాబాద్ అంటే తెలీకుండానే కొన్ని పదాల్లో హిందీ, ఉర్దూ వచ్చేస్తుంది. మరీ హై లెవెల్లో కాకుండా సాధారణ జనాలకు అర్థమయ్యేలానే భాషను వాడాం. ఇక్కడి భాషకి, యాసకి అడ్రెస్‌లా మా 'అమీర్ లోగ్' సినిమా ఉంటుంది. భాష, యాసతో సంబంధం లేకుండా ఎమోషన్స్‌తో తీసిన ఈ చిత్రం అందరికీ కనెక్ట్ అవుతుంది.

# 'డార్క్ చాక్లెట్' సినిమా గురించి చాలా ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు



వుదయం సినిమా:

సినిమా అద్భుతంగా వచ్చింది. ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు: సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వదేవ్ రాచకొండరానా దగ్గుబాటి ప్రెజెంట్స్, విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి, శశాంక్ శ్రీవాస్తవయ, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ & స్పిరిట్ మీడియా డార్క్ చాక్లెట్ నుంచి కల్లో కల్లోలం సాంగ్ లాంచ్రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్నిను సగర్వంగా అందిస్తున్నారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. శశాంక్ శ్రీవాస్తవయ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తప్పకుండా ఈ సినిమా ఒక పెద్ద బ్యాంగర్ అవుతుంది. . బిందు మాధవి గారు చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. కచ్చితంగా మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తారు. త్వరలోనే థియేటర్స్‌లో కలుద్దాం.

డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ.. అందరికీ హ్యాపీ ఇండిపెండెన్స్ డే. 'కల్లో కల్లోలం' పాటలో ఈ సినిమా కథంతా నిక్షిప్తమై ఉంది. కాకపోతే అది అంత ఈజీగా పట్టుకోలేం. డార్క్ కామెడీ మూవీగా సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. త్వరలోనే ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. తప్పకుండా మీరు ఎంజాయ్ చేస్తారు.డైరెక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇందులో విశ్వదేవ్ వర్సటాలిటీ కనిపిస్తుంది. వివేక్ సాగర్ 'కల్లోలం' సృష్టించారు. వివేక్ సాగర్ లాంటి న్యూజ్ ఇండస్ట్రీకి ఒక బ్లెస్సింగ్. 'డార్క్ చాక్లెట్' కూడా ఆయన కెరీర్‌లో చాలా స్పెషల్ ఫిల్మ్ అవుతుంది.వేడుకలో మూవీ యూనిట్ అందరూ పాల్గొన్నారు.

# సినిమా MOVIE TIME!

# 'ది రెడ్ బ్యాగ్' ఆగస్ట్ 21న రిలీజ్



వుదయం సినిమా:

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ఈ మూవీకి రవి కుమార్ సీరపు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా విడుదల చేసిన పాటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచాయి.

ఈ క్రమంలో విడుదల తేదీని టీం ప్రకటించింది. ఆగస్ట్ 21న ఈ సినిమాని భారీ ఎత్తున రిలీజ్ చేసేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాల్ని రిలీజ్ చేసి విజయాలు అందుకున్న పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ వారు ఈ 'ది రెడ్ బ్యాగ్'ను రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున విడుదల చేయబోతోన్నారు. ఇప్పటికే సినిమాపై అందరిలోనూ అంచనాలు పెరిగాయి. ముమ్ముందు మరిన్ని ప్రమోషనల్ కంటెంట్‌తో హైప్‌ను పెంచనున్నారు.

ఈ చిత్రానికి ప్రియేష్ గురుస్వామి కెమెరామెన్‌గా, శివ శర్వాణి ఎడిటర్‌గా, శేఖర్ మోపురి సంగీత దర్శకుడిగా పని చేశారు

నటీనటులు : కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు.

# కొత్త దర్శకనిర్మాతలకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదు!

వుదయం సినిమా:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలి: నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ

హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త దర్శకులు, నిర్మాతలు, చిన్న బడ్జెట్ సినిమాలకు స్వేచ్ఛగా ఎదిగే అవకాశం లేకుండా పోతోందని నటుడు, దర్శకుడు షెరాజ్ మెహదీ తీవ్రస్థాయిలో ఆరోపించారు. చిన్న సినిమాల విషయంలో థియేటర్ల కేటాయింపు నుంచి ఓటీటీ, ఆడియో, శాటిలైట్, ఇతర భాషల హక్కుల వరకు అనేక సమస్యలు ఉన్నాయని, వీటిపై పరిశ్రమలోని పెద్దలు, స్టార్ హీరోలు స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'ఓ అందాల రాక్షసి' రీరిలీజ్ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో షెరాజ్ మెహదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమ సమస్యలపై ప్రశ్నిస్తే తనకు తెలుగు ఫిల్మ్ చాంబర్‌లో ప్రెస్ మీట్ నిర్వహించేందుకు అవకాశం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. దీంతో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా మీడియాతో మాట్లాడిన ఆయన.. తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్తవారికి ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.

**కొత్తవారిని అడ్డుకుంటున్నారు**

"సినీ పరిశ్రమలోకి కొత్తవారు రాకూడదన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయి. కొత్త దర్శకులు, నిర్మాతలు ఎన్నో కష్టాలు పడి సినిమా పూర్తి చేసిన తర్వాత సెన్సార్, క్యూబ్, పబ్లిసిటీ వంటి అంశాల పేరుతో అదనపు భారాలు పడుతున్నాయి. చివరకు సినిమా విడుదలకు కూడా అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇది మారాలి" అని షెరాజ్ మెహదీ అన్నారు.

చిన్న సినిమాలపై పరిశ్రమలో రాజకీయాలు, ఆధిపత్య ధోరణులు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా మార్కెట్ విస్తరిస్తున్న సమయంలో చిన్న నిర్మాతలకు మాత్రం అవకాశాలు తగ్గిపోవడం బాధాకరమన్నారు. క్యూబ్ వంటి సాంకేతిక సేవలకు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఈ సమస్యలను ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

థియేటర్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం

చిన్న సినిమాలకు థియేటర్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారనే ఆరోపణలతో ఏషియన్ థియేటర్స్‌కు చెందిన సునీల్‌తో పాటు పీవీఆర్, ఐనాక్స్ యాజమాన్యాలకు లీగల్ నోటీసులు పంపినట్లు ఆయన తెలిపారు.

**"ఫిల్మ్ చాంబర్‌లో అహంకారం పెరిగింది"**

తెలుగు ఫిల్మ్ చాంబర్ వ్యవస్థపైనా షెరాజ్ తీవ్ర విమర్శలు చేశారు.



"చాంబర్‌లో ప్యూన్ నుంచి ప్రెసిడెంట్ వరకు పరిశ్రమ సమస్యలు అందరికీ తెలుసు. కానీ నిర్ణయాలు తీసుకునే విషయంలో అక్కడ పనిచేసే వారికి ఎలాంటి స్వేచ్ఛ లేదనే పరిస్థితి కనిపిస్తోంది. సినీ పెద్దల్లో మమకారం తగ్గి అహంకారం పెరిగింది. పరిశ్రమను కాపాడాల్సిన వ్యవస్థలు కొందరి చేతుల్లో బొమ్మల్లా మారకూడదు" అని అన్నారు. తన పోరాటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపబోనని స్పష్టం చేశారు. అవసరమైతే చట్టపరమైన పోరాటం కొనసాగిస్తానని, ఇదే అంశంపై వందసార్లు అయినా ప్రశ్నిస్తానని తెలిపారు.

"ఈరోజు చిన్న సినిమాలకు ఎదురవుతున్న సమస్యలు రేపు పెద్ద సినిమాలకూ ఎదురయ్యే అవకాశం ఉంది. కాబట్టి సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పరిష్కరించాలి" అని సూచించారు.

"ఇది ఒక్కరి పోరాటం కాదు"

తాను చేస్తున్న పోరాటానికి వందలాది మంది మద్దతు ఇస్తున్నారని, భవిష్యత్తులో ఈ మద్దతు వేలల్లోకి మారుతుందని షెరాజ్ మెహదీ అన్నారు.

"నేను ఎవరికీ భయపడను. చట్టపరమైన పోరాటం చేయాల్సి వచ్చినా చేస్తాను. అవసరమైతే ఎంత దూరమైనా వెళ్తాను. కొత్త నిర్మాతలు, దర్శకులు, చిన్న సినిమాలకు న్యాయం జరిగే వరకు నా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు.

**భారీ స్థాయిలో 'ఓ అందాల రాక్షసి' రీ-రిలీజ్**

తాను దర్శకత్వం వహించి నటించిన 'ఓ అందాల రాక్షసి' చిత్రానికి అద్భుతమైన కంటెంట్ ఉందని షెరాజ్ మెహదీ తెలిపారు. ప్రేక్షకులు సినిమా చూస్తున్నంతసేపు కథలో లీనమయ్యేలా చిత్రాన్ని రూపొందించామని చెప్పారు. గతంలో ఎదురైన థియేటర్ల సమస్యలను అధిగమించి, సరైన సంఖ్యలో థియేటర్లు, ఓటీటీ, ఆడియో, ఇతర హక్కులను సాధించి త్వరలోనే 'ఓ అందాల రాక్షసి'ని భారీ స్థాయిలో రీరిలీజ్ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

సినిమా చిన్నదా.. పెద్దదా అన్నది కాదు. కంటెంట్‌కు అవకాశం ఇవ్వాలి. కొత్త దర్శకుడైనా, నిర్మాతైనా తన ప్రతిభను నిరూపించుకునే స్వేచ్ఛ ఉండాలి. అదే నిజమైన సినిమా పరిశ్రమకు బలం" అని షెరాజ్ మెహదీ అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : Sirikonda AUGUSTIN . RNI No.: APTEL/2013/52694. E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.